
అంజలి సామాగ్రితో వంటచేయటంలో
ఉన్న ఆనందం కనుగొన్నాను
KITCHEN PRESS (WITH 6 ST STEEL JALIS)
ONION CHOPPER
MEDUWADA MAKER
NUT CUTTER
VACCUM BASE JUICER
CONTAINER
GLASS AND SPOON STAND
VACCUM BASE NUT CUTTER
REVOLVING GLASS CARRIER
POTATO MASHER
VACCUM BASE COCONUT SCRAPER
THREE-IN-ONE (PEELING, CHIPSING & SCRAPING)
COMPARTMENT BOX
TOMATO SLICER
KITCHEN HELPER
3-WAY EGG SLICER
VACCUM BASE VEGETABLE CUTTER
LEMON SQUASHER
APPLE CUTTER
POTATO MASHER
SANDWICH TOASTER
VEGETABLE CUTTING TRAY

## లోకం పోకడం – ఊరమెన్





# ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

**దేశోద్ధారక కాశీనాథుని**

**నాగేశ్వరరావు పంతులుగారు**

స్థాపితం : 1908

**శివలెంక శంభుప్రసాద్**

సంపాదకుడు :

[1938–1972]

శుక్రవారం : 2–12–'83

రుధిరోద్గారి నామ సం. కార్తీక బ. త్రయోదశి

**సంపుటము 76 సంచిక 12**

సంపాదకుడు :

**శివలెంక రాధాకృష్ణ**

విడి ప్రతి వెల రు. 1-50

ఆరు మాసాల చందా రు. 42-90

పోస్ట్‌లో ఏడాది చందా రు. 85-80

**ఆంధ్రపత్రిక కార్యాలయము,**

గాంధీనగరం, విజయవాడ-520 003.


# విషయానుక్రమణిక


ముఖచిత్రం :

అమితాబ్ బచ్చన్

(ఫొటో : కాజాస్)




Imageads M-1807




## యక్షగానం

28–10–83 పత్రికపై నటి మాధవి ముగ్ధమనోహరంగా ఉంది. కే. శే. శ్రీమతి మాదిరెడ్డి సులోచనగారి — "యక్షగానం" సరికొత్త సీరియల్ ప్రారంభంలోనే మా యింటిల్లిపాదీ ఆకట్టుకొంది !

సపారె దేవరాజ్, సాకరె సురేంద్రనాథ్ (ఆదోని)

## మానస మురళి

శ్రీ కొడాలి సాంబశివరావుగారి 'మానస మురళి' లో మూడు విభిన్న స్త్రీ పాత్రలు, మానస, మురళి, చందన ఉదాత్తముగా ఉన్నాయి. వీటన్నిటికన్న మానస పాత్ర చిత్రణ అద్భుతము మనోహరంగా యుంది. విజయ్ జీవితంలో ఈ ముగ్గురు ప్రవేశించడము, దూరమవడము కూడా చాలా 'డ్రమటిక్'గా యుంది. కాని సీరియల్ పై మీరు వేసిన ఆఖరు చిత్రం ...; ఇన్స్పెక్టర్ విజయ్ మరల మురళికై చూడడము మగవాడి బలహీనతను సూచిస్తుంది.

కణుముల కృష్ణారావు (వాయల్పాడు)

## న్యూఢిల్లీ లేఖ

డా॥ జయదుబాషిగారి 'న్యూఢిల్లీ లేఖ' మీరు ఏ ఉద్దేశ్యముతో ప్రచురించుతున్నారోగాని, ఆయన వ్యాఖ్యలు అసంబద్ధముగాను, మత వైషమ్యాలు రెచ్చగొట్టేవిగా ఉంటున్నాయి. ఈ పెద్దమనిషి గత సంచికలో మహ్మదీయులను, క్రైస్తవులను కసాయివాళ్లుగా అభివర్ణించాడు. ది 14–10–83 నాటి సంచికలో ఆయన క్రైస్తవులు, మహ్మదీయులు తమ తమ సోదరులను, తండ్రులను చంపారు అని వ్రాశాడు. చేతిలో కలం ఉందికదా అని ఇష్టం వచ్చినట్లు వ్రాయడం సభ్యత అనిపించుకోదు. ఇక్కడో విషయం గమనించాలి. అశోకుడు కూడా సోదరులను చంపి సింహాసనాన్ని అధిష్ఠించాడు. అన్నదమ్ముల మధ్య జరిగిన 'కురుక్షేత్ర సంగ్రామము' ఈ గడ్డమీదే జరిగింది. ఆస్తి కోసం సోదరులను చంపిన ప్రబుద్ధులు ఉన్నారు. తండ్రిని చంపిన తనయులు ఉన్నారు. అంత మాత్రాన హిందువులందరూ సోదరులను చంపే వారేనా ?

అదే వ్యాసంలో మరోచోట ఆయన 'మతాభిమానం అధికంగా ఉన్నవారు తమలో తాము పోట్లాడుకున్నంత తీవ్రంగా బయటి వాళ్ళతో పోట్లాడరు' అన్నారు. అందుకు ఉదాహరణగా ఆయన ఇంగ్లండు–ఐర్లాండుల మధ్య, ఇరాన్ — ఇరాక్‌ల మధ్య యుద్ధాన్ని ప్రస్తావించారు. ఈ యుద్ధాలకు కారణాలు వేరే ఉన్నాయి. వాటిని మతం కోసం జరిగే యుద్ధాలుగా చిత్రించడం అవివేకం. మనదేశంలో గతంలో రాజపుత్రుల మధ్య, వివిధ సంస్థానాధీశుల మధ్య ఎన్ని యుద్ధాలు జరగలేదు ? వాళ్లలో ఐకమత్యం ఉండి ఉంటే మనకి ఆనాడు విదేశీ పాలన తప్పి ఉండేది కదా !

మరోచోట ఆయన లెబనాన్‌లో క్రైస్తవ, మహ్మదీయుల మధ్య జరుగుతున్న హిందూ–ముస్లిం, హిందూ–సిక్కు, హిందూ–క్రైస్తవ, హిందూ — హరిజనుల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని విస్మరించారు. వాళ్ళు అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్నారు కాబట్టి తుపాకులతో చంపుకుంటున్నారు — మనం కత్తులతో చంపుకుంటున్నాం. అంతే తేడా.

దయచేసి ఇతర మతాలను కించపరిచే వ్యాసాలను ప్రచురించవలదని నా ప్రార్థన.

డి. విజయభాస్కర్ (హైదరాబాదు)

## అన్ని తరాలకీ సరిపోయే జవాబు

21–10–83 వార పత్రికలో మీరు ప్రచురించిన శ్రీమతి టంగుటూరి సూర్య కుమారిగారి వ్యాసం చాలా బాగుంది. వ్యాసం దాదాపు 27 సంవత్సరాలనాటి దయినా కొన్ని విషయాలు నాటికీ నేటికీ ఏనాటికీ అన్నితరాలకూ సరిపోయే భావాలు కలిగి వుంటాయి.

"సంతోషమే సగం అందం" వ్యాసంలో అన్నట్టు నిజమైన స్థిరమైన అందం ఎపుడూ మనస్సుకూ భావాలకూ సంబంధించి వుంటుంది. రూపం అశాశ్వతం. వ్యాసకర్త అభినందనీయులు.

సి. వెంకూబాయి, గోపి సరోజని (ప్రొద్దుటూరు)

## బ్రాహ్మణ వివాహ ఉచిత సమాచార కేంద్రం

మీ అందరి సహాయ సహకారాలతో 26–1–1983 నుండి బ్రాహ్మణ వివాహ ఉచిత సమాచార కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం.

వధువుల సమాచారం పెరుగుతూ, వరుల సమాచారం తగినంత అందని కారణాన మా కార్యకలాపాల్ని అనుకున్నంత విజయవంతం చేయలేకపోతున్నాం.

మీరెరిగిన బ్రాహ్మణ వరుల సమాచారాన్ని మాకందించండి — మేము తలపెట్టిన ఈ యజ్ఞంలో మీరూ మీ పాత్ర నిర్వహించి మాలో సహకరించండి.

సమాచారం మీ కుటుంబ సభ్యులకే పరిమితం కానక్కరలేదు. బంధుమిత్రుల సమాచారం కూడా ఇవ్వచ్చు.

మీరిచ్చే సమాచారం బ్రాహ్మణ సమాజ వికాసానికి, తోటి ఆడబడుచుల వివాహ సమస్యలను పరిష్కరించడానికి ఉపకరిస్తుంది.

మీకు కావలసిన బ్రాహ్మణ వధూవరుల సమాచారాన్ని మానుంచి పొందడానికి సంశయించకండి.

సమాచారాన్ని ఈ క్రింది నమూనాలో పంపండి. 1. వరుని పూర్తి పేరు, వయస్సు, ఎత్తు, శాఖ, గోత్రం, విద్యార్హతలు, ఉద్యోగం, తండ్రి పేరు, అడ్రసు, అభిరుచులు, కోరికలు — ఇంకా — ఇంకా — సదా మీ సేవలో —

బ్రాహ్మణ వివాహ ఉచిత సమాచార కేంద్రము, శంకరమఠం, హనుమాన్‌పేట, విజయవాడ–3.

## గమనిక

18–11–83 సంచికలోని 'వ్యక్తిగతం' శీర్షికలోని రెండవ కాలమ్‌లో హయిటీ దేశస్థుడు 'క్లైయిర్ లియన్ వార్సిస్సె' అని పడింది. అతని పేరు 'క్లైయిర్‌వియన్ నార్సిస్సె' అని పాఠకులు గమనించకోరుతున్నాము. —సం.

[66 వ పేజీ చూడండి]

# ఇటలీ - భారతదేశం :
# రోమన్‌లూ - హిందువులూ

## న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

ఆస్ట్రియా నుంచి ఇటలీ వెళ్లండి, మీరు ఇంచుమించు యూరోపు బయటికివచ్చినట్లే. భారతీయులు ఎంత ఆసియావారో ఇటలీవారు అంత యూరోపు వాళ్లు. భారతీయులు భారతీయులే. వారి ప్రపంచమే వేరు. అలాగే ఇటలీ దేశస్థులు కూడా. వాళ్ల నాగరికత వాళ్ల దేశంలో పుట్టినది, ఎరువు తీసుకున్నది కాదు. మన నాగరికత సయితం ఇంతేకదా! మీరు ఇటలీలోకి ఉత్తరం నుంచి వచ్చినా (నాలాగ), రోమ్ ద్వారా వచ్చినా (ఎక్కువమంది ఇలాగే వస్తారు) మీరు యూరోపు ఖండం నడిబొడ్డుకి వచ్చినట్లే లెక్క. ఇది యూరోపు సంస్కృతికి కేంద్రం. భారతదేశం ప్రవేశించే ఒక విదేశీయుడికి ఇలాగే అనిపిస్తుంది. శతాబ్దాలు వెనక్కి వెళ్లి బయటి ప్రభావానికి దూరంగా ఉన్న ఒక సాంస్కృతిక సమ్మేళనంలోకి దిగినట్లు అనిపిస్తుంది. ఇటలీ, భారతదేశాల మధ్య పోలికలు చాలా ఉన్నాయి. ఇంకొక విధంగా చెప్పాలంటే రోమన్‌ల మధ్య, హిందువుల మధ్య పోలికలు చాలా ఎక్కువ. ఒకప్పుడు వాళ్ల వేషాలు కూడా ఒకదానికొకటి పోలి ఉండేవి. ఇద్దరూ అతి ప్రాచీనమయిన నాగరికతల వారసులే. ఇద్దరికీ ఈ సంగతి తెలుసు.

రోమ్ ఒక ఆధునిక నగరం. కాని, ఈ నగరంలో పాతకాలాల అవశేషాలు చాలా ఉంటాయి. ఫోరమ్, పాన్‌థియన్ వగయిరాలు. పాన్‌థియన్ ఒక పురాతన దేవాలయం. యూరోపులో ఆలయాలు కట్టినవాళ్లు రోమన్‌లూ, గ్రీకులూ మాత్రమే. తక్కినవాళ్లు మసీదులూ, చర్చిలూ కట్టుకునేవాళ్లు. అసలు ఇటలీని చూడాలంటే రోమ్ చర్చిలని చూడాలి. నేను వెనిస్ మీదుగా రోమ్ వెళ్లాను. మన వారణాసి అంత పాత ఊరు వెనిస్. ఈ రెండు నగరాల మధ్యా సంబంధాలు ఉండేవి అంటారు చరిత్రకారులు. కొంత కాలంగా వెనిస్ కుంగిపోతోంది. మరొక వెయ్యి సంవత్సరాలలో అది అడ్రియాటిక్ సముద్రంలోకి కూలిపోతుందేమో ! వెయ్యేళ్లంటే చరిత్రలో పెద్ద కాలమానం ఏమీ కాదు. వెనిస్‌లో సెయింట్ మార్క్స్ కేంద్రం ఒకటి ఉంది. ఇది చాలా పెద్దది. వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ అంత పెద్దది. ఇక్కడికి వెడితే ఒక పాశ్చాత్య దేశానికి వెళ్లినట్లు ఉండదు.ఇక్కడి పెద్ద చర్చి మీద రష్యాలో చర్చిల మీద ఉన్నట్లు ఉల్లిపాయల లాంటి గుమ్మటాలు ఉంటాయి. యూరోపులో ఇలాంటివి చాలా అరుదు. వెనిస్‌లోని భవనాలు కొన్ని తూర్పు వయిపు భవనాల లాగే ఉంటాయి వాటి నగిషీల విషయంలో.

సుమారు ఒక శతాబ్దంముందు ఫ్లోరెంస్ ఇటలీకి రాజధానిగా ఉండేది. చాలా అందమయిన ఊరు. యూరోపులోకెల్లా అందమయిన నగరం. అయిదు లక్షలకన్నా, జనాభా ఉండదు. దానిని 300 సంవత్సరాలపాటు ఏలిన మెడిసీ కుటుంబం వాళ్లు తమ నగరాన్ని బాగా అదుపులో ఉంచుకోవటానికని ఫ్లోరెన్స్‌ని ఎక్కువగా విస్తరించనివ్వలేదు. ఆర్నో నదిని దాటితే సాంతాక్రోస్ చర్చిలోకి వెళ్లవచ్చు. ఇది చాలా పెద్ద చర్చి. ప్రపంచంలోకెల్లా మూడవది. బయటినుంచి చూస్తే అంత గొప్పగా ఉండదుకాని లోపలికి వెళ్లండి అది మరో ప్రపంచం. దాని రంగుల గాజు కిటికీలలోనుంచి ఇటలీ ఎండ పడి లోపలి చోటునంతటినీ అద్భుతంగా మార్చేస్తుంది. లోపల ఎన్నో గొప్పవాళ్ల సమాధులు ఉంటాయి. అక్కడ నుంచుని ఉంటే అనిపిస్తుంది: ''ఆధునిక యూరోపు పుట్టిన చోటు ఇదే అని. గెలీలియో, డా విన్సీ, మాకియవిల్లీ,రోస్సినీ... ఇంకా ఎన్నో పేర్లు. ఒకే కట్టడం కప్పుకింద ఇందరు ప్రముఖులు ఇటలీలో కాకుండా ఇంకెక్కడ ఉంటారు !

యూరోపు ఖండ వాసులలో ఇతరులు ఇటలీ దేశస్థులని తక్కువగా చూస్తారు. ఉత్తరాది వాళ్లయితే మరీను. ఇటలీవాళ్లకి ఆవేశం ఎక్కువ, నిలకడ తక్కువ అంటారు. సోమరిపోతులుగా కూడా కొంత పేరు పొందారు. ఇటలీలో ప్రభుత్వాలు కొన్ని నెలలకి మించి నిలవవు. వాళ్ల ఆర్థిక వ్యవస్థ అంత గట్టిది కాదు. ఇటలీకి అప్పులు అధికం. ఇదంతా ఏమో కాని ఇటలీలో మనుష్యులు చలాకీగా ఉంటారు. బ్రిటన్, ఫ్రాన్సులో వాళ్లకన్నా సంతోషంగా ఉన్నట్టు కనపడుతారు. ఒక విధంగా రోమ్ ఢిల్లీలాగే ఉంటుంది— అంత సందడి ! మోటారు కారులు నడిపేవాళ్లు, స్కూటర్‌వాలాలు ఒకటే హడావిడి చేసేస్తూ ఉంటారు. పోలీసువాళ్లని వేళాకోళం చేస్తారు, ఎక్కడయినా పార్కు చెయ్యరాదంటే అక్కడే చేస్తారు. బొంబాయి, ఢిల్లీలలాగే రోమ్‌లో శబ్దాలు ఎక్కువ. లండన్ లాగ స్తబ్దుగా ఉండదు. ఇక్కడ అందరికీ అందరూ తెలుసా — అనుకుంటాము !

వాటికన్ అన్నది రోమ్‌లో ఒక భాగం. చాలా చిన్నచోటు. జనాభా 500 ఉంటుంది. వైశాల్యం కొన్ని చదరపు కిలోమీటరులు ఉంటుంది. కాని, ఇక్కడికి రోజూ వేలమంది వచ్చి వెడుతూ ఉంటారు. ఆదివారంనాడు మరీను. [అందరూ క్రయిస్తవులు కారు.] ఎందరో అక్కడికి భోజనాలు తెచ్చుకుని తింటూ ఉంటారు. సెయింట్ పీటర్ చర్చి చాలా పెద్దది— లోపలికి వచ్చివెళ్లే జనం, చీమల లాగ కనిపిస్తారు ! దీనిని నిర్మించిన వాళ్లకి ఎంత ఓపికో, అనుకుంటాము. వాటికన్ అంటే పోప్‌ల రాజధాని. మొదటి పోప్‌లు వట్టి మతాధిపతులు కారు. వాళ్ల చక్రవర్తులు, యోధులు — అవసరం వస్తే కుట్రలు పన్నేవాళ్లు, ప్రాణాలు తీసేవాళ్లు. నేను వెళ్లిన ఆదివారం నాడు జనానికి కనపడి ఉపన్యాసం ఇచ్చిన పోప్ చాలా బలహీనంగా కనిపించాడు నాకు. ఆయన కంఠం మాత్రం అంత నీరసంగా వినపడలేదు నాకు. ★

# బొమ్మ

(ఆ లే ఖ్యం)

శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు

మరి నేను చెబితే నమ్మరు. కాని, నాకు చెప్పక తప్పదు. బొమ్మ నన్ను కొనమని మరీ మరీ అడిగింది. నేనూ మొదట నమ్మలేదు. ముందుకు సాగిపోయి కూడా జేబులోంచి, చర్మంలోంచి, గుండెలోంచి ఏదో చెయ్యి తడిమినట్లనిపించి, వెనక్కి వచ్చి, పిలుపు విని, ప్రార్థన ఆలకించి బేరమాడకుండా వాడెంత చెప్పాడో అంతకే తీసుకున్నాను బొమ్మని. ఎవరు హర్షిస్తారు ఈ నా చర్యను. బుద్ధి పుట్టగానే సారాకొట్లో దూరే వారో — ఊహ తట్టగానే చెరువులో పడిపోయే వారో ?

టేబిలుమీద బొమ్మని అలంకరించాను. నా నలుగురయిదుగురు స్నేహితులూ మా యింటికి రావడం మానేశారు. నా అభిరుచిని అభినందించమని వారిని కోరలేదు నేను. వాళ్ళు కూడా కారణాలు చెప్పలేదు. అప్పుడప్పుడు బొమ్మని చూచినప్పుడు నాక్కూడా ఎందుకు కొన్నానా అనిపించేది. నిజంగా నన్నడిగిందా లేదా? బొమ్మ నన్ను మోసగించిందా, లేక నన్ను నేనే మోసగించుకున్నానా ? ఈ నిర్జీవ ప్రతిమకి ఇంత శక్తి నేనే ఆరోపించి ఉండాలి. లేక నా నిమిత్తం లేకుండానే ఇంకొకణ్ణి అడిగి, ఆకర్షించుకొని కొనిపించుకొనేదేమో కొంటెరకం ! నేను అదష్టవంతుణ్నే కాబోలునని అనుమానం కలిగింది.

ఎందువల్లనంటే, ఈ బొమ్మ నా టేబిలు మీద కూర్చున్నప్పటి నుండి నా సిగరెట్లు ఖర్చు తగ్గిపోయింది. అప్పులన్నీ తీర్చివేశాను. రెండు మూడు మనియార్డర్లు వచ్చాయి. ఇంక కొన్నాళ్ళు చూసి బ్యాంక్ అకౌంట్ ప్రారంభించాలనుకుంటున్నాను. చాకలివాడు మూడో రోజుకే బట్టలు తెచ్చాడు. పద్యపుస్తకం వెంటనే దొరికింది. మా యింట్లో పిల్లులు దెబ్బలాడుకోవడం మాని వేశాయి (బహుశా అది కేవలం తాత్కాలిక యుద్ధ విరామసంధి అయినా కావచ్చును.)

నా కాలంలో నూటికి తొంభైవంతులు వీధిలోనూ, పదివంతులు ఇంటిలోనూ గడపడానికి అలవాటు పడ్డ నేను, సెబాస్, ఇప్పుడు ఆదర్శ గృహస్థుణ్నయాను. మరేముంది, ఈనాడు నాకంటె సంతుష్టుడీ మూడు జగంబుల పూజ్యుండు !

చెడిపోతున్న వాళ్లను క్షమించకూడదనీ, జీవితమంతా సిరాబుడ్డిలోనే గడపకూడదనీ, ఉన్న ఆశయాలను తోరణాలు కట్టి మెళ్లో మాత్రమే వేసుకోవాలనీ, వేళపట్టున నిద్రపోవాలనీ నిశ్చయించుకున్నాను.

అన్నింటికన్నా గొప్ప సంగతి సొంతంగా ఆలోచించడం మానివేశాను. గొప్ప బెడద వదలిపోయింది. బొమ్మ చేతిలో కీలుబొమ్మనైపోయాను. రూళ్లు గీసి కాపీలు రాసుకుంటుంది నామీద, తెల్లకాగితంలాగ పడుక్కుంటాను నేను.

ఉదయం కాఫీ ద్రావకంలో ప్రతిబింబించే నా ముఖం నాకెంతో కృతజ్ఞత కనబరుస్తుంది. నేను నవ్విన నవ్వును మళ్లీ నాకు ఇచ్చివేస్తుంది. మధ్యాహ్నం భోజనానంతరం ఇదే అనుభవం. తాంబూలచర్వణం చేస్తూ ఉంటే అద్దంలో నా ముఖం నెమరువేస్తుంది. నా కళ్లు కుశల ప్రశ్న వేస్తాయి. రాత్రి మంచం భావగీతం పాడుతుంది. గడియారం జోకొట్టుతుంది.

నాకు శిల్పమన్నా శిల్పులన్నా విసుగుపుట్టిపోయింది. ఈ బొమ్మను తప్ప ఇంక దేన్నీ మెచ్చుకోవలసిన అవసరం లేదని రూఢి అయిపోయింది. ఏ లోపం లేకుండా తీర్చిదిద్దినట్లుగా ఉండడమే దీని లోపమని నా శిల్పిమిత్రుడొకడు విమర్శించాడు. నిజాన్ని వక్రోక్తితో చెప్పడమే శిల్పానికి పరమార్థం అన్నాడు. చర్మ చక్షువు ఇచ్చే సాక్ష్యం అసమగ్రమని వాదించాడు.

నేను చాలా ఓర్పుతో విన్నాను. నాకు వాడి మాటలు బోధపడలేదు. నా బొమ్మని చూసి ఈర్ష్యతో అంటున్న మాటలని మాత్రం నిశ్చయించుకున్నాను. ఏమయినా వాడు బుకాయింపులో నేర్పరి. నాకు వాదించడం చేతకాదు. చాలా పారిభాషిక పదాలతో నన్ను బోల్తా కొట్టించాడు. కొంతదాకా ఈడిగిలబడ్డాను — కలర్, కాంపోజిషన్, పెర్‌స్పెక్టివ్ అంటూ ఉప్పెనలాగ వాడు తిరగబడి, డైనమో, వెర్టిగో, పెనంబ్రా, క్యూబా అన్నాడు. నాకు జబ్బుచేసి ఇప్పుడే పథ్యం తింటున్నాను.

బొమ్మ మాట్లాడుతుందా అని కొందరు వేసే చచ్చు ప్రశ్నకి జవాబివ్వకుండానే మా యిద్దరిమధ్యా జరిగే సంభాషణను దాచవలసినంత మాత్రం దాచి, మిగిలినది బైటపెడుతున్నాను.

''...అని నువ్వన్నప్పుడు నాకు సిగ్గేసింది. నీకెందుకు పోనిస్తూ.''

''ఊరుకోకూడదు. ఇవాళ ఇదయింది రేపు మరొకటవుతుంది. చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి.''


''నలుగురితో చావు పెళ్లితో సమానం.''

''నలుగురితో పెళ్లి చావుతో సమానం.''

ఈ విధంగా మా సంభాషణ సాగుతూ ఉంటుంది. ఇందులో బొమ్మ మాటలేవో, నా మాటలేవో అడగవద్దు. అయినా బొమ్మతో సంభాషణ ఇలాగే ఉంటుంది. నా మాటలు బొమ్మవైనా బొమ్మ మాటలు నావైనా మించిపోయిం దేదీలేదు.

చేసుకున్న పాపం లాంటిది కొనుక్కున్న బొమ్మ.

ఆంధ్రపత్రిక జూన్ 25 1941 సంచిక నుంచి



# రాజకీయాల్లో రాస క్రీడలు



దేశాన్ని పాలించేవారి నైతిక విలువల గురించి శ్రీమతి థాచర్ ఎక్కువగా పట్టించుకోవటానికి కారణం— విమర్శకులకు భయపడికాదు కానీ 'గత చరిత్ర'ను దృష్టిలో వుంచుకుని అనిపిస్తోంది. మొన్నీమధ్య పెళ్ళీ పెటాకులు లేకుండానే, ఓ ప్రముఖ రాజకీయ నాయకుని దయవల్ల ఓ అమ్మాయి తల్లి కాబోతోందన్న వదంతి బుస్సుమని లండనంతా వ్యాపించింది. గతంలో అంతే— బెంజమిన్ డిస్రేలీ టోరీపార్టీ నాయకునిగా బాధ్యత స్వీకరించాడు. అప్పటికి ఎన్నికలు దగ్గర్లో వున్నాయి.

అతని ప్రత్యర్థి పామర్‌స్టన్. అప్పుడే డెబ్బయవ పుట్టిన రోజు జరుపుకున్నాడు. అదే సమయంలో రాజకీయ గూఢచారులు డిస్రేలీ దగ్గరకు ఓ వార్త మోసుకెళ్ళారు. అదేవిటంటే, ఆ ముసలాయన ఒకరికి చట్ట విరుద్ధంగా గర్భం చేసాడని.

"ఇదెక్కడా బయటపడకుండా చూడండి. ఇది బయట పడిందంటే, ఎన్నికల్లో మొత్తం తుడిచిపెట్టేస్తాడు" అన్నాడు డిస్రేలీ.

రాజకీయాల్లో రాసక్రీడలు ప్రభుత్వానికి బెడద తెచ్చిపెడతాయి. రాజకీయాల్లో నైతిక విలువలు వుండాలంటున్నప్పట్నించీ ఇవి మరీ బెడదగా తయారయ్యాయి. గొప్ప శృంగార జీవితాన్ని గడిపికూడా బయటపడకుండా తప్పించుకున్న చిట్టచివరి పెద్ద రాజకీయ నాయకుడు పామర్‌స్టన్ అయివుండేవాడు, కానీ కోటలో పడకగదుల దగ్గర అతను చేస్తున్న విచ్చలవిడి శృంగారానికి, విక్టోరియా మహారాణి అతన్ని మెడబెట్టి బయటకు గెంటింది.

వాళ్ళు వీళ్ళతో పోవటం, వీళ్ళు వాళ్ళతో పోవటం, వ్యభిచరించటం, పిల్లలచేత వ్యభిచారం చేయించటంలాంటి విషయాలకు ఎప్పుడూ అంతం లేదు. కానీ వాటి గురించి ప్రజల దృక్పథంలో




మార్పు వచ్చింది. అందుకు పత్రికలు దోహదం చేసాయి. వ్యక్తిగత వ్యసనానికి, ప్రజాజీవితంలో నైతిక విలువలకి మధ్య చాలా తేడా వుందని దేశం దృష్టికి తెచ్చిన వాడు డబ్ల్యు. టి. స్టెడ్. ఆయన పాల్‌మాల్ గెజిట్—పిల్లల్ని కొని వాళ్ళని వ్యభిచారంలోకి నెట్టడం లాంటి విషయాలను బయట పెట్టింది. అసలు ఆయనే ఓ పిల్లను కొన్నాడు. తర్వాత అందుకు జైలు కెళ్ళాడు.

యుద్ధం తర్వాత నీతి గురించి ప్రజల్లో వచ్చిన మార్పు, రాజకీయ నాయకులకు అంతగా గుణపాఠం చెప్పలేదనిపిస్తోంది. కానీ కన్సర్వేటివ్ పార్టీ వాళ్ళకు మాత్రం ఈ నీతి ఉచ్చులా తయారయింది. శ్రీమతి థాచర్‌కు ముందు వున్న రెండు 'టోరీ' ప్రభుత్వాలు రాసక్రీడల అభియోగాలతో నిండిపోయింది. మంత్రుల్ని ఎగతాళి చేసారు. ఎవర్ని నమ్మాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

ఇక్కడ తమాషా ఏవిటంటే, ప్రజా జీవితాల్లో శృంగారానికి సంబంధించిన నీతి నియమాలు పట్టు సడలుతున్నాయి. రాజకీయ నాయకుడు నీతి తప్పితే మాత్రం మచ్చతెచ్చిపెడుతున్నాయి. అయినా ఈ వార్తలు కూడా అంతగా సంచలనం కలిగించటంలేదు.

ఇరవై ఏళ్ళ క్రితం పత్రికలవాళ్ళకీ, రాజకీయనాయకులకీ బాగా తెలిసిన శృంగార ఉదంతం ఒకటుంది. అది — యుద్ధ శాఖమంత్రి జాన్ ప్రొఫ్యూమోకు క్రిస్టిన్ కీలర్ అనే అమ్మాయితో గల సంబంధం. ఈ విషయంలో జాన్ ప్రొఫ్యూమో చాలా నిర్లక్ష్యంగా తిరిగాడు. స్టెఫెన్ వార్డు ఏర్పాటు చేసిన విందుల్లో పాల్గొనేవాడు. ఈ స్టెఫెన్ వార్డు బోలెంతమంది అమ్మాయిల్ని తన దగ్గర పెట్టుకుని వాళ్ళని ఎన్నో రకాలుగా ఉపయోగించుకునేవాడు. ప్రొఫ్యూమో, మిస్ కీలర్ క్లయిడెన్‌లో వున్న ఈత కొలనులో కలిసి ఈదులాడారు. అదేచోట రష్యా నావికాదళానికి చెందిన మనిషితోకూడా సంబంధం పెట్టుకుంది ఈమె.

అసలు ఈ కథ అనుకోకుండా వార్తల్లోకెక్కడం ప్రారంభించింది, మిస్ కీలర్‌ని కోర్టువారు సాక్షిగా పిలిపించినప్పుడు. ఆమెను ఆరాధించే ఓ వెస్ట్ ఇండియన్ మారణాయుధాలతో ఆమెను గాయపరిచాడు—అదీ కేసు. ఆమె ఇంట్లోనే జరిగిన ఈ సంఘటనతో తనకు ఏమాత్రం ప్రమేయం లేదని ప్రొఫ్యూమో అప్పటి ప్రధానమంత్రి హెరాల్డ్ మాక్మిలన్‌తోనూ, హౌస్ ఆఫ్ కామన్స్ లోనూ అబద్ధమాడేసాడు. దాంతో అతని అబద్ధం మంచి ప్రచారంలోకి వచ్చింది. పైగా ఆయన యుద్ధశాఖ మంత్రి కావటం చేత, దేశ భద్రతకు సంబంధించిన విషయమయింది. తర్వాత ఈ విషయం గురించి మామూలుగా లార్డ్ డెన్నింగ్ చేత విచారణ జరిపించారు. తేలిందేమిటంటే, ఈ వదంతులు నిరూపించటానికి తగిన ఆధారాలు లేవని. 'ప్రయివేట్ ఐ' మాత్రం ప్రజల నాడిని దృష్టిలో పెట్టుకుని, మాక్మిలన్ ప్రభుత్వాన్ని నీతి నియమాల్లేని విశృంఖల శృంగారపూరితమైన రోమన్ సామ్రాజ్యపాలనయొక్క అంతిమ దశతో




పోల్చుతూ ఓ కార్టూన్‌ను ప్రచురించింది. తర్వాత కొద్ది రోజుల్లోనే మాక్మిలన్ తన పదవికి రాజీనామా చేసాడు — ఆరోగ్యం సరిగా లేదనే మిషతో. ఈ రాసక్రీడలు ఉదంతం, తర్వాత ఎన్నికల్లో వాళ్ళ పార్టీ ఓడిపోవటానికి బాగా పని చేసిందనే చెప్పాలి. లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది.

ప్రొఫ్యూమో ఉదంతం తర్వాత పదేళ్ళకు ఎడ్వర్డ్ హీత్ ప్రభుత్వంకూడా రాజకీయాల్లో వ్యభిచారంవల్ల దెబ్బతినింది. మరో రక్షణమంత్రి, లార్డ్ లాంబ్‌టన్ రాజీనామా చెయ్యాల్సి వచ్చింది — ఈయన ఉంపుడుగత్తె భర్త ఫ్లీట్ స్ట్రీట్‌లో ఫొటోలు అమ్ముతున్న విషయం బయటకొచ్చిన తర్వాత. ఆ ఫొటోల్లో దృశ్యం ఏవిటంటే — మంత్రిగారు మరిద్దరి ఆడవాళ్ళతో పడకమీద వుండటం. ఈ ఫొటోల విషయం










# రాజకీయాల్లో...

అంతటితో ఆగిపోతే పెద్దగొడవ జరిగివుండేది కాదు. పైగా దేశభద్రతకు సంబంధించిన విషయమయింది. నార్మాలెవి అనే ఆమె డైరీలో 'జెల్లికో' పేరువుంది.

ప్రధాన మంత్రిగారు లార్డు జెల్లికోను పిలిపించారు. ఈ లార్డు జెల్లికో హౌస్ ఆఫ్ లార్డ్సులో వాళ్లపార్టీ నాయకుడు. ఆయన వ్యభిచారిణులతో తనకు గల సంబంధం గురించి అబద్ధం చెప్పలేక రాజీనామా చేసేశాడు. నిజానికి 'లెవి' గురించి ఆయనకు తెలీదు. 'లెవి' తన డైరీలో రాసుకున్న 'జెల్లికో' అనే మాట ఓ స్థలం పేరు. అక్కడ ఆమె తన క్లయింట్లను కలుసుకునేది. అయినా ఈ విషయం మరీ పెద్దదయి, చివరికి ప్రభుత్వ ప్రతిష్ఠని బాగా దెబ్బతీసింది.

ఇప్పటి పార్కిన్‌సన్ కేసు పాతవాటితో




పోల్చటానికి లేదు– ప్రస్తుత ప్రభుత్వం కొన్ని నైతిక విలువల గురించి మంచి పట్టుదలతో వున్నా.

కన్సర్వేటివ్ నాయకులకు ఇప్పుడు భయం పట్టుకుంది. ఈ ఉదంతం మీద పత్రికల వాళ్ళ కన్నుపడింది. బారుల్లోనూ దీని గురించే చెప్పుకోవటం. దేశంలోని గోల్ఫ్ క్లబ్బుల్లోనూ, పార్టీ ప్రసంగాల్లోనూ ఇది చోటు చేసుకుంది. ఇట్లా పార్కిన్‌సన్ వ్యక్తిగత ఉదంతంవల్ల 'నైతిక విలువలు కలిగివున్న ప్రభుత్వం' అని పేరు తెచ్చుకున్న ఈ ప్రభుత్వం పడిపోవటం మొదలవుతుందేమో తెలీదు.

('గార్డియన్' పత్రిక ఆధారంగా)

— బాబు ★

# నవ్వే కళ్లలో...?

సిహెచ్. సుందరరామయ్య



ప్రతి మనిషికి నిత్యము జీవితంలో ఎన్నెన్నో సంఘటనలు ఎదురౌతూనే వుంటాయి. జీవనసరళి అనుకోని మలుపులు తిరగటానికి ఒక్కొక్కప్పుడు ఈ సంఘటనలే కారణం! అయితే జీవితంలో జరిగిన ప్రతి సంఘటన మంచికైనా దారి తీయవచ్చు! లేదా చెడుకైనా దారి తీయవచ్చు! అది ఆ వ్యక్తి యొక్క అదృష్ట దురదృష్టాల మీద ఆధారపడి వుంటుంది.

'జీవితంలో ఏంజరిగినా అంతా మన మంచికే అనుకొని ముందుకు సాగిపోవాలి!' అని మన శ్రేయోభిలాషులు ఓదార్చడానికి చెప్పే మాటలను ఒకప్పుడు నేను హాస్యాస్పదంగా తీసుకొనేవాణ్ణి! అది కేవలం మనిషికి ధైర్యాన్ని కల్గించేందుకు బోధించే హిత వచనాలనీ రేపటి రోజు మీద ఆశ కల్పించటానికి ఆడే నాటకమని, పరిహాసం చేసేవాణ్ణి! ఏదైనా తన దాకా వస్తే కాని తెలియదంటారు... ఆనాటి అభిప్రాయాన్ని మార్చుకొని నా అజ్ఞానానికి సిగ్గుపడాల్సిన పరిస్థితి నా జీవితంలో ఇంత త్వరగా వస్తుందనుకోలేదు. ఇందుక్కారణం ఆరోజు జరిగిన సంఘటన! ఆ సంఘటనే జరక్కుండా వుంటే నా జీవన బాటలో ... ఎన్ని బాధల అగాధాలు ఏర్పడి వుండేవో? ఓ అమాయకురాలి గుండెలో ఎన్ని కన్నీటి 'లావా'లు విరజిమ్మి వుండేవో...?

* * *

నేను, మధు వాల్తేర్ స్టేషన్లోకి అడుగు పెట్టేసరికి ప్లాట్‌ఫామ్మీద గోదావరి ఎక్స్‌ప్రెస్ సిద్ధంగా వుంది.

ఇద్దరం రిజర్వేషన్ బోర్డు దగ్గరకు వెళ్లాం.

పర్సులోంచి టిక్కెట్టు తీసి చార్ట్‌లో బోగీ నంబరు కోసం వెదికాడు మధు.

ఇద్దరం కల్సి బోగీ దగ్గరకు వెళ్లాం.

లగేజీని తన బెర్తుమీద వుంచి మధు ప్లాట్‌ఫామ్మీదికి వచ్చాడు.

'ఆనంద్ నేను పదేపదే చెప్తున్నానని అనుకోవద్దు! మరోసారి నేను చెప్పిన విషయం ఆలోచించు!' అంటూ సూటిగా నా కళ్లలోకి చూశాడు మధు.

నేను సూటిగా అతని ముఖంలోకి చూడలేక పోయాను. అతనికి సమాధానంగా తలవూపాను.

'వైజాగ్‌లో సెమినార్ ఏర్పాటు చేశారని తెలియగానే నేనెంతో సంతోషించాను. ఎందుకో తెలుసా? నిన్ను చూడటమే కాకుండా నీ మనసు మార్చటానికి నాకో చిన్న అవకాశం దొరికినందుకు...'

నేను మాట్లాడలేదు.

'అయామ్ రియల్లీ సర్‌ప్రయిజ్డ్...! ఇలాంటి పరిస్థితిని నీవు చేతులార తెచ్చుకొంటావని నేను కలలో కూడా వూహించలేదు.'

నీవే కాదు! నేను కూడా వూహించలేదు— అనాలనుకొన్నాను. కాని గొంతుపెగిలి మాటలు రాలేదు.

'ఇంత చెప్పినా నీ మనసు మారలేదా ఆనంద్? కరుణ అనేది నీ మనసులో రవ్వంత కూడా లేదా?'

మధు అడిగిన ప్రశ్నకు నోరు విప్పి సమాధానం చెప్పే స్థితిలో నేను లేను.

అందుక్కారణం నా గుండె కరడుకట్టుకు పోవడమే! ఏనాడైతే అన్నపూర్ణ నా ఇంట్లోంచి బయటకు వెళ్లిందో ఆనాడే నా హృదయంలో కరుణ, జాలి, ప్రేమ అనే మంచి గుణాలన్నీ మటుమాయమయ్యాయి. కఠిన పాషాణంగా మారిపోయింది నా హృదయం.

'నెనలా వెళ్లి సిగరెట్లు తెచ్చుకొంటాను!' అని క్యాంటీన్ వైపు నడిచాడు మధు.

ప్లాట్‌ఫాంమీద హడావుడిగా తిరుగుతున్న జనంవైపు దృష్టి సారించిన నాకు హఠాత్తుగా ఓ దృశ్యం కన్పించింది. మధు కోచ్ వెనుక ప్రక్కనున్న కోచ్ డోర్ దగ్గర నిల్చున్న అమ్మాయిని చూడగానే నిశ్చేష్టుడనయ్యాను. ఆ అందాల రాశిని చూడటానికి నా రెండు కళ్లు చాలవన్పించింది.

బంగారు వన్నెలో మెరుస్తున్న ఆమె శరీరానికి క్రీమ్ కలర్ పాలిస్టర్ శారీ, అదే రంగు మాచింగ్ బ్లవుజ్ మరింత శోభను చేకూర్చాయి.

ఆహర్నిశలు శ్రమించి అత్యంత

రమణీయంగా ఓ రస హృదయుడైన శిల్పి తీర్చి, దిద్దుకొన్న శిల్పంలా వుంది ఆమె.

ఆమె నిలబడిన తీరులో వయ్యారం వుంది.

ఆమె అవయవ పొందికలో సింగారం వుంది.

ఆమె నేత్రాలు ఎనలేని కాంతులను విరజిమ్ముతున్నాయి. ఆ కాంతి కిరణాలు వెన్నలా మృదువుగా, వెన్నెల్లా చల్లగా నా హృదయాన్ని తాకాయి.

ఏదో మంత్రశక్తి నా మనసును వశపర్చుకొన్నట్లయింది.

నేను చూపులను మరల్చుకోలేకపోయాను.

ఆమెను అలానే కన్నార్పకుండా చూడాలనే కాంక్ష నా మనసులో నాటుకుపోయింది.

సభ్యత, సంస్కారాలను ఆ క్షణంలో మర్చిపోయాను.

ఆమె కంపార్ట్‌మెంట్లోంచి క్రిందికి దిగి ప్లాట్‌ఫామ్మీద నిలబడింది. ఆమె చుట్టూ అయిదుగురు వ్యక్తులు గుమిగూడారు. అందులో ఒకరు నడివయసులో వున్న స్త్రీ మరొకరు పదేళ్ల అమ్మాయి. మిగిలిన ముగ్గురు ముప్ఫయ్‌లోపే వయసున్న యువకులు. వాళ్లంతా ఆమెకు సెండాఫ్ యివ్వటానికి వచ్చినట్టున్నారు. వాళ్లతో ఆమె నవ్వుతూ ఎంతో ఉత్సాహంగా మాట్లాడుతోంది. పెదాలమీద చిఱునవ్వు చిఱుచిందులు వేస్తుంటే అందుకు అనుగుణంగా ఆమె కళ్లు అభినయం చేస్తున్నాయి.

పున్నమి వెన్నెలను కురిపించే ఆ చిఱునవ్వు పిచ్చివాణ్ణి చేయసాగింది.

ఆమె పెదాలు నవ్వుతున్నాయా లేక, ఆమె కళ్లే నవ్వుతున్నాయా అనే అనుమానం నాకు కల్గింది.

నేనే భావకవినై వుంటే ఆ క్షణంలో ధారావాహికగా నా గళంనుండి కమనీయ కవితలెన్నో వెలువడివుండేవి! నేనే శిల్పినై వుంటే ఓ సుందర రూపాన్ని కఠినశిలలో నుండి వెలికి తీసి వుండేవాణ్ణి!

నేనే చిత్రకారుణ్ణై వుంటే నా చేతిలోని కుంచె ఓ సౌందర్యదేవతకు ప్రాణప్రతిష్ఠ చేసి వుండేది!

కాని సామాన్య మానవుణ్ణి నేను!

పాషాణమనుకొన్న నా హృదయం ఆమె చిఱునవ్వుల జడివానలో పునీతమై కరిగిపోతున్నట్లనిపించింది.

ఆమె చుట్టూవున్న వ్యక్తులు ఇంగ్లీషులోను, మధ్య మధ్య హిందీలోను మాట్లాడుతూ ఆమెను నవ్విస్తున్నారు. ఆమె విరగబడి నవ్వుతూంది. ఆ నవ్వుల పువ్వులు నా హృదయాన్ని మృదువుగా తాకుతున్నాయి. ఏదో అవ్యక్తమైన పులకింత, అందీ అందని అనుభూతి హృదయంలో కల్గాయి.

విశాలమైన ఆమె నేత్రద్వయం అందంగా



# నవ్వేకళ్లలో...?

అభినయం చేస్తుంటే నా మనసులో ఎన్నెన్నో భావనలు...

ఆమె నాకు అభిముఖంగా నిలబడి మాట్లాడటంచేత ఆమె హావభావాల అందాలను, చూపుల సోయగాలను మనసార తిలకించ కల్గుతున్నాను.

మౌనంగావున్నా ఆమె కళ్లు నవ్వుతున్నట్లే కన్పించాయి.

ఆ కళ్లలో అంత కాంతి ఎలా గూడుకట్టుకొందో? చిరుగాలికి నుదుటిమీద ఎగురుతున్న ముంగురులను సుతారంగా సవరించినప్పుడు, మెడలోని ఒంటిపేట గొలుసుకున్న లాకెట్‌ను పెదాలమధ్య సుకుమారంగా తాకించినప్పుడు ఆమె అందం మరింత ద్విగుణీకృతం అవుతున్నట్లన్పించింది. కొంచెం ముందుకెళ్లాను.

ఆమె ఎక్కిన కంపార్ట్‌మెంట్‌కు అంటించిన రిజర్వేషన్ చార్ట్‌ను చూశాను ఆమె పేరును తెల్సుకోవాలనే ఆశతో. ఆ చార్ట్‌లో ఆడపేర్లు మూడున్నాయి.

కమల, జానికి, సౌందర్య...

దగ్గరగా వెళ్లాను కనుక ఆమెను పరిశీలనగా చూశాను.

తప్పకుండా ఆమె పేరు 'సౌందర్య' అయి వుంటుంది. ఎంత అందమైన కనులవి!

కవి కలానికి భావుకతను ఆపాదించే కనులవి! శిల్పి ఉలికి నవచైతన్యాన్ని కల్గించే

## చెమటబొట్టు విశ్వరూపం

కపిలబావి నీళ్ళుతాగి
కళ్ళు తెరచిన 'వడ్లగింజ'—

మిల్లునుంచి ఎగిరొచ్చి
శరీరంమీద వాలిన 'బట్ట'—

కన్నీళ్ళతో మొలిచిన
కంకరరాళ్ళనుంచి
నవ్వుతూ నాగరికత చాటే 'రహదారి'—

శ్రమనీ సేవనీ
తీగలుగ సాగదీసి
వెలుతుర్ని పిండే 'వీధిదీపము'—
ఇవన్నీ...
శ్రమశక్తిని చీల్చుకుపుట్టే
ప్రతి చెమట బొట్టుకు
సజీవ సాక్ష్యాలు
తరాల
మానవ వారసత్వ పరంపరమీద
వ్యాపించిన
ఒక
విప్లవ విభాత సంకేతాలు —

— కలికిరి వి. అబ్దుల్ ఖాదర్.

నయనాలవి! గాయకుని గళానికి గమకాలను ప్రసాదించే నేత్రాలవి! ఆ కన్నుల గారడీలో నేను చిక్కుకుపోయాను.

ఆమె పెదాలమీద దరహాస చంద్రికలు వెల్లివిరుస్తుంటే కనుబొమలు చిత్రాతిచిత్రంగా ముడివడుతున్నాయి. అదే సమయంలో సంపెంగలాంటి నాశిక గమ్మత్తుగా చిట్లించినట్లవుతుంది.

ఆ కమనీయ దృశ్యం వైపు కళ్లప్పగించి చూస్తూండిపోయాను.

మధు వచ్చి భుజమ్మీద చేయి వేసేసరికి ఉలిక్కిపడ్డాను, కొంచెం సిగ్గుపడ్డాను కూడా!

గార్డు విజిల్ వేస్తున్నాడు.

ప్లాట్‌ఫామ్మీదున్నవాళ్లు, ట్రయిన్‌లో వున్నవాళ్లు కంగారుపడుతున్నారు.

నాతో కరచాలనం చేసి ట్రయినెక్కాడు మధు.

ట్రయిన్ మెల్లగా కదిలింది.

ట్రయిన్ లోపల, ప్లాట్‌ఫామ్మీద ఎన్నో చేతులు గాల్లోకి లేచేయి శుభ సంకేతాలను సూచిస్తూ— మరెన్నో నవ్వులు అభిమానపు పువ్వులై స్టేషన్ నిండా విరిశాయి.

'ఐ వాంట్ ఎ ఫేవరబుల్ రిప్లయ్ ఫ్రమ్ యు ఫ్రెండ్!' కంపార్ట్‌మెంట్లోంచి నన్ను ఉద్దేశించి అన్నాడు మధు.

సమాధానంగా తల ఊపాను.

డోర్ దగ్గర నిలబడి నవ్వుతూ చేతులూపుతున్న సౌందర్యను చూసి నేను కూడా నవ్వుతూ 'ఆల్ ది బెస్ట్' అనబోయాను.

ఆ మాటలయితే నా గొంతు దాటి బయటకు రాలేదు కాని నా చేయి మాత్రం ఆమె కనుమరుగయ్యేవరకు గ్రీట్ చేస్తూనే వుండిపోయింది.


* * *

'సౌందర్య' నాకు అనుక్షణం గుర్తుకు వస్తూనే వుంది. అందులో ఒంటరిగా వున్నానేమో నా మస్తిష్కంలో రకరకాల ఆలోచనలు చెలరేగుతుండేవి. సౌందర్య కళ్లు కలల్లో నన్ను కవ్వించేవి. ఎంత మర్చిపోదామన్నా మరువలేని అందాల నేత్రాలవి! ఆ కళ్లల్లోకి అలానే చూస్తూ జీవితాన్ని గడిపే అదృష్టం ఎవరిదో? ఆమెకు పెళ్లయిందో? లేదో? ఆమెను భార్యగా పొందినవాడు నిజంగా ఎంతో అదృష్టవంతుడు.

అదృష్టవంతుడంటే గుర్తుకు వచ్చింది నా పెళ్లిలో కూడా బామ్మ ఇలానే అంది.

'అదృష్టవంతుడువురా! సీతాదేవిలాంటి భార్య దొరికింది!' ఆ కాంప్లిమెంట్ అన్నపూర్ణకు.

ప్రక్కనే వున్న లక్ష్మి అందుకొంది 'ఏమండోయ్ బామ్మగారూ! మా అక్కను సీతాదేవిని చేశారు. కొంపతీసి బావను, అక్కను వనవాసం పంపరు కదా! పంపితే పంపారు. మా అక్కను ఏ రావణాసురుడు ఎత్తుకుపోకూడదని, అక్కకు, బావకు ఎడబాటు




కల్గకూడదని ఆశీర్వదించండి!' బామ్మ మనసులో ఏమని ఆశీర్వదించిందో నాకు తెలీదు. కాని నిజానికి జరిగిందేమిటి ?

వరాలు కోరుకొనే కైకేయి కాని, వరాలిచ్చే దశరథుడు కాని లేకపోయినప్పటికీ నాకు అన్నపూర్ణకు ఎడబాటు కల్గింది.

అందుక్కారణం నా అవివేకమే !

అనూకు ఏం తక్కువ ? బి. ఎ. చదివింది. అందం వుంది. గుణం వుంది. చక్కని సంస్కారం వుంది. సంసారాన్ని చక్కగా తీర్చిదిద్దుకోగల తెలివితేటలున్నాయి. అన్నిటికి మించి నన్ను ప్రేమించకల్గే హృదయం వుంది.

కాని... కాని...

ఆమెవలన జరిగింది ఒకే ఒక తప్పు...

అందుకే ఎడబాటు ఆమె పాలిట శిక్షగా మారింది. ఈ తీర్పు యిచ్చింది నేనే !

అయితే ఇది సమంజసమేనా ?

నా తీర్పుమీద నాకు నమ్మకం వుంది. కాని మధు నా తీర్పును తీవ్రంగా ఖండించాడు.

'అనూకు అలాంటి శిక్ష విధించే అధికారం నీకెవరిచ్చారు ? ఇంతకూ ఆమె చేసిన తప్పేమిటి? దొంగతనం చేసిందా ? వ్యభిచారం చేసిందా ? హత్య చేసిందా ? పెళ్లయి పది నెలలు కాకముందే భర్త వదిలేశాడంటే ఆమెకు ఈ సంఘంలో ఏమాత్రం గౌరవముంటుంది ? ఆమె నెందుకిలా అవమానిస్తున్నావ్ !' అని వాదించాడు మధు.

కాని ఆ వాదనకు నా మనసు మారలేదు. ఏదో గొప్ప అపరాధాన్ని అనూ చేసిందన్న అభిప్రాయం నా మనసులో స్థిరంగా నాటుకు పోయింది. ఆ అభిప్రాయం మారాలంటే మరో బలమైన సంఘటన జరిగితీరాలి...

నిజమే... అదృష్టవశాత్తు మరికొద్ది నెలలకే ఆ సంఘటన జరిగింది.

మధు వ్రాసిన వుత్తరం చదివి వెంటనే హైదరాబాద్ బయల్దేరాను. నేను వెళ్లేసరికి మధు ఇంట్లో లేదు. మధు భార్య సుధ డాక్టర్. గవర్నమెంట్ డాక్టర్‌గా కొంతకాలం పనిచేసి ఆ తర్వాత రిజైన్ చేసి నర్సింగ్‌హోం కట్టించింది. నర్సింగ్‌హోమ్ మేడమీదే వాళ్ల నివాసం.

ప్రయాణ బడలికచేత భోజనం చేయగానే నిద్రపట్టింది. నిద్ర లేచేసరికి నాల్గు దాటింది.

అప్పటికీ మధు రాలేదు. నేను వచ్చినట్లు ఫోన్ చేశానని ఆరు గంటలకల్లా వచ్చేస్తారని సుధ చెప్పింది.

నాకు కాఫీ, టిఫిన్ ఏర్పాటుచేసి సుధ నర్సింగ్‌హోమ్‌కు వెళ్లిపోయింది.

మేడమీద వరండాలో కూర్చుని రోడ్డు మీదికి చూస్తూ కొంతసేపు గడిపాను.

ఆరు గంటలకల్లా మధు వచ్చేశాడు

స్నానాదులు ముగించుకొని కాఫీ త్రాగి నా ముందున్న కుర్చీలో కూర్చుని సిగరెట్ ముట్టించి అడిగాడు మధు.

'ప్రయాణం బాగా జరిగిందా ?' అని.

'రిజర్వేషన్ దొరకలేదు. ఓ సీటు సంపాదించుకుని రాత్రంతా అలానే కూర్చుండి ప్రయాణం చేయాల్సి వచ్చింది' అన్నాను.

'అయామ్ సారి ! వెంటనే రమ్మని ఉత్తరం వ్రాసి నిన్ను ఇబ్బంది పెట్టాను. కాని ఆనంద్ ! నిన్ను పిలిపించటానికి ఓ కారణం వుంది. నేను వైజాగ్ నుంచి వచ్చినప్పట్నుంచీ ఏరోజు కారోజు నీ దగ్గర్నుంచి వుత్తరం వస్తుందనీ ఎదురు చూశాను. కాని నీవు మనసు మార్చుకోలేదు. నీ వ్యవహారం ఇలా వదిలేస్తే లాభం లేదని వారం రోజుల క్రితం నేను, సుధ మీ మామగారింటికి వెళ్లాం. అనూను కల్సుకొని సుధ అన్ని విషయాలు మాట్లాడింది. ఆ పిల్ల నిజంగా అమాయికురాలు ! ఆమెకు ఏ పాపము తెలీదు...'

'నో... నేనొప్పుకోను ! అంతా తెలిసే నాటకమాడింది. భార్యా భర్తలమధ్య ఎటువంటి రహస్యాలు వుండకూడదు అన్న విషయం తెల్సి కూడా ఆ సంగతిని రహస్యంగా వుంచిందంటే ఆ మనిషిమీద నాకు విరక్తి కల్గదా ?' ఆవేశంగా అన్నాను.

'మిస్టర్ ఆనంద్! ఆవేశపడకు! శాంతంగా ఆలోచించు. అధికారంవున్న భర్తగాకాక మానవత్వమున్న మనిషిగా ఆలోచించు ! ప్రతి మనిషి ఆరోగ్యంగా వుంటే మనకింతమంది డాక్టర్లు, హాస్పిటల్స్ అనవసరం. మనం తినే కల్తీ ఆహారంవలన ఎన్నో వ్యాధులకు మనం గురవుతున్నాం. అనారోగ్యం కారణాన అయినవారిని ఎవరైనా వదులుకొంటారా ? రేపు సపోజ్ నువ్వే వ్యాధిగ్రస్తుడవయ్యావనుకో ! మేమంతా నిన్ను వదిలివేస్తామా ?...'

'పెళ్లయ్యాక భార్యాభర్తల్లో ఎవరు అనారోగ్యంతో బాధపడినా ఒకరి కొకరు సహాయం చేసుకోవాలి. కాదనను ! కాని నేను అసహ్యించు కొనేది ఆమె అనారోగ్యాన్నికాదు ! శరీరంలో దాగున్న వ్యాధిని బయటపెట్టని ఆమె మోసపు వృత్తిని! ఒకరకంగా అన్నపూర్ణను నేను ప్రేమించి పెళ్లిచేసుకొన్నట్లే ! ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో ఓ స్టాల్‌వద్ద ఆమెతో నాకు మొదటిసారిగా పరిచయం కల్గింది. మొదటి చూపులోనే ఆమె నన్ను ఆకర్షించటంచేత ఆమె వివరాలు తెల్సుకుని ఆమె తల్లిదండ్రులతో సంప్రదించి ఆమెను వివాహం చేసుకొన్నాను. పెళ్లికిముందు మా ఇద్దరికీ కొన్ని నెలలపాటు పరిచయం వుందికదా ! మరి తనకు ఫిట్స్ వస్తాయన్న భయంకర సత్యాన్ని నాకెందుకు చెప్పలేదు ? పెళ్లికాకముందే ఆమె నిజంచెప్పి వున్నట్లయితే నేడీ పరిస్థితి కల్గేది కాదుగా !...'

'చూడు ఆనంద్ ! ప్రస్తుతం మన వ్యవస్థలో ఆడపిల్లల వివాహం ఎంత దారుణ సమస్యగా తయారైందో నీకు తెల్సు ! ఎలాగోలా ఆడపిల్లకు పెళ్లిచేయాలని ప్రతి తండ్రి ప్రయత్నిస్తాడు. అమ్మాయి అందంగా వున్నంత మాత్రాన కట్నంలేకుండా పెళ్లిచేసుకొనే ఉదార స్వభావులు ఈ కాలంలో ఎంతమంది వున్నారు ? అందమైన ఆడపిల్లలకే వివాహ సమస్య కష్టమైనపుడు మరి అందంగాలేని వాళ్లసంగతి, అంగవైకల్యం వున్నవాళ్ల సంగతేమిటి ? ఎవరి బిడ్డ వారికి ముద్దు. ఎన్ని లోపాలున్నా ఒక్కోసారి గుప్తంగా వుంచి ఆ మూడ ముళ్లు పడేట్లు

చూస్తారు తల్లిదండ్రులు. మా అమ్మాయిలో ఫలానా అవకరం వుందని ఏ కన్నతండ్రి బహిరంగంగా చెప్పుకోడు!

అలా చెప్పుకొనే రోజు ఎప్పుడొస్తుందో తెలుసా? విశాల హృదయంతో పరిస్థితులను అర్థం చేసుకొని ఆడవాళ్లను ఆదుకొనే ఆదర్శ మూర్తులు అవతరించిననాడు! అప్పటివరకు వెయ్యి అబద్ధాలయినా చెప్పి ఓ పెళ్లి చేయాలి. ఇంకో విషయం! ఎబార్షన్స్ చేయించి గుట్టుగా పెళ్లిళ్లు జరిపిస్తున్నారు కదా కొంతరు! వాళ్లతో పోల్చిచూస్తే అన్నపూర్ణ చేసిన తప్పు ఏపాటిది? పైగా ఫిట్స్ రావటమనేది మనిషి యొక్క మానసిక పరిస్థితిమీద ఆధారపడి వుంటుంది. చిన్నప్పుడే ఆర్థిక దుస్థితికి గురికావటం, తనకు పెళ్లికాకపోవటం, తన వెనుక మరో నల్గురు ఆడపిల్లలు వుండటం, మరో కొద్ది సంవత్సరాలల్లో తండ్రి రిటైర్ కావటం వగైరా సమస్యలు ఆమె మనసులో ఎప్పుడూ మెదులుతుండేవి. అదృష్టవశాత్తు నీవామెను ఆదుకొని వివాహం చేసుకోవటంతో ఓ సమస్య పరిష్కారమైంది. మిగిలిన సమస్యల ఒత్తిడికి ఆమె తట్టుకోలేకపోయింది.

నీకు తెలీని నిజం యింకొకటి వుంది. నీవనుకొన్నట్లు పెళ్ళికి ముందు అన్నపూర్ణకు ఫిట్స్ ఎప్పుడూ రాలేదట. మీ పెళ్లయిన రెండు నెలలకు ఆమెకు మొట్టమొదటిసారిగా ఫిట్స్ వచ్చాయి. కాని నీవు నమ్మటంలేదు. అంతకు మునుపే ఆమెకా జబ్బు వుందని, ఆ రహస్యం నీకు చెప్పకుండా మోసగించి వివాహం చేసుకొందని ఒకానొక దురభిప్రాయాన్ని నీ మనసులో ఏర్పరచుకొన్నావు ...'

మధు మాటలు వింటుంటే నా కంతా అయోమయంగా తోచింది.

'నీవు చెప్పేది నిజమేనా మధూ?' అని అడిగాను.

'నిజమే ఆనంద్! ఇందుకు సాక్ష్యం డాక్టర్ సుధ! పద ఆవిణ్ణే అడుగు!' అంటూ లేచాడు మధు.

ఇద్దరం మేడదిగాం.

క్రింద నర్సింగ్‌హోమ్ పేషెంట్స్‌తో బిజీగా వుంది. ఆ సమయంలో డాక్టర్ సుధను డిస్టర్బ్ చేయటం భావ్యం కాదని అలా టాంక్ బండ్‌వరకు వెళ్దామని మధుతో అన్నాను.

బయటకు వెళ్తున్నట్లు సుధకు చెప్పి వస్తానని మధు కన్సల్టింగ్ రూమ్‌కు వెళ్లాడు.

నేను మెల్లగా అడుగులు వేసుకుంటూ నడిచాను. గేటు దగ్గరకు రాగానే ఠక్కున ఆగిపోయాను.

ఎదురుగా సౌందర్య!

ఆశ్చర్యపోయాను.

అందమైన ఆ కళ్లను చూసే అదృష్టం





మళ్లీ నాకు లభించినందుకు ఎంతో ఆనందించాను.

లోగడకంటె మరింత అందంగా వున్నాయి ఆ కళ్లు. ఆమె సరాసరి కన్సల్టింగ్ రూమ్ వైపు నడిచింది. అప్పుడే బయటకు వస్తున్న మధు ఆమెకు ఎదురు పడ్డాడు.

ఆమె అతనికి విష్ చేసింది. మధు ఆమెను ఏమిటో అడిగినట్లున్నాడు, ఆమె రోడ్డువైపు చూపించి ఏదో చెప్తూంది.

కన్పడినంతసేపు నేనలా ఆమెవైపు చూస్తూండిపోయాను.

మధు కారు దగ్గరకు వచ్చి స్టార్ట్‌చేసి నా దగ్గరకు వచ్చి ఆపాడు.

నేను కారెక్కాను.

కారు మెల్లగా కాంపౌండ్ దాటి రోడ్డు మీదికి వచ్చింది.

'వన్‌మినిట్' అంటూ కారును ఆపి మధు దిగాడు.

అతను వెళ్లిన దిక్కే చూశాను.

రోడ్డు ప్రక్కగా పార్క్ చేయబడిన ఓ కారు వద్దకు వెళ్లి అందులో వున్న ఓ కళ్లద్దాల వ్యక్తిని పల్కరించి వచ్చాడు.

సౌందర్య ఆ కార్లోంచి దిగి వుంటుందని, ఆమెకు అందులో కూర్చున్న వ్యక్తికి ఏదో సంబంధం వుండి వుంటుందని వూహించకల్గాను కాని సౌందర్య గురించి వివరాలు తెల్సుకోవాలన్న తహతహ నాలో అధికమైంది. కాని విషయం-

## ట్రిమ్మింగ్ - 130

ఆటల్లో పాల్గొనటాన్ని ప్రారంభించటం ఎన్నడూ ఆలస్యంకాదు అని పశ్చిమ జర్మనీలో హీడిల్‌బర్గ్ విశ్వవిద్యాలయంలోని క్రీడాశాఖ అధిపతి ప్రొ. హోక్స్‌ఎబర్ స్పానర్ అన్నారు. ఇటీవల మ్యూనిచ్ నగరంలో జరిగిన అంతర్జాతీయ క్రీడా పరికరాల ప్రదర్శన, ఇస్పో—83 ను ప్రారంభోత్సం కావిస్తూ పైవిధంగా అన్నారు. పశ్చిమ జర్మనీలో 61 శాతం ప్రజలు వివిధ రకాల ఆటల్లో పాల్గొంటున్నారని ఆయన తెలియజేశారు. పశ్చిమ జర్మనీ క్రీడా సంఘం ఇటీవల "ట్రిమ్మింగ్—130" అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. పరుగెత్తటం, ఈత, సైకిలు తొక్కటంవంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. వృద్ధులు కూడా శక్తికి మించక వీధిల్లో పాల్గొనవచ్చునని ఆయన అన్నారు. దీనివలన రక్తపీడనం స్థిరంగా 130 వద్ద ఉండగలదని ఆయన అన్నారు.

ఎలా కదపాలా అని ఆలోచిస్తున్న నాకు మధు దారి చూపించాడు.

'ఆనంద్! కార్లోంచి దిగి లోపలికి వచ్చిన అమ్మాయిని చూశావా?' అని అడిగాడు.

'ఆ...' అన్నాను ఉలిక్కిపడుతూ.

'ఆమె పేరు...'

'సౌందర్య అయివుంటుంది...'

'వాట్ ఎ సర్‌ప్రయిజ్! ఆమె నీకు తెలుసా?' ఠక్కున ఆశ్చర్యంగా అడిగాడు మధు.

'ఆమె అందంగా వుంది కనుక ఆమె పేరు అదే అయివుంటుందనుకొన్నాను. ఆమెవరో నాకు తెలీదు!' అన్నాను.

'నిజమే ఆనంద్! శారీరకమైన అందాన్ని గుర్తించటానికి కళ్లుంటే చాలు! కాని మానసికమైన అందాన్ని గుర్తించటమే కొంచెం కష్టం!'

కారు రోడ్డుమీద మెల్లగా సాగిపోతూంది.

మధు మళ్ళీ అన్నాడు.

'సౌందర్య అందం కేవలం బాహ్యమైనదేనని, ఆమె మనసు శరీరమంత అందమైనది కాదని నీ వనుకుంటున్నావని నాకు తెల్సు! నువ్వే కాదు! ఆమెను చూసిన ప్రతివారు అలా అనుమానించడం సహజం! మొదట్లో నేను కూడా అలానే అనుకున్నాను. కాని సుధ ద్వారా సౌందర్య వివరాలు తెల్సుకొని ఆశ్చర్యపోయాను. ఆమె మనషుల్లో దేవత అన్పించింది. చేయెత్తి దణ్ణం పెట్టాలనిపిస్తుంది నాకు. త్యాగం చేయటంలో ఆడవాళ్లదే పైచేయి అని ఋజువు చేసిందా అమ్మాయి!...'

'ఆమె చేసిన త్యాగం అంత గొప్పదా?' నా ప్రశ్నలో ఎగతాళి ధ్వనించింది.

'గొప్పదో కాదో నువ్వే చెబుదువు కాని అంటూ కారును టాంక్ బండ్‌మీద ఆపాడు మధు.

ఇద్దరం కారు దిగి ఓ సిమెంటు బెంచీ దగ్గరకు వెళ్లి కూర్చున్నాం.

హుస్సేన్‌సాగర్ మీదుగా ప్రయాణం చేసి వచ్చిన పిల్ల వాయువులు చల్లగా శరీరాన్ని తాకి మనసుకు ఆహ్లాదాన్ని కల్గిస్తున్నాయి.

సిగరెట్ వెల్గించి పొగబయటకు వూదుతూ అన్నాడు.


'ఆలోచిస్తుంటే నువ్వు, సౌందర్య నార్త్ పోల్, సౌత్ పోల్ అన్పిస్తుంది నాకు ...'

'అంటే నీ వుద్దేశం నేనుస్వార్ధపరుణ్ణనేగా!'

'అదికాదు నా వుద్దేశం! మీ యిద్దరికి క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయి. అయితే ఆమె తీసుకొన్న నిర్ణయం ఎంత ఉదాత్తమైనదో నీవు తీసుకొన్న నిర్ణయం అంత కఠోరమైనది..'

సౌందర్యకు కిష్టపరిస్థితి ఎదురైందా? నమ్మలేకపోయాను.

'అదృష్టాన్ని దురదృష్టం, వెలుగును చీకటి ఎప్పుడూ అంటిపెట్టుకొనే వుంటాయి. సౌందర్యది ప్రేమ వివాహం. ఆమె సురేష్ అనే నేవల్ ఆఫీసర్‌ను ప్రేమించింది. పెద్దల



# డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

### పి.ఆర్.ఆర్. – వెల్లూరు

నా వయస్సు 27 సం॥లు. ట్యుబెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను. పుష్పవతి అయినప్పటినుంచి, మెన్సెస్ టైములో కడుపు నెప్పి, నడుంనెప్పి, కాళ్ళ నెప్పితో బాధపడుతున్నాను. బ్లీడింగ్ వారం రోజులు ఉంటుంది. కడుపునెప్పి, బ్లీడింగ్ తగ్గాలంటే ఏ మందులు వాడాలి ?

★ లేడీ డాక్టర్లచేత పరీక్షింప చేసుకుని, రోగ నిర్ధారణ చేసుకోవటం అవసరం. మెనొరేజియా, మెట్రోపాతియా, హెమొరాజికా అనే రోగాలు హార్మోనుల అవకతవకలవల్ల ఏర్పడతాయి. ఇవి ఉన్నదీ లేనిదీ పరీక్షించి మందులు వాడవలసి ఉంటుంది.

### పి. వి. – భీమవరం

నా వయస్సు 18 సం॥లు. బహిస్టు అయిన 7వ రోజు తర్వాత 15 రోజుల వరకు తెలుపు అవుతుంది. మళ్ళీ బహిస్టు అయ్యే 7 రోజుల ముందునుంచి అవదు. దీనివలన సంసార జీవితానికి ఏమైనా చెడా ?

★ పై లక్షణాలు చాలామటుకు ప్రకృతి సిద్ధమే. దీనికీ, సాంసారిక జీవితానికీ సంబంధం లేదు.

### పి. ఎ. కె. – గండ్రాయి

నా వయస్సు 15 సం॥లు. నేను పుష్పవతిని అయి 2 సం'లు. నెల నెలా బహిస్టు రావటం లేదు. 4 నెలలకి, 3 నెలలకి, ఒక్కోసారి 6 నెలలకి వస్తుంది. క్రమంగా బహిస్టు రావాలంటే ఏం చేయాలి ?

★ మీరు ఏ మందులూ వాడనవసరంలేదు. పుష్పవతులైన తర్వాత కొన్ని నెలలపాటు ఇలా ఆలస్యంగా రావటం సహజమే. దానిని గురించిన ఆందోళన మరింత ఆలస్యానికి కారణం ఆయ్యే అవకాశం ఉంది.

### ఎస్. ఎస్. డి. – అమలాపురం

మా నాన్నగారి వయస్సు 45 సం. లు. కొంతకాలంగా పడుకునేటప్పుడు రెండు కాంపోజ్ మాత్రలు వేసుకోవటం అలవాటయింది. అలా వేసుకోవటం వల్ల ప్రమాదమా ?

★ ఏ మందులైనా వాడగా వాడగా శరీరానికి ఏదో విధమైన హాని కలుగజేయకుండా ఉండవు. వాటివల్ల రాగల అవాంతరాలు కొన్ని మాత్రమే ప్రస్తుతం మనకు తెలుసు. చాలామటుకు తెలియవు. సూక్ష్మంగా జరిగే మార్పులు చాలా ఉంటాయి. ప్రస్తుతం మనకు తెలిసిందల్లా కొన్నిరకాల మందులు చాలాకాలం వాడినా పెద్ద హాని కలుగజేయవని మాత్రమే !

### ఎం. వి. – బొంబాయి

నా వయస్సు 25 సం॥లు. వివాహమై 2 సం॥లు అయింది. సంతానం కలుగలేదు. బాల్యం నుంచి నా అండకోశంలో అండాలు లేవు. నాకు సంతానం కలుగదని చెప్పినారు. ఇది నిజమా ? సంతానం కలగాలంటే ఏమి చేయాలి ?

★ మామూలు వారికన్నా మామూలు స్థానంలో "అండాలు" లేని వారికి పిల్లలు కలిగే అవకాశం తక్కువ. మామూలు చోటులో ఉష్ణోగ్రత తక్కువగా ఉండటం దీనికి కారణం. కొందరికి శస్త్ర చికిత్స ద్వారా ఈ అన్‌డిసెండెడ్ టెస్టిస్‌లను మామూలు స్థానానికి గాని, దరిదాపులకుగాని తెచ్చే వీలుంటుంది. శస్త్ర వైద్యులని సంప్రదించండి. ★

---

నిర్ణయమ్మీద పెళ్లికి ముహూర్తంకూడా పెట్టారు. రేపు ముహూర్తమనగా ముందు రోజు అనుకోని సంఘటన జరిగిపోయింది.

ఇంకో అమ్మాయి అయితే ఎలా ప్రవర్తించేదోకాని సౌందర్య మాత్రం ధైర్యంగా నిలబడింది. తల్లిదండ్రులు ఆమె నిర్ణయాన్ని ఖండించారు. కాని సౌందర్య మనసు మార్చుకోలేదు ...

'ఏమిటా సంఘటన ?' ఆత్రంగా అడిగాను.

'సురేష్ కారుకు ఆక్సిడెంటయింది...'

'అతను చనిపోయాడా ?'

'నో... అతను బ్రతికేవున్నాడు. కాని హి లాస్ట్ హిజ్ సైట్.' నా గుండెలో ఎవరో గునపాలతో పొడిచినట్లయింది.

'ఇందాక కార్లోవున్న కళ్ళద్దాల మనిషే సురేష్. సౌందర్య అతనికి చూపు రాదని తెల్సి కూడా పెళ్లి చేసుకొంది. నౌ షి యీజ్ ప్రెగ్నెంట్, మెడికల్ చెకప్‌కోసం సుధ వగ్గరకు వచ్చింది...'

ఆ నవ్వే కళ్ల వెనుక ఇంత విషాదగాథ దాగి

## నవ్వేకళ్లలో...?

వుందా ? కన్పించని నీలి నీడలున్నాయా ? నా మనసులో సంఘర్షణ ప్రారంభమైంది.

అంధుడైన భర్తను చేపట్టిన సౌందర్య వ్యక్తిత్వం నా కళ్లముందు హిమాలయాల్లా పెరిగిపోయింది.

ప్రేమించి పెళ్లి చేసుకొని ఓ చిన్న కారణంగా భార్యతో బంధాలు త్రెంచుకోటానికి ప్రయత్నిస్తున్న నా వ్యక్తిత్వం తరిగిపోయి ఓ ఇసుక రేణువులా మారింది.

నామీద నాకే అసహ్యం కల్గింది. ఇకనైనా నా తప్పను సరిదిద్దుకోవాలి. అన్నపూర్ణకు అన్యాయం జరక్కూడదు ! లేచి నిలబడ్డాను.

'మిస్టర్ మధూ ! వెళ్దాం పద !' అంటూ అతన్ని కారు దగ్గరకు తీసుకువచ్చాను.

'అప్పుడేనా ? సుధ ఇంకా పేషెంట్స్‌తో బిజీగానే వుంటుంది ఆనంద్ !' అన్నాడు మధు వాచీ చూస్తూ,

'మీ ఇంటిక్కాదు ... '

'మరెక్కడికి ?' అంటూ కారెక్కాడు మధు.

'అన్నపూర్ణవాళ్లింటికి !' సిగ్గుపడ్తూ చెప్పాను.

మధు కళ్లల్లో ఆనందం ఉప్పొంగింది. షేక్‌హ్యాండ్ యిచ్చాడు.

'వెరీగుడ్ ! థాంక్యూ మేన్ !' అంటూ కారు స్టార్ట్ చేశాడు మధు.

సౌందర్య నాకు కన్పించిన క్షణం ఎలాంటిదో కాని ఆమె కథ ఓ వెలుగు కిరణమై నా మనసులోని చీకట్లను పారద్రోలింది.

కదుల్తున్న కార్లోంచి శూన్యంలోకి చూశాను.

ఎదురుగా సౌందర్యే కన్పించినట్లయింది.
ఆమె కళ్ళు నవ్వుతూనే వున్నాయి !
అయితే ఆ నవ్వే కళ్లలో ...
నా కిప్పుడు కన్పిస్తున్నవేమిటి ?
నీలినీడలు కావు !
నీతి కిరణాలు ... ●


రోజూ స్కూలు అయిపోగానే, మా స్నేహితులతో కలిసి, గ్రౌండ్‌కి వెళ్ళి ఫుట్ బాల్ ఆడుకుంటాను. ఒకసారి గ్రౌండ్‌లోకి వెడితే, అలిసిపోయి, కదలలేనంత వరకు ఆడతాము. అయితే ఏం? ఇంటికి వెళ్ళగానే మా అమ్మ నాకు ఒక కప్పు హార్లిక్స్ యిస్తుంది. అహా, శక్తినిచ్చే పానీయం, హార్లిక్స్! నిజంగానే బలే రుచిగా ఉంటుంది.
మాల్టెడ్ బార్లీ, వెన్నతో కూడిన పాలు, బంగారు వన్నె గోధుమలలోని పోషక శక్తుల మంచితనమంతా చక్కగా రంగరించబడిన హార్లిక్స్ ఎంతో రుచికరమైన పానీయం.
పోషక శక్తిని సమకూర్చేందుకు ఉత్తమ మార్గంగా అందరు నమ్ముతారు. 100 సంవత్సరాలకు పైగా ప్రపంచమంతటా లక్షలాది కుటుంబాలు హార్లిక్స్‌ని నమ్ముకున్నాయంటే ఆశ్చర్యం ఏముంది?
Horlicks
The Great Nourisher
కొత్త సమయం, కొత్త రూపం
మంచి పుష్టికరమైనది
HTD-HMM-8074-TEL

సీరియల్

# యక్షగానం

స్వర్గీయ

## శ్రీమతి మాదిరెడ్డి సులోచన

**10**

**(గత సంచిక తరువాయి)**

చైనులు ముకుందాదేవితో వాటా అడగటానికి వచ్చాడు. ఆమె ఆశ్చర్యపోయింది. అప్పుడే భక్తులంతా వెళ్లిపోయారు. అవతారం చాలించి కూర్చుంది. కనకాభిషేకం జరిగింది. ఒకరు కాదు ఇద్దరు భక్తులు చేసారు.

ముకుందాదేవికి ఆ రోజు ఎంతో నిశ్చింతగా ఉంది. ఒకవైపు కూతురికిమంచి సంబంధం కుదిరింది. అన్నివిధాలా తగిన ఇల్లు దొరుకు తుంది. వారిద్దరికి పెళ్లిచేసి, తను నందన రావుతో ఏ పల్లెటూరుకో వెళ్లి ఉంటుంది. ఆమె ఊహలను చెదరగొడుతూ చైనులు పిడుగు లాంటి ప్రశ్నవేసాడు.

''ముకుందాదేవీ ! కృష్ణపరమాత్మ పేరున సంపాదించిన ధనంలో వాటా కావాలి.'' అన్నాడు నిర్భయంగా సిగరెట్టు కాలుస్తూ.

''అవునండీ. నేను అడగాలనుకుని తట పటాయిస్తున్నాను.'' అన్నాడు రాయుడు.

''రాయుడూ ! ఏమిటీ నాటకం ?''

''ముకుందాదేవీ ఇన్నాళ్ల ఆడింది నాటకం. నీ భక్తిని రక, రకాలుగా కీర్తించాను, యెన్నో వేషాలువేసి, నీ మహిమలు ప్రచారం చేసాను.'' అన్నాడు.

''ఉదారంగా చేసారా ?'' తీక్షణంగా అడిగిందామె.

''ఉదారంగా యెవరూ, ఏ పనీ చేయరు. మీరు మీ కూతురు భవిష్యత్తు ఆలోచించినట్టే, మాకున్నవారి గురించి మేము ఆలోచించవద్దా ! ఈ ఉన్నదంతా ఇచ్చి నీ కూతురికి వైభవంగా పెళ్లిచేస్తావు. ఆమె వెళ్లిపోతుంది. మీరు అవతారం చాలిస్తారు. మేమేగా అడుక్కు తినాల్సింది.'' అన్నాడు చైనులు.

''నేనంత స్వార్థపరురాలినికాను చైనులూ. నా కూతురు పెళ్లయి అది సెటిలయితే, మీ అందరికి ఏదో ఒక వ్యాపారం చూపిస్తాను. మీరు నిశ్చింతగా ఉండండి.'' అన్నది.

''అది లాభంలేదు. మా అందరికి సరిగ్గా వాటా ఇవ్వాల్సిందే. యెంత ధారణశక్తి ఉంటే భక్తులపేర్లు, వారు చర్చించే సమస్యలు, వారి బట్టల రంగుతోసహా మీకు చెప్పగలను ! ఆ విషయం ఆలోచించండి.''అన్నాడు ఆమెకెదురుగా స్టూలు లాక్కుని కూర్చుంటూ.

''అవునండీ ! వచ్చిన భక్తులు మళ్లీ,మళ్లీ వస్తారు. యెవరయినా గుర్తుపడితే ప్రమాదం కద, అందుకే అరచేత ప్రాణం పెట్టుకున్నాను. మా ఇంటివాళ్ల వద్దూ అంటూ గొడవచేసారు.'' అన్నాడు రాయుడు.

ముకుందాదేవి ముఖం ఎర్రబడగా అగ్రభమణిలా అయింది.

''మీకు వాటా రావాలంటారు.''

''అవునండీ.''

''ఇవ్వకపోతే ?''

''ఫలితాలు దారుణంగా ఉంటాయని చెప్పటానికి విచారిస్తున్నాము''అన్నాడు రాయుడు.

''బెదిరింపు అనుకుంటాను.''

''ఎలా అనుకున్నా వచ్చిన నష్టం ఏం లేదు.''

''మీరేం చేస్తామన్నా నాకు వచ్చిన నష్టం ఏం లేదు. వెళ్లండి. ఏం చేసుకుంటారో చేసుకోండి'' అన్నది బెట్టుగా.

''ముకుందాదేవీ ! బాగా ఆలోచించండి. ఈ గుట్టు కాస్త రట్టయితే భక్తులు రారు'' అన్నాడు చైనులు.

''నా అంతటి నేనే ఈ అవతారం చాలించా లనుకున్నాను. అది మీ వల్ల అయితే సంతోషమే. బుద్ధిగా నేను చెప్పినట్టు వింటే నాకు ఇన్నాళ్ళ చేసిన సహాయానికి ఏదోఇస్తాను. బెదిరించి డబ్బు గుంజాలనుకుంటే మీరిక వెళ్లిపొండి'' అన్నది చటుక్కున లేచి నందనరావు గదిలోకి వెళ్లింది. వాళ్ళు వెళ్లిపోయాక, వెనుకగా నీలిమ తలుపులు వేయటం వినిపించింది.

ఆమె వెళ్లి భర్త మంచం దగ్గర నిలబడింది.

''ఏమిటి ముకుందా !''

''కాస్త ప్రక్కకు జరుగుతారా ! నేనిక్కడ

**జరిగిన కథ — 5 :** ముకుందాదేవిని అక్కడి ప్రజలు శ్రీకృష్ణ పరమాత్మనిగా భావించి కొలుస్తుంటారు. ముకుందాదేవిని శ్రీకృష్ణుడు ప్రతీ సోమ, గురు, శనివారాలు ఆవహించి భక్తుల కోరికలు నెరవేరుస్తుంటాడు. ముకుందాదేవి భర్త నందనరావ్‌కు పక్షవాతం. కూతురు నీలిమ. నందనరావ్ మిత్రుడు కొడుకు ఆదిత్య ఆకలి బాధతో ఆ ఇంటికి వస్తాడు. అసలు ఈ అవతారం ఎత్తింది నీ కోసమేనని, నీ పెళ్లి చేసి ఈ అవతారం చాలించులానని ముకుందాదేవి చెప్పగా నీలిమ ఆశ్చర్యపోతుంది. డాక్టర్ శివాజి భార్య మాధవి ఆరేళ్ల అరవింద్‌ను వదిలేసి చనిపోతుంది. అత్తమామల ప్రోద్బలంతో మళ్లీ వివాహం చేసుకోవటానికి అంగీకరిస్తాడు శివాజి. నందనరావ్ ఆదిత్య సహకారంతో ఆ ఆశ్రమంలోనే తాత్కాలికంగా ఉద్యోగంలో చేరతాడు. ముకుందాదేవి స్నేహితురాలు సావిత్రమ్మ తన కొడుకు చిన్నబాబుతో అమెరికా నుండి వస్తుంది. నీలిమను చిన్నబాబుకిచ్చి పెళ్లి చెయ్యాలని ముకుందాదేవి ఆశ. డా॥ శివాజీ తన పేషెంట్, ఆ పట్టణంలో ధనవంతులలో ఒకరయిన చంద్రసేన్‌గారి భార్య వసంతతో విచిత్ర పరిస్థితిల్లో సంబంధం పెట్టుకొంటాడు. ముకుందాదేవితో వియ్యమందటానికి ఇష్టపడని సావిత్రమ్మ ఆమె సంపదను చూసి సంబరపడిపోతుంది. నీలిమ, ఆదిత్య పరస్పరం ప్రేమించుకొంటారు. వారిద్దరూ కలసి చిన్నబాబు అసలు రంగు బయటకు లాగుతుంటారు.

పడుకుంటాను'' అన్నది. అదేం ఆయనకు కొత్త కాదు. ఆమె మనసు బాగాలేనప్పుడల్లా వచ్చి అలాగే అడుగుతుంది.

''ముందు తలుపు వెయ్యి. వరండాలో ఆదిత్య పడుకున్నాడు'' అన్నాడాయన. తలుపు వేసి వచ్చింది. అతని ప్రక్కన పడుకుని, అతని హృదయంలో తల దాచుకుంది.

''ఒక సంస్థ అన్నాక దానిలో పనిచేసే రకరకాల ఉద్యోగులు, రకరకాలుగా విమర్శిస్తారు. దానికి భయందేనికి ?''

''వాళ్ళు విమర్శించారని కాదండీ. మనమేం పాపం చేసామని ఈ శిక్ష. ఒక్కనాడయినా మన శ్శాంతిగా ఉన్నామా!'' అన్నది, సన్నగా ఏడుస్తూ.

''విధి అంటే ఇదే ముకుందా ! నిదురబో'' అన్నాడు ● ఉన్న చేత్తో తల నిమురుతూ. ఆమె మాట్లాడలేదు. త్వరగా నీలిమ వివాహం అయితే తనకు ఏ బాధ ఉండదు అనుకుంది. ఇంటా, బయట యెన్ని విఘ్నాలో !

''ముకుందా !''

''ఏమిటండీ ?''

''చిన్నబాబు విషయం మరొక్కసారి ఆలోచించు'' అన్నాడు.

''ఆలోచించే ఒక నిర్ణయానికి వచ్చేసానండి. ఇద్దరూ మన కళ్ళముందే ఉంటారు'' అన్నది.

నందనరావు నవ్వాడు. ఒకప్పుడు అతను నవ్వితే అందంగా, సమ్మోహనాస్త్రంలా ఉండేది. ఈ రోజు వికృతంగా కనిపించిందామెకు. కళ్ళు మూసుకుంది.

''ముకుందా ! నువ్వు మనల్ని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తు నిర్ణయించకు, అమ్మాయి అభిప్రాయం కడిగావా ?''

''జరుగుతున్నదంతా తను చూస్తున్నది కదా. ఇష్టం లేదంటే ఎదురు చెప్పేదే'' అన్నదామె.

ఇప్పుడా ప్రసక్తి బొత్తిగా ఇష్టం లేదామెకు. ఒక తలనొప్పి తగ్గించుకుందామని మరో తలనొప్పి, తలకు రుద్దుతున్నాడు భర్త.



''నువ్వు అమ్మాయి స్వభావం గ్రహించావో లేదో మనకోసం ప్రాణాలు ఇవ్వమన్నా ఇస్తుంది. వెర్రి తల్లి'' అన్నాడు.

ఆమె నిదుర నటిస్తూ, అవులించి చిటికె వేసింది. ఆ విషయాలు చర్చించాలని లేదు.

''రేపు మాట్లాడుకుందాం'' అని కళ్ళు మూసుకుంది. కాని హృదయపు మథింపు, ఆలోచనల కుదింపు ఆమెను పిచ్చిదాన్ని చేస్తున్నాయి.

చిన్నప్పటినుండి నీలిమకు తన దగ్గరకంటే తండ్రి దగ్గరే చనువు. ఆయనకు అపర దుర్వాసుడనే పేరుండేది. కూతురి దగ్గరకు వచ్చే సరికి పరమ శాంతమూర్తి అయ్యేవారు. ఆమె చెప్పినట్టు వినేవారు.

పక్షవాతం వచ్చాక కూడా జీవితంపై విరక్తి పెంచుకుని మందులు తిననుగాక, తినను అని మొండికేసాడు. నా బ్రతుకు నిరుపయోగమే అన్నాడు. డాక్టర్లు, ముకుందాదేవి విసిగి పోయారు. చివరకు చిన్నారి నీలిమ వెళ్లి మందు లిచ్చింది.

''వద్దు నీలూ! నేనిలాగే చస్తాను. యెవరికోసం బ్రతకాలి?'' బావురుమన్నాడు.

''నా కోసం, నీలూ... కోసం బ్రతకాలి నాన్నా'' అన్నది. తన చిన్నారి చేతులతో అతని చెంపలమీద జాలువారిన కన్నీటిని ఒత్తింది.

ఆనాటి తరువాత మందులు వద్దు, చస్తాను అని అనలేదు. ఒక్కొక్కసారి ముకుందా దేవికి అసూయగా కూడా ఉంటుంది. చిన్నప్పటి నుండి అంతే, తనకేదయినా ప్రమాదం జరిగితే తండ్రికే మొదట చెప్పుకుంటుంది నీలిమ. చిన్న బాబు ఇష్టంలేదనిచెప్పిందా!

''ఏమండీ...'' లేచి కూర్చుంది ముకుందా దేవి.

''నీలు మీకేమయినా చెప్పిందా!''

అతను కళ్లువిప్పి చూశాడు.

''నీలు ఏం చెప్పలేదు ముకుందా! నేనే ఊహించాను. నా మనసులో ఒక్కమాట ఉంది'' అన్నాడు.

# య క్ష గా న ం

ముకుందాదేవికి తెలుసు అతని మనసులోని మాట ఏమిటో, మౌనంగా ఉండిపోయింది. అతని సహచర్యంలో వెన్నెల చల్లదనం, మల్లెల సౌరభం, అమృతంలోని మాధుర్యంచవిచూడలేదు. వ్యతిరేకంగా ఏనాడు ఒక్కమాటని ఎరుగదు. దానికి ఆమె బీదరికమే కారణం.

''ఆదిత్యను చూచావు. అతని గురించి నీ అభిప్రాయం ఏమిటి?''

''నేను అతని గురించి ఆలోచించవలసిన అవసరమేం వచ్చింది. చైనులు రాయుడు, సత్యలాంటి ఉద్యోగి.''

''పోనిలే ఉద్యోగే, కాని నాకతని సౌజన్యం, సహృదయత నచ్చాయి. అతని అండన నీలు సుఖపడుతుందన్న నమ్మకం ఉంది'' అన్నది.

''మీరనేది ఏమిటండీ ... చిల్లిపైసా లేని...''

''ముకుందా!'' తీక్షణంగా చూచాడు అతను. ముకుందాదేవి మాట్లాడలేదు.

''నిన్ను పెళ్లి చేసుకున్ననాడు మీ వారెంత కట్నం ఇచ్చారు?''

''దెప్పుతున్నారా!''

''లేదు. నీకు మనమేమిటో అర్థం చేస్తున్నాను.''

''చిన్నబాబులో ఏమిటి లోపం! అందువా అమెరికా వెళ్లివచ్చాడు...''

''అమెరికా ... అమెరికా! అమెరికా! అక్కడికి వెళ్తేనే చాలా! బ్రతకటానికి అర్హత ఉండవద్దా! వాడేం వ్యాపారం చేస్తున్నాడట? ఇంతవరకు చెప్పాడా! పోనీ ఏం చదివాడో చెప్పాడా? వాడు 'మమ్మి' అంటూ ఆమె చెప్పిన దానికి తలాడిస్తూ కూర్చుంటాడా! మనకు కావల్సిన డబ్బుంది. దాంతో ఆదిత్య ఏదయినా వ్యాపారం చేయగల సమర్థుడు.''

''అమ్మాయి కిష్టంలేదు.''

''నువ్వు అడిగావా!... నీ ఊహలు, నీ ఆలోచనలు వేరు. రేపు జీవితాంతం కలిసి ఉండాల్సింది అమ్మాయి.'' అన్నాడు.

''అమ్మాయికి ఇతరత్రా ఆలోచనలుంటే చిన్నబాబు పేరు సూచించి, ఇల్లు కొంటాము అంటుంటే అడ్డు చెప్పేది'' అన్నది.

నందనరావు దగ్గర దానికి జవాబు లేదు. అతనికి కూతురి అంతర్యం అంతుపట్టలేదు. ఏం మాట్లాడాలో తెలియలేదు. భార్యను శాసించ లేడు.

''ఆదిత్యకిస్తే మంచిదని మీ భావం కాని, మరీ అంత దిక్కులేని వాడివ్వటం నా కిష్టం లేదు.'' అన్నదామె.

అతను దుప్పటి లాక్కుని అటు తిరిగి పడుకున్నాడు. ముకుందాదేవికి కోపం వచ్చింది. ఆమె స్వార్థం ఆమెది. ఆదిత్య లాంటి వారికి స్వంత ఆలోచన ఉంది. తనమాట వినరు. చిన్నబాబు అది పట్టించుకోడు.

''ఏమండీ! నిదురబోయారా!''

జవాబు రాలేదు. ఆమెకి ఎక్కడలేని కోపం వచ్చింది. అంతకు క్రితం చైనులు, రాయుడు చేసిన ఆరోపణలు గుర్తుకు వచ్చాయి. అందరూ తన మంచితనం ఆసరాగా చేసుకుని ఆడిస్తు న్నారు. ఈ అవతారం ఎత్తితే వచ్చిన కష్ట, నష్టాలు తనకు తెలుసు. బయట సుఖంగా ఉంటున్నారు. ఉక్రోషం ముంచుకు వచ్చింది.

''మీరు నిదుర నటిస్తే నాకొచ్చిన నష్టం లేదు. ఏదో ఉద్ధరిస్తున్నామని బీదదాన్ని అని పెళ్లి చేసుకున్నారు. ఆనాటి నుండి సమస్యలే. దిక్కు, మొక్కు లేదు కదా అని పిల్లలు కాలేదని మళ్లీ పెళ్లి అంటూ ఏడ్పించారు. అదృష్టం బావుండి ఆ పిల్ల పుట్టింది. ఆ తరువాత అడ్డం పడ్డారాయె'' అన్నది ఆవేశంగా.

నందనరావు ఇటు తిరిగి నవ్వాడు. ఆ నవ్వు అంటే ఆమెకు మంట.


''జబ్బు రావాలి, నీపై ఆధారపడాలని నేను కోరుకున్నానా!''

''కోరుకున్నారో? ఏమనుకున్నారో, నన్ను అష్టకష్టాలు పెట్టారు. యెందరి కాళ్లు పట్టుకుని, మరెందరి కడుపులో తలదూర్చి ఈ అవతారం నెట్టుకు వస్తున్నానో మీరు ఎరగరు. ఒక్కసారి... ఒక్కసారంటే ఒక్కసారి జాలి చూపుతారా! అయ్యో పాపం అంటారా!''

''ఇప్పుడేమయింది ముకుందా! నీ ఇష్టం వచ్చిన వాడికివ్వు. ఇదేమిటని అడిగితే చెప్పచ్చుకు కొట్టు.''

''అంటే మీ ఉద్దేశం!''

''కుంటివాడికి, గుడ్డివాడికి, మతిలేని





అక్టోబరు 24న ఐక్యరాజ్యసమితి దినోత్సవ సందర్భంగా హైదరాబాదు లాల్‌బహదూర్ స్టేడియంలో జరిగిన వివిధ పాఠశాలల విద్యార్థుల కవాతు, నృత్య కార్యక్రమాలలో సెయింట్ ఆన్స్ గరల్స్ హైస్కూలు (విజయనగర్ కాలనీ) వారు నిర్వహించిన రాజస్థానీ నృత్యానికి లభించిన ప్రథమ బహుమతిని ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు కుమారి యద్దనపూడి పద్మజ, కుమారి యం. నిర్మలలకి అందజేస్తున్న దృశ్యం.

వాడికిచ్చినా మాట్లాడాను. కాలు, చేతో్పాటు, నోరు పడిపోతే యెంత బావుండును'' అన్నాడు.

ముకుందాదేవి ఆవేశంగా వెళ్లి అతని చొక్కా పట్టుకుని కుదిపింది.

''అంటే... అంటే నా కూతుర్ని మతిలేని వాడికిస్తున్నానా! అవున్లెండి. అంతకంటే మీకేం అర్థం కాదు.''

''అమ్మా ...''

చప్పున భర్త చొక్కా వదిలివేసింది ముకుందాదేవి.

''అమ్మా ! అసహాయతపై జాలి చూపాలి గాని, కోపం కాదమ్మా'' 'అన్నది.

''అందరూ నాకు చెప్పేవారేనే. ఆయన ఏమన్నారో విన్నావా !''

''విన్నానమ్మా ! తల్లిగా నీకెంత బాధ్యత ఉందో, నా గురించి ఆలోచించే అవసరం నాన్న గారికి ఉన్నది'' అన్నది.

''నాన్నగారూ...'' ఒక వ్యంగ్యపు నవ్వు నవ్వి వెళ్లిపోయింది ముకుందాదేవి.

''నీలూ ! నేనెంత చేతకానివాడినయినా అనుబంధాలు చంపుకున్నవాడ్నికాను. ఏదో అన్నాను. చిన్నప్పటినుండి అంతే ముకుంద. నువ్వు తన స్వంతం అయినట్టు ప్రవర్తిస్తుంది'' అన్నాడు బాధగా.

''మీరు అవిటివారని అతి జాగ్రత్తపడి ఉంటుంది. మీరు నిదురపొండి.'' మాత్ర ఇచ్చి, మంచినీళ్లు ఇచ్చింది నీలిమ.

''నీలూ ! ఇలా కూర్చో తల్లీ—నీ స్పర్శతో నేను శాంతి పొందుతాను.'' అన్నాడు.

## యక్షగానం

అతని ప్రక్కన కూర్చుని, అతని పీలపడిన నేయి, కాలు మర్దనాచేస్తూ, సన్నగా కూనిరాగం తీసింది.

''నీలూ ! మొదటిసారి నిన్ను మీ అమ్మ వడిలో చూడగానే, సామ్రాజ్యాలు దొరికిన రాజులా సంబరపడిపోయానమ్మా. యెవరూ కనీ, వినీ యెరగనంత ఘనంగా నన్ను పెంచి పెద్దచేసి చదివించాలనుకున్నాను. కాని, విధి ఇంత అసూయ చెందుతుందని ఊహించలేదు. ఊపిరి పోసుకోకముందే నా కలలు చెదరగొట్టి, బ్రతుకంటే బెదిరిపోయేలా చేసింది.'' అన్నాడు. అతని రెండు కనుల కొలుకుల్లో నీరు నిలిచింది.

''ఊర్కో నాన్నా !'' ఆమె ఆర్తిగా తన పమిటతో కళ్లు ఒత్తింది.

''అమ్మా... ఏది... ఆ పాట పాడమ్మా.'' అన్నాడు అభ్యర్థనగా.

''జో అచ్యుతానంద జో జో ముకుందా!'' అంటూ అన్నమాచార్యుల కీర్తన అత్యంత మధురంగా ఆలపించింది.

అతను అరమోడ్పు కన్నులతో చూచాడు.

''నీలూ ! నీవు యెక్కడ ఉన్నా, నా అంతిమ ఘడియల్లో నా దగ్గర ఉండాలి... నీ జోలపాట పాడాలి...''

''అలాగే నాన్నా...''అతని కళ్లుమూసింది. అతనామె చెయ్యి పట్టుకుని నిదురపోయాడు. మెల్లగా లేచి, లైటు ఆర్పి, వరండాలోకి తొంగి చూచింది. అలసిపోయాడేమో, హాయిగా నిదుర పోతున్నాడు ఆదిత్య.

ఆమె పరీక్షగా చూచింది. పచ్చని పసిమి ఛాయకాదు. అయినా అందంగా ఉంటాడు. ఒత్తయిన జుట్టు చిందర, వందరగా పడి, అతని ముఖాన్ని ఆకర్షణీయంగా చేసింది. ఒత్తయిన కనుబొమ్మలు, ఒత్తు మీకేనా అని పోటీపడే మీసాలు చూస్తూ నిలబడిపోయింది.

'అందం అంటే పసిమిఛాయే అనుకుంటారు. అబ్బ ఈ మనిషిలో ఎంత ఆకర్షణ!' ఆ క్షణంలో వెళ్లి అతని ఎదపై తలపెట్టి విశ్రాంతి తీసుకోవాలనుకున్నది. మళ్లీ విచక్షణ మేలుకున్నది.

అతను ఒక ప్రక్కనుండి మరో ప్రక్కకు పొర్లాడు. ఉలిక్కిపడి గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. అప్పుడు తల్లి సంగతి ఆరావచ్చింది.

''అమ్మా !'' తల్లి గదిలోకి వెళ్లింది.

ఆమె ఇంకా ఏడుస్తోంది.

''అమ్మా ! నాన్నగారన్నది వాస్తవం. నువ్వు ఇంకా కొన్ని రోజులాగి, నా వివాహం నిశ్చయం చెయ్యి. చిన్నబాబు మానసిక ఆరోగ్యం అంత మంచిది కాదని నా అభిప్రాయం.''

''నీలూ !''

''అవునమ్మా. అందుకే అంటి ఒంటిరిగా వదలి వేయటానికి జంకుతుంది. అతని బాహ్య రూపం చూచి మోసపోవద్దు'' అన్నది. లైటు ఆర్పి, ఆమె ప్రక్కన చోటు చేసుకుని పడుకుంది నీలిమ. ఆ అమ్మాయి అనుభవం లేకపోయినా కొన్ని విషయాలు ఊహించగలదు. భార్యా భర్తల మధ్య శారీరక బంధాలు అంతంత మాత్రంగానే ఉంటాయి. ఆ దూరం తల్లి తండ్రుల మధ్య గమనిస్తుంది.

## 11

నందనరావును తీసుకుని నర్సింగ్‌హోమ్ వచ్చిన నీలిమ, ఆదిత్యలు డాక్టరుగారు లేరని తిరిగి వెళ్లిపోయారు. శివాజీగారు తప్ప ఇతరులు చూస్తే తృప్తిపడరు. అలాంటి పేషెంట్లలో నందనరావు ఒకరు.


''ఎప్పుడొస్తారో అడుగు నీలూ ! మళ్లీ వద్దాము'' అన్నాడు.

''వారి అత్తగారు పోయారట నాన్నా.''

''అయ్యో పాపం ! భార్య పోయింది. అత్తగారుకూడా పోయారా !'' అన్నాడు. ఇంకా పదిరోజులు పడుతుందట రావటానికి. వాళ్లు వెళ్లిపోయారు. వాళ్ల కారు వెళ్లిపోగానే శివాజీ వచ్చారు.

''గుడ్ మార్నింగ్ సర్! మీరు వారనుకుని నందనరావుగార్ని పంపేసాను'' అన్నది సిస్టర్.

''పదిరోజులు రావద్దనే అనుకున్నాను సిస్టర్ ! ఇంట్లో బోరుకొడుతోంది. అరవింద్ బడికి వెళ్లిపోతాడు. పార్థసారధిగారు భజనల చేస్తూ కూర్చుంటారు'' అన్నాడు. అతని అందించిన కోటు తీసుకుని, హేంగరుకు తగిలిం చింది. అతను వెళ్లి పేషెంట్లను చూ




MCA-TDB-52-TEL

వచ్చాడు. ఒక కప్పు టీ తాగి వసంతకు ఫోన్ చేసాడు.

"హల్లో డాక్టర్ శివాజీ ... చంద్రసేన్ గారున్నారా !"

"ఊర్లో ఉన్నారు. నాకు కడుపులో నొప్పిగా ఉంది డాక్టరుగారూ! అరగంటలో వస్తున్నాను" వసంత ఫోన్ పెట్టేసింది. శివాజీ ఎదురుగా ఉన్న ఓ పత్రిక తిరగవేస్తూ కూర్చున్నాడు. అందులో మానవ శరీరంలోని నిర్మాణం ఏం దాచకుండా ఇచ్చాడు. అదంతా తెలిసికూడా అందానికి ప్రలోభపడతాం. అనుకున్నాడు. అతనికిప్పుడు అర్జంటుగా ఒక స్త్రీ అండ కావాలి.

"మీ అత్తగారు పోయారట!" హడావుడిగా వచ్చింది వసంత.

"హాయ్ వసూ! ఆమె పోతూ, పోతూ నన్నొక సముద్రంలో ముంచిపోయింది" అన్నాడు.

"నిన్ను మునగనిస్తానా డార్లింగ్ ..." అతని క్రాపు చెరిపేసింది వసంత. అతను మౌనంగా తల దువ్వుకుని, బెల్ నొక్కాడు. సిస్టర్ వచ్చింది.

"సిస్టర్! మిసెస్ చంద్రసేన్‌ను డాక్టర్ లోహిత్‌కు చూపించడానికి తీసుకువెళ్తున్నాను" అన్నాడు. ఆమె కోటు అందించింది. ఇద్దరూ బయలుదేరారు.

అతను కారు తిన్నగా ఓ మారుమూల హోటల్ ముందాపాడు.

"ఇక్కడ ఎందుకు !"

"కాసేపు ప్రశాంతంగా గడుపుదామని. ఈ హోటల్లో నాకొక గది ఉంటుంది యెప్పుడూ" అన్నాడు. ఇద్దరూ దిగి లోపలికి వెళ్ళారు. అతడిని చూస్తూనే బాయ్ పరుగెత్తుకువచ్చి, గది తాళం తీశాడు

"బీరా, విస్కీ సర్ !"

"బీర్ ! రెండు మీల్స్ పట్టా" అన్నాడు.

అతను అలసటగా మంచంపై వాలిపోయాడు. వసంత అతని దగ్గరగా వెళ్ళింది.

"నీ సమస్య ఏమిటో చెప్పు శివా !"

"మమ్మీ పోయింది వసూ ! ఇల్లు చూసుకోవటానికి ఓ స్త్రీ కావాలి. అందుకే నేను పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను" అన్నాడు.

వసంత ఉలిక్కిపడింది. అతను పెళ్లి చేసుకుంటే తను గుర్తుంటుందా! ఏమో.

"కులం, కట్నం అనే ప్రసక్తే లేదు. ఇల్లును చూసుకుని, అరవింద్‌ను కాస్త ప్రేమగా చూసుకునే వారయితేచాలు వసూ. మమ్మీ ఉండగా ఆమె చేసిన ప్రయత్నాలు తేలికగా కొట్టిపారేశాను" అన్నాడు.

"అలాగే. మా కజిన్ ఉంది. కాని దానికి కాస్త వయసు ముదిరింది" అన్నది వసంత.

"నేను బాలాకుమారుడిని కాదు" అన్నాడు.

# యక్షగానం

బీర్ వచ్చింది.

అతను బీర్ త్రాగుతుంటే వసంత ఎక్కడికో ఫోన్ చేసింది. భాగ్యనగర్ ఉడ్‌వర్క్స్ అని అడిగింది.

"స్వతంత్రా! నువ్వేనా... ఒక్కసారి హోటల్... రా... తరువాత చెబుతానే. నువ్వు రా" అన్నది ఫోన్ పెట్టేస్తూ.

"యెవరు వసూ !"

"మా కజిన్ అని చెప్పాను..."

"ఇక్కడికి రమ్మన్నావెందుకు ?"

"వస్తే ఏమయింది ?"

"నీకు తెలియదు వసూ. ఈ దేశంలో స్త్రీపురుషుల స్నేహాన్ని హర్షించరు. పర్మిసివ్ సొసయిటీ అంటున్నారు. కాని - నుమానించటం, అక్రమ సంబంధాలు అంటగట్టటం పరిపాటి."

## అతి ఖరీదైన చిత్రం !

పశ్చిమ జర్మనీలో ప్రముఖ దర్శకుడు పీటర్సన్‌ను ఖరీదైన చిత్రాల దర్శకుడిగా పరిగణిస్తారు. ఆయన తాజా చిత్రం 'ది ఎండ్ లెస్ స్టోరీ' నిర్మాణానికి 25 కోట్ల రూపాయలు ఖర్చు కాగలదని భావిస్తున్నారు. పశ్చిమ జర్మనీలో నిర్మాణమవుతున్న చిత్రాలలో ఇదే అత్యంత ఖరీదైన చిత్రం కాగలదు. గతంలో ఆయన 'ది బోట్' అనే చిత్రాన్ని నిర్మించాడు. అప్పట్లో అదే ఖరీదైన చిత్రం. ప్రస్తుతం ఈ చిత్ర నిర్మాణపు ఖర్చు దానికంటే రెండు రెట్లు పైగా కాగలదు.

వసంత పక, పక నవ్వింది.

"మనకు సంబంధం లేదా !"

"ఉందని మెడకు బోర్డు వేసుకుని తిరుగుతామా ! అసలు ఈ ఏకాంతంలో మనల్నిచూస్తే ఆ అమ్మాయి అనుమానించదూ !" అన్నాడు.

"అప్పుడే ఆ వీర పోజులు యెందుకట ! అయితే పెళ్లి కాగానే నన్ను మరిచిపోతావా !" అన్నది కోపంగా అతని జుట్టు చెరిపేస్తూ.

"వసూ ! నువ్వు నా పేషెంటువి. అది వేరే విషయం."

"అయితే దానికేవో సర్ది చెబుతాను" అన్నది వసంత.

"కాస్త బీరు రుచి చూస్తానా !" అన్నాడు.

"ఏం తోచనప్పుడు బీరు, విస్కీ అన్నీ త్రాగుతాను. నీ సమక్షం నాకు బీరు, విస్కీకంటే మత్తు కల్గిస్తాయి శివా ..." అన్నది అతని హృదయంలో తల దాచుకుని

"అంత ఆరాధించేదానవు ఒక పని చెయ్యి."

"చెప్పు ..." అన్నది అతని బుగ్గపై గాటు పడేలా కొరుకుతూ.

"ఛ...మొరటు... అవునూ, మీ ఆయనకు విడాకులు ఇచ్చెయ్యి. ఇద్దరం హాయిగా పెళ్లి చేసుకుందాము" అన్నాడు.

"అది నువ్వు వద్దన్నావు. ఒకందుకు అదీ మంచిదే, నా జీవితం నా ఒక్కదానిది కాదు. నా తరువాత ఇంకా ఇద్దరు చెల్లెండ్లు ఉన్నారు. 'అక్క భర్తకు విడాకులిచ్చిందని అంటారు' యెందుకు ఏమిటి అని ఆలోచించరు" అన్నది.

అతను మాట్లాడక చూడసాగేడు.

"పురుష పుంగవుల స్వార్థం నేను ఎరగనిది కాదు..."

"ఊహు ! అయితే ఓ చెల్లెలినే ఇచ్చి చెయ్యరాదూ ! నీ చేతిలోనే ఉంటాను" అన్నాడు.

"చేసేదాన్నే కాని, చూస్తూ చూస్తూ చెల్లెలి జీవితంలో భాగం తీసుకోలేను."

"ఆడవాళ్లెంత స్వార్థపరులు. పైగా మగాళ్లను గూర్చి కామెంటు చేస్తావు..." అతను ఆమె భుజంపై ఒకటిచ్చాడు.

ఆమె పక పక నవ్వింది. బయట బెల్ కొట్టారు. వెంటనే ఇద్దరూ సర్దుకుని కూర్చున్నారు. శివాజీ లేచి, బుగ్గపై పౌడరద్దుకున్నాడు.

వసంత వెళ్లి తలుపు తీసింది.

"రా స్వతంత్రా... రా..." దారి చూపింది. ఇద్దరూ లోపలికి వచ్చారు.

స్వతంత్ర నమస్కరించింది.

"నమస్తే ! కూర్చోండి" ఇద్దరూ అతని ఎదురు కుర్చీలో కూర్చున్నారు. అతను బెల్ కొట్టి, రెండు కూల్‌డ్రింక్స్, మరో భోజనం తెమ్మని చెప్పాడు.

"నా క్యారియర్ ఉందండీ" నుదుట పట్టిన చెమట తుడుచుకుంది స్వతంత్ర.

"ఒక్కరోజు మరేం ఫరవాలేదు. ఏమంటారు వసంతగారూ."

"నేనేం అన్నా వినదు డాక్టరుగారూ !"

"ఈ ఒక్కరోజు మాకు కంపెనీ ఇవ్వండి స్వతంత్రగారూ."

"ఇతను మా ఫ్యామిలీ డాక్టరు శివాజీగారు— వారి శ్రీమతి పోయింది. ఒక్క అబ్బాయి ఉన్నాడు. మొన్నటివరకు వారి అత్త ఉండి స్త్రీ అవసరం తెలియలేదు. ఆమె ఈ మధ్య పోయారు. అర్జంటుగా ఇక్కడికి రమ్మని ఫోన్ చేసారు. 'నాకు పని ఉంది నువ్వు పో' అని మా వారు వెళ్లిపోయారు. ఏమిటోనని వస్తే తన విషయాలు చెప్పి నా పరిస్థితిని అర్థం చేసుకునే ఒక వధువును చూపించ మన్నారు" అన్నది ఏకబిగిన.

[ఇంకా వుంది]

## ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

### ఎ. ఎస్. ఏ. — అలంపూరు

నిరాశ మేఘాలు కమ్మిన ఆశ బ్రతుకులో వసంతం — వస్తుందా ?

★ వసంతం వస్తుందో రాదోగాని కష్టాల వర్షం కాస్త కురిసి మరీ వదుల్తుంది !

### కె. ఎ. — పాలూరు

ప్రేమకు ముందు మగవాడు వేసేది గాలం, ఆడది వేసేది వల అని అంటారు. నిజమేనా ?

★ గాలం సంగతీ వల సంగతీ తెలియదు గాని — ఈ వేటకు ప్రారంభం — ఎప్పుడైందీ తెలియదు. ముగింపు ఎప్పుడన్నదీ తెలియదు.

### ఆర్. ఎస్. — పోతపాడు

నేనూ, నా స్నేహితురాలు చాలా క్లోజ్‌గా వుంటాము. పరిస్థితుల వలన భవిష్యత్తులో విడిపోతామేమోనని భయంగా వుంది. ఏం చెయ్యమంటారు ?

★ కాస్త దూరమై చూడకూడదూ ? మరీ అంత ఊపిరి సలపని క్లోజ్‌నెస్ కూడా స్నేహం పోడానికి కారణం కావచ్చు.

### కె. ఎస్.; ఆర్. డి. — సూర్యాపేట

నిజంగా ప్రేమ గుడ్డిదా ?

★ కాదు ప్రేమించుకునేవాళ్లే — గుడ్డివాళ్లనాలి. ఎందుకంటే — తాము ప్రేమించిన వ్యక్తిలో లోపాలు కనబడవు సరికదా— సుగుణాలు రెట్టించి కనబడతాయి.

### కె. పి. — వెంకటాపురం

తన అభివృద్ధిని చూసి సంతోషించే స్నేహితులు గొప్పవారా ? ఈర్ష్యపడే చుట్టాలు గొప్పవారా ?

★ ఈ రోజుల్లో ఆ తేడా లేదు !

### పి. కె. కె. — ఖర్గపూరు

మీరు స్వీట్‌గా హాట్‌గా జవాబు లిస్తూంటారే... మిమ్మల్ని చూడాలని వుంది. ఎలా — మాది ఖర్గపూరు.

★ ఖర్గపూరు నాకు చాలా దగ్గిర. నాకో బంగారుతల్లి వుందక్కడ — శ్యామలారాణి. వచ్చినప్పుడు తెలియచేస్తాను. చూద్దురుగాని ! సరేనా ?

### జి. ఎ. ఆర్. — గుజ్జనగుండ్ల

ఈ రోజుల్లో విద్య జ్ఞానాన్వేషణకా ? ఉద్యోగార్జనకా? వ్యాపారానికా ?

★ అన్నింటికీ వుపయోగిస్తుంది — విద్య— సంపాదించటం మంచిది.

### షన్ముఖ — సువాబేడ

పూర్వకాలంలో వందమందిలో తగిన వరుడ్ని స్వయంగా ఎన్నుకునేవారు స్వయంవరంలో. ఇప్పుడు కూడా ఆ పద్ధతి బాగుంటుందేమో ?

★ బాగానే వుంటుంది. కాని అమ్మాయిలకి నిజంగా అంత స్వేచ్ఛ యిస్తే — సగంమంది అబ్బాయిలకి పెళ్లికాదు !

ప్రేమించిన వివాహాలెన్నో విఫలమవుతున్నాయి. పెద్దవాళ్ల చూపుల ద్వారా కుదిర్చిన సంబంధాలు చేసుకోవడమే మంచిదని నా అభిప్రాయం.

★ పెళ్లిళ్లు విజయవంతంగా కొనసాగాలంటే — ఇద్దరూ — కృషి చేయాలి. పెళ్లి శాశ్వతమైన బంధం— అంటే—దాన్ని శాశ్వతంగా వుంచడానికి ఎంత శ్రమపడాలో ఆలోచించండి.

### బి. ఎస్. జి. — ఆర్మూరు

మనదేశం ముందంజ వేసేది ఎప్పుడు ? వెనుకబడి ఉండడానికి కారణం ఏమిటి ?

★ కష్టం — ఎందుకంటారా ? ఒక అడుగు ముందుకు వేస్తే నాలుగడుగులు వెనక్కి వేయడం జరుగుతోంది. ఇక వెనుకబడినతనానికి కారణం ? — రాజకీయవేత్తల — స్వార్థం.

### వి. వి. ఆర్. — సికింద్రాబాదు

గొప్ప పిల్లని పేదవాడు పెళ్లాడితే సుఖపడతాడా ?

★ ఎలా సాధ్యం ?! ఆ వచ్చేది పెళ్లాం కాదు. యజమాని అవుతుంది.

### వై. లత — మంగళగిరి

మీరు రాసిన మొదటి నవల పేరు ?

★ అవతలి గట్టు, 1956.

### ఎమ్.ఎస్.ఆర్. — ఏలూరు

తిండికోసం బ్రతకడంకాదు — బ్రతకడం కోసం తిండి అన్నారు. మరి ఆ బ్రతకడం దేనికి?

★ పుట్టాం కనుక !!

### జి. బి. — విశాఖపట్నం


నాకు సినిమా దర్శకత్వం చేయాలని వుంది. నేను రాసిన స్టోరీ పూర్తి అయింది. ఎవరివలన పని అవుతుంది ?

★ ఇంకెవరు కావాలండీ? కథ మీ దగ్గిరుంది. దర్శకత్వం మీ దగ్గిరుంది — యిక డబ్బుండదా ?! లేకపోతే — అప్పు ఎలాగావుంది. నడుం బిగించండి. ధైర్యం చేసినవాడినే లక్ష్మి వరిస్తుంది.

### జె. కె. — గూడూరు

అక్కయ్యా దేవుడు వున్నాడు అంటే —మీరు నమ్మరు. కాని ఈ అనంత సృష్టికి మూల పురుషుడు ఎవరు ?

★ దేవుడు లేడని నేనెప్పుడూ అనలేదు. ఉన్నాడా ? లేడా ? అన్న చర్చ సిల్లీగా ఉంటుంది నాకు. నేను నాస్తికురాలిని కాదు. భక్తురాలినే. ఇక— అనంత సృష్టికి మూల కారణం— ఎవరని చెప్పను ?! ★



# న్యాయం అందరికీ ఒక్కటే...

## యం. ఉమామహేశ్వర రావు

కారు తలుపును సుతారంగా మూస్తూ చిర్నవ్వుతో ప్రక్కనే నించున్నారు వెంకట్రావు మాష్టారు. ఆయన ప్రక్కనే ఆయన అర్ధాంగి పార్వతమ్మగారు నించుని కారులోని రంగనాథంగార్కి మరోసారి నమస్కారం చేసింది.

"వెళ్ళొస్తాంరా ! వెంకట్రావ్ ! వెళ్ళగానే ఓ వారం రోజుల్లోనే పురోహితుడితోకూడ మాట్లాడి పూర్తి వివరాలతో నీకు ఉత్తరం వ్రాస్తాను ..." చిర్నవ్వు ముఖంమీద కదలాడుతుండగా అన్నారు రంగనాథం. ప్రక్కనే కూర్చున్న తులసీదేవికూడ ముఖంమీద చిర్నవ్వు పులుముకుంది.

కారు కదిలింది.

దుమ్ము, ధూళితో నిండివున్న ఆ చిన్న రోడ్డుమీద నుంచి 'రయ్'మంటూ దూసుకుని పోతున్న ఆ నీలిరంగు కారుకేసి కన్నార్పకుండా క్షణంసేపు చూసి దీర్ఘంగా నిట్టూర్పు వదిలారా దంపతులు.

కారు ఊరి మలుపు తిరిగి, కనుమరుగైంది.

వీధిలోంచి యింట్లోకి వచ్చేరు వెంకట్రావు మాష్టారు. ఆయన మనస్సులో విడీవిడని చిక్కు సమస్య ఏదో కదలాడుతోంది. వెనకగానే వచ్చిన పార్వతమ్మ భర్తను కదిపింది.

"వాళ్ళు మనమ్మాయిని ఇష్టపడ్డారంటారా ?! ..."

ఏదో సందేహం మనస్సులో కదలాడుతుండగా అందామె.

"ఎందుకిష్టపడరే ?! ... భేషుగ్గా ఇష్టపడతారు. మనమ్మాయికేం కొదవ? అందమా? చదువా ? దేన్లోనూ లోపించలేదు. ఇక కట్న కానుకలంటావా ? వాటి విషయం రంగనాథం ఎత్తనూలేదు. మనమూ మాట్లాడలేదు" అన్నారాయన భార్యనే చూస్తూ.

"అదికాదండీ ?! ... కట్నం విషయం మనమన్నా ముందే చెప్పేయవలసింది ?! ..."

భార్య మాటలకు చిర్నవ్వు నవ్వేడాయన.

"చూడు పార్వతీ ! . ఆ రంగనాథం గురించి నీకు బాగా తెలీదు. వాడూ నేనూ కలిసి చదువుకున్నాం. ఆ రోజుల్లోకూడ ఈ కట్నాలన్నా, కానుకలన్నా, వాడికి ఒళ్ళుమంట. ఈ కట్న పిశాచిపై ఆరేడుగంటలసేపు ఏకధాటి మాట్లాడేసి కాలేజీలో, అందర్నీ ఠారెత్తించేవాడు. వాడిప్పుడు పెద్ద డాక్టరైనా, వాడి మనసు చిన్నమనసుగాదు, పెద్దమనసే ..."

భర్త మాటలు ఆమెకి రుచించలేదు. "మీరలా ఆలోచిస్తున్నారుగాని, అప్పటి రోజులు వేరు, యిప్పటి రోజులు వేరు. ఆయన మీకు ప్రాణస్నేహితులేగావచ్చు, కట్నం అంటే కోపమే రావచ్చు ... కాని ఆయన భార్య మాటేవిటి ? తన కొడుక్కు కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసేందుకు ఆ తల్లి ఒప్పుకుంటుందా ??!..."

వెంకట్రావు మాష్టారు కాస్సేపు ఆలోచనలో పడే ప్రశ్నే అది... కాని వెంటనే నోరు విప్పేరు.

"చూడు పార్వతీ!... ఆవిడ నా దృష్టిలో చాల ఉత్తమురాలు. మంచి భావాలు ఉన్న స్త్రీ. అసలు వాళ్ళిద్దరూ ఒకే తరహా అభిప్రాయాలూ— అభిరుచులూ గల వాళ్ళు. కాలేజీ రోజుల్నుంచీ వాళ్ళు ప్రేమించుకోవడం... కట్న కానుకలకు వ్యతిరేకంగా పోరాడి పెళ్ళి చేసుకోవడం నేనెరుగుదును. ఆ భర్తకు అన్ని విధాలా తగిన భార్య. వాళ్ళకు మనమ్మాయి నచ్చిందని ఘంటాపథంగా చెప్పగలను. అంతే ఇంకేం ఆలోచించకు. ఏవన్నా ఆలోచించవలసి వస్తే, రంగనాథం ఉత్తరం ఎలానూ వ్రాస్తానన్నాడుగా... అది చూసేక మనం ఆలోచిద్దాం."

భార్య అంతరంగంలో పరవళ్ళు త్రొక్కే తీవ్రతను అప్పటికి అణగార్చి, వాతావరణాన్ని తేలిగ్గా మార్చేశేరాయన.

పార్వతమ్మగారు మరింకేమీ అనలేదు. "ఎలాజరగాలనుంటే, అలానే జరుగుతుంది. మనమెవళ్ళం మధ్య ? ? ..." అంటూ తనకు తానే సర్దిచెప్పుకుని కూతురి గదిలోకి నడిచింది.

వెంకట్రావు, పార్వతమ్మగారల కూతురు సంధ్య. బీ.యే. పాసయింది. 'బ్రతకలేక బడిపంతులు' అని అన్నది ఎవరోగాని, బ్రతకలేకనేగాదు, మరో మార్గాంతరం తోచని స్థితిలో చేతిలోని డిగ్రీ సర్టిఫికెట్ చూస్తూ సంవత్సరాల తరబడి నీళ్ళు నమలలేక, జీవన సంద్రంలోని, నిరుద్యోగ తుఫాన్ తాకిడిలో, అటు కదిలీ, యిటు కదిలీ, చివరకు బడిపంతులుగా రూపు దాల్చేసేరాయన. ఉన్న ఊళ్ళోనే కొంపా, తల్లీ, దండ్రీ మిగిల్చిపోయిన ఎకరం మాగాణీని అట్టేపెట్టుకుని జీవన నావకు గట్టు పడకుండ నెట్టుకువస్తున్నారు.

కాలేజీలో చదివేటప్పుడు రంగనాథంతో పరిచయం కలుగడం... నూరుమంది మూర్ఖుల స్నేహంకన్నా, బుద్ధిమంతుడైన ఒక్కడితో స్నేహం ఎంతోమంచిదని రుజువు పరుస్తున్నట్లుగానే యిద్దరూ ప్రాణస్నేహితులైపోయారు. అభిమానం – ఆప్యాయతా వున్నచోట అంతస్థుల విభేదాలు వుండంటూరు. రంగనాథానికీ, వెంకట్రావుకీ ఆస్థి, అంతస్థుల్లో తారతమ్యం ఎంతో వుంది. కాని వారిద్దరి మధ్యగల అభిమానం దగ్గరా, ఆప్యాయతలనడుమా, అంతస్థుల విలువలేదు.

వెంకట్రావు మాష్టారికి తెలుసు, రంగనాథం మనస్సెటువంటిదో ?!... పైగా యిద్దరూ కలిసి వుండేటప్పుడే ఎన్నో బాసలు చేసుకున్నారు.

"మన ఇద్దరి స్నేహం ఏనాటికైనా, వియ్యం అందుకునేవరకూ నేను నిద్రపోను. మన అభిరుచులూ, ఆశయాలూ పోసి తయారు చేసుకుందాం మన పిల్లల్ని... వాళ్ళను కలిపి మన ఆశయాల బాటను సుస్థిరం చేద్దాం. పదిమందీ ఆ బాటమీదుగా పయనించేట్లు చేద్దాం..."

రంగనాథం ఈ మాటలంటున్నప్పుడు వెంకట్రావు శరీరం చిన్నగా స్పందించింది. కనుల వెంబడి ఆనందతరంగాల్లా కన్నీళ్ళు వచ్చేసేయి. ఆ ప్రాణస్నేహితుడి ఆప్యాయతకూ అభిమానానికీ చలించిపోయాడాయన.

* * *

"డాక్టర్ రంగనాథం, ఎం. డి. ఎఫ్. ఆర్. సి. యస్. లండన్."

అనే అక్షరాలున్న ఆ బోర్డు గేటు ముందుగా వ్రేలాడుతూ కనిపిస్తోంది. ఆ పెద్ద ఇంటికీ, గేటుకీ, మధ్య అశోకచెట్లు పొడవుగా, అందంగా పెరిగి ఆ యింటికో ప్రత్యేకమైన అందాన్నిస్తున్నాయి.

ఇంటిముందుకొచ్చి ఆగింది నీలిరంగు కారు. అందులోంచి ముందుగా దిగాడు డా. రంగనాథం. వెనకనే ఆయన భార్య తులసీదేవి. ఆ తరువాత

వాళ్ళబ్బాయి డా. వేణుగోపాల్ కూడ దిగేడు. వాళ్ళందరూ దిగినాక కారును యింటి ప్రక్కనే ఉన్న కారు షెడ్డులో వుంచేందుక్కోసం తీసుకు పోయాడు డ్రైవరు.

హాల్లోకి చేరగానే పనిమనిషి వచ్చి ముగ్గురికీ వేడి కాఫీ అందించింది. సరిగ్గా అప్పుడు ఆ హాల్లోని వాల్‌క్లాక్ అయిదు గంటలు కొట్టింది.

రాయవరం నుంచి కారులో విశాఖ చేరేందుకు రెండు గంటలు పట్టింది. కాఫీ త్రాగేక వేణుగోపాల్ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఖాళీ చేసిన కప్పు టీపాయిమీద పెడుతూ భార్య, తులసీదేవి వంక చూసేరు రంగనాధం. ఆమె ఏదో ఆలోచిస్తోంది.

"తులసీ !!..."

ఆలోచనల కంతరాయం కలగడంతో చివ్వున భర్తవేపు చూసిందామె.

"ఆ సంబంధంమీద నీ యభిప్రాయం ఏమిటి ? ?..." సూటిగానే అడిగేరాయన.

ఒక్క క్షణకాలం తడబడింది తులసీదేవి.

భర్త ఈ ప్రశ్న రేపో, ఎల్లుండో వేస్తాడని, ఈలోగా జాగ్రత్తగా ఆలోచించి తన అభిప్రాయం, నిర్ణయం చెబుదామనుకుందావిడ. కాని, ఆ ప్రశ్నేదో యిప్పుడే అడగడంలో తడబాటు కలిగింది.

"చెప్పే అభిప్రాయం ఏమిటో, జాగ్రత్తగా ఆలోచించి నువ్వు చెప్తావన్న నమ్మకం నాకున్నది తులసీ !!"

మళ్ళీ మరో బ్రేకు.

మనస్సు అద్దంలోకి తననితాను మరోమారు చూసుకుందామె.

'ఫేస్ ఈజ్ ది యిండెక్స్ ఆఫ్ ది మైండ్...' తన ముఖంలో భావాలు భర్తకు తెలియనీయకుండా ఎంత జాగ్రత్త పడదామన్నా, ఈలోగానే స్టడీచేసి రంగనాధం జాగ్రత్తగా వేసిన ప్రశ్న అది.

ఓ విధంగా ఏ మానసిక వైద్యుడికీ అందని మనోభావాల్ని యిట్టే పసిగట్టే నేర్పూ, చాక చక్యం ఉన్న డాక్టర్ రంగనాధం, తన భార్య మనోభావాల్ని పైకితెచ్చి, తనముందు చెప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. ఆ ప్రయత్నంలో అతను సాధారణంగ యింతవరకూ ఓటమి ఎరగడు.

తులసీదేవి గొంతు విప్పింది చివరకు...

"మీరేమీ, అనుకోకుంటే నా అభిప్రాయం చెప్తాను." ముందుగా అంది తులసీదేవి.

"నువ్వు చెప్పిందాన్నిబట్టి వుంటుందది



తులసీ !! ఒక వ్యక్తిగురించో, లేక ఓ కుటుంబం గురించో అభిప్రాయం ఏర్పరచుకునేముందు చాల ఆలోచన అవుసరం.'' స్థిరంగా పలికింది రంగనాథం గొంతు.

''అయితే... వినండి... ఈ సంబంధం నాకిష్టంలేదు ..!!''ఆగి భర్త వేపు చూసిందామె. రంగనాథం తొట్రుపాటు పడలేదు. నిదానంగానే ఉన్నాడు.

''ఎందుకో ఏవిటో చెప్తాను. అమ్మాయి విషయంలో నాకేమీ లోటుపాట్లు కన్పించలేదు. కాని, అదొక్కటే చాలదనుకుంటాను ఆమెనీ యింటి కోడలిగా తెచ్చుకుందుకు. ఆ కుటుంబం ఏమంత ఉన్న కుటుంబంగాదు. ఉండటానికి యిల్లూ, కొంత భూమి ఉన్నంతమాత్రాన వాళ్ళతో మనం వియ్యం అందాలనిలేదు. రేపు అబ్బాయి వాళ్ళ అల్లుడయితే ఏవివ్వగలరు ? వాడి సరదాలు ఏం తీర్చగలరు ? అందంకోసం, మనుషుల మంచిదనంకోసమే అయితే అంతకు మించిన వాళ్ళు కోకొల్లలీ పట్నంలో... అంచేత.. అంచేతనే నాకిష్టంలేదీ సంబంధం.''

చెప్పదలచుకున్న విషయం సూటిగా, చెప్పిందా తులసీదేవి. రంగనాథం భార్య వాదనకు తలవూపేడు. తిరిగి అన్నాడు.

''తులసీ !!...

ఈ సంబంధం చూడ్డానికి మనం వెళ్ళే ముందే నీకు చెప్పేను. ఆ వెంకట్రావుకూ, నాకూ ఉన్న స్నేహం, అనురాగం ఎటువంటివో!! ఆ విషయం నికూ బాగానే తెలుసు. అప్పటి నా స్నేహితుడిగానేగాదు! ఒకప్పటి మా ఆశయాలకు, ఆదర్శాలకు రూపునివ్వాలనే నా ఉద్దేశం...

వాళ్ళు మన అబ్బాయికి ఏమీ యివ్వలేక పోయినా, అంతకుమించి వాళ్ళ మనస్సుల్లోని ప్రేమనూ, అభిమానాన్నీ, అనురాగాన్నీ పంచి యివ్వగలరు.''

చెపూ్త ఆగేరు రంగనాథం.

భర్తకు అడ్డొచ్చింది తులసీదేవి. ''మీరెప్పటివో ఆదర్శాలూ, ఆశయాలూ పట్టుక్కూర్చుంటానంటే నేనెం చెప్పగలను ?

మనబ్బాయి డాక్టరు. ఈ సంఘంలో ఓ గౌరవప్రదమైన మనిషి. కట్నం కానుకలువద్దనీ, అవేవీ లేకుండ వాడి పెళ్ళి జరిపిస్తే వాడి విలువా, పరపతీ, చేచేతులారా పాడుచేసినట్లవుతాం! ... బిడ్డ గౌరవంతోపాటు వాడి పరువూ, మర్యాదా కాపాడుకోవలసిన మనుషులం మనం. కట్నం లేందే ఈ సంబంధం నాకిష్టంలేదు.'' ఆవేశంగా అంది తులసీదేవి.

ఆ మాటలకు నిరుత్తరుడై పోయాడు డా. రంగనాథం

''తులసీ !! నువ్వేనా ఈ మాటలంటున్నది ? కట్నం కానుకలనే వాటిని చీల్చిచెండాడిన నీవు, అవే అభిప్రాయాలతో వున్న నన్ను కానీ కట్నంలేకుండా ప్రేమించి పెళ్లిచేసుకోలేవా?!... అప్పుడు మనిద్దరిలో లేని ఈ ప్రశ్నకు, యిప్పుడు మాత్రం ఎందుకు తావియ్యాలీ ??!''

బాధ మిళితమైన స్వరంతో పలికేడు ఆయన. తులసీదేవి మాట్లాడలేదు. క్షణం మౌనంగా చూస్తూ ఉండిపోయింది.

రంగనాథం ఏదో నిశ్చయానికొచ్చినట్లుగా తలవూపేడు.

''ఆల్‌రైట్ తులసీ !! ... నీ మాటనే తీసుకుంటాను ... మన ఆస్థి ! అంతస్థు తాహత్తుకు తగిన సంబంధం మవ్వే తీసుకురా !! కట్నం నీ ఇష్టంవచ్చినన్ని లక్షలు పుచ్చుకో ... ఇక ఈ విషయంలో నేను వాదించేది ఏమీలేదు. రేపే వాళ్లకు ఉత్తరం వ్రాస్తాను.'' అంటూ చివాల్న లేచి తన రూములోకి చొరబడి తలుపులు వేసేడు విసురుగా.

* * *

'పోష్ట్' అన్న కేక విని గబగబా వీధిలోకి వచ్చేరు వెంకట్రావ్ మాష్టారు. ఆయన వెనకనే అర్ధాంగి పార్వతమ్మగారుకూడ వచ్చింది.

పొష్టుమేన్ అందించిన ఉత్తరం తీసుకుని లోపలకు వచ్చేరాయన.

''ఎక్కడినుంచండీ ఉత్తరం?...''ఆత్రతగా అందామె.

''ఎక్కడినుంచోనా ? ... మా రంగనాథం

మంచి. వెళ్ళిన వెంటనే పురోహితుణ్ణి అడిగి ఉత్తరం వ్రాస్తానన్నాడుగా !! మరిచిపోయావా!'' అన్నారాయన.

నిజానికి ఆడపిల్లకు పెళ్ళిచూపులు తతంగం పూర్తయినాక, వరుడు తల్లిదండ్రులు వెళ్ళేక ఏ సంగతీ వ్రాస్తామంటే, ఆ సంగతేదో ఉత్తరం తెచ్చేదాకా ఆడపిల్ల తల్లిదండ్రులకు క్షణ క్షణం ఆత్రం, ప్రతిరోజూ బెంగ, ఆ తర్వాత...కళ్ళు కాయలు కావేలా పోస్ట్ మెన్ కోసం ఎదురు చూపులు.

ఉత్తరం ఆసాంతం చదివేరాయన.

''ఏం వ్రాసారండీ?...'' ఇక ఉండబట్టలేక అంది పార్వతమ్మగారు.

''ఏ విషయమూ ఇందులో వ్రాయలేదే వాడు !... అర్జంట్‌గా ఓ నెలరోజులపాటు మెడికల్ కాన్ఫరెన్స్‌కు బొంబాయి వెళ్తున్నాను —అట్నుంచి రాగానే వెంటనే ఏ విషయమూ వ్రాస్తానూ అని వ్రాసేడు. అంతవరకూ మనల్ని ఆత్రత పడవద్దూ అని వ్రాసేడు...''

అన్నారు వెంకట్రావు మాష్టారు.

ఆమె ఓసారి గాఢంగా నిట్టూర్పు వదిలింది.

''నాకు మొదట్నించీ అనుమానంగానే ఉందండీ !! మీరు నా మాటను కొట్టిపారేశేరు.. ఆయనకు మనసులో ఎంతఉన్నా, ఆవిడ ఈ సంబంధం ఒప్పుకోరని అనుకుంటున్నాను. ఏదో జరిగింటుంది. యింకేం వ్రాయలేక యిలా వ్రాసేరు...'' బాధగా అంది పార్వతమ్మగారు.

''ఛ...ఛ... అదేమీగాదు. వాడు నిజంగానే బొంబాయి వెళ్ళివుంటాడు. రంగనాథం మనసు నాకు బాగా తెలుసు. పోనీలే! ఓ నెలరోజులేగా!! ఆగిచూద్దాం...'' భార్యకు సమాధానంచెప్పి మరేదో ఆలోచనలో పడ్డారాయన.

పార్వతమ్మగారు లోపలకు వెళ్ళిపోయింది.

* * *

తోటి హౌస్ సర్జన్స్‌తో ఏదో బాతాఖానీ కొట్టుకుంటూ, చేతిలోని స్టెత్ స్కోప్ ను విలాసంగా ఊపుకుంటూ వస్తున్న డాక్టర్ వేణుగోపాల్ సరిగ్గా కే. జీ. హెచ్. అవుట్ గేట్ సమీపంలోనికి రాగానే ఒక్కసారిగా ఎవరో వెనక నుంచి త్రోసినట్లుయి ముందుకు తూలిపడ్డాడు. చేతిలోని స్టెత్‌స్కోప్ దూరంగా ఎగిరిపడింది. కళ్ళు తిరిగిన మనిషిలా అయిపోయి నిలువుగా కూలిపోయాడు అక్కడికక్కడే...

''అరెరె ! వేణూ ఏం జరిగింది ?'' మిత్రులంతా కంగారుగా వచ్చి పరామర్శలు చేయ సాగేరు. వేణుగోపాల్ ఏమీ మాట్లాడలేదు. నిర్వికారంగా చూస్తూండిపోయాడు. ఇంతలో మరో స్నేహితుడు గబగబా పరిగెత్తి వార్డు రౌండ్స్‌లో ఉన్న డాక్టర్ రంగనాథంగార్కి ఈ విషయం తెలియజేయడం, ఆయన ఆఘమేఘాల మీద నిముష మాత్రంలో అక్కడకు చేరిపోవడం అనుకోకుండా జరిగిపోయింది.

నలుగురూ కలిసి వేణుగోపాల్‌ను లోపలకు తీసుకుపోయారు. అందర్నీ బయటనే ఉంచి వేణుగోపాల్‌ను చెకప్ చేయడం మొదలుపెట్టే రాయన.

బయటున్న మిత్రులకు కంగారు అధిక మైంది.

ఏం జరిగిందో ఏమయిందో ఎవరికీ బోధ పడలేదు.

ఉన్నట్లుండి అలా విరుచుకుపడిపోవడంతో తలా ఓ రకంగా కామెంట్ చేయసాగేరు.

ఓ అర్ధగంట పరీక్షానంతరం గదిలోంచి బయటకు వచ్చేరు రంగనాథం. తిన్నగా తన రూమ్‌లోకి చొరబడి టెలిఫోన్ ఎత్తి భార్యకు డయిల్‌చేసేరు. తులసీదేవి ఫోన్ అందుకుంది.

వేణుగోపాల్ పరిస్థితిని మూడు ముక్కల్లో చెప్పి, తను ఇంటికిరావడం ఆలస్యం అవుతుందని, మరేం గాబరాపడద్దని చెప్పేరాయన.

తులసీదేవిలో కంగారు, బెంగ అధికం అయింది. కొడుకు అలా పడిపోవడం ఆ తల్లి మనసుకు పెద్ద షాక్‌లా అయిపోయింది.

కే. జీ. హెచ్.కు వెళ్ళి కొడుకును చూసి వద్దామంటే భర్త ఏమంటాడో నన్న భయం ఆమెలో తొంగిచూసింది.

ఆ రాత్రి రంగనాథం యింటికొచ్చేవరకూ ఎదురుచూసింది తులిసి !

రంగనాథంగారు భార్యను పిలిచేరు. ఆమె యింకా వెక్కిళ్ళమధ్యనే ఉంది. భర్త చెప్పిన విషయం వింటే ఏ కన్నతల్లికి గుండె పగిలిపోదు? నవమాసాలు మోసి కని, పెంచి, పెద్దవాణ్ణిచేసి, కనిపెంచిన కన్నకొడుక్కు కాన్సర్ సోకిందన్న భయంకరవార్త ఆ తల్లిని మరంత కృంగదీసింది.

రంగనాథం ముఖంలో నెత్తురు చుక్కలేదు. భార్య స్థితిని చూసి ఆందోళన పడిపోయాడు. అయినా ధైర్యం తెచ్చుకుంటూ దుఃఖం దిగ మ్రింగుకుంటూ ఆమెను ఓదార్చసాగేడు

''మరేం కంగారు పడకు తులసీ !!... ఎంత ఖర్చయినా ఫరవాలేదు. విదేశ వైద్యుల్ని రప్పిస్తాను. వేణుకు బాగుచేయిస్తాను. నామాట నమ్ము !! మరేం దిగులు పడవద్దు.'' ఊరడిస్తున్నాడేగానీ, అతని మనస్సంతా కూడ గందరగోళంగానే ఉంది.

''ఏమండీ !! ఏమిటీ ఘోరం? మన ఇంటా — వంటాలేని ఈ భయంకర వ్యాధి అబ్బాయికెలాసోకింది ? ?... ఏ చెడు అలవాటూ లేని మన వేణుకీవ్యాధి ఎలా అంకురించింది?...''

కుమిలి కుమిలి ఏడుస్తున్న భార్యను మరేమీ అనలేక ఊరకుండి పోయాడు డాక్టర్ రంగనాథం.

* * *

ఆ రోజు ఉదయాన్నే హాస్పిటల్‌కు బయల్దేరబోతున్న భర్తను ఆపింది తులసీదేవి.

రాత్రంతా ఆమె మనస్సును దొలచిన సందేహాలు భర్తతో మాట్లాడి తీర్చుకోవాలన్న నిశ్చయానికొచ్చిందామె.

''ఏమండీ !...


ఆగి షర్టుమీద 'టై' సెట్ చేసుకుంటూ భార్యవంక చూసేడాయన.

''అబ్బాయి వేణుకొచ్చిన ఈ పరిస్థితిగురించి అందరికి తెలుసునంటారా ? !!''

''ఎవ్వరికీ యింకా తెలీదు తులసీ !! నిర్ధారం చేసిందనేగానీ, భయంకరమైన బ్లడ్ కాన్సర్ సోకిందన్న నిజం ఎవరికీ తెలీదు.'' ఎటో చూస్తూ అన్నాడాయన.

హమ్మయ్య ఫరవాలేదనుకుంటూ గుండెల మీద చెయ్యివేసుకుని నిట్టూర్చింది తులసీదేవి.

''ఇలాటి కొన్ని వ్యాధులు పెళ్ళయితే తగ్గి పోతాయని ఎక్కడో చదివానండీ !! అదీగాక యింకా మొదటి దశలోనే వుందన్నారుగా మీరు. ఈ సమయంలో ఆ పెళ్ళి చేసేస్తే చేసుకున్న దాని అదృష్టం బాగుంటే పూర్తిగా నయం






సాహితీ సాంస్కృతికసంస్థ 'ఊర్వశి' తృతీయ వార్షికోత్సవం హైదరాబాదులోని త్యాగరాజ గానసభలో ఇటీవల జరిగిన సందర్భంలో వేదికపై ఉన్న సమాచారశాఖ మంత్రి శ్రీ చేగొండి హరిరామ జోగయ్య, అకెకార భాషా సంఘం అధ్యక్షుడు డా. సి. నారాయణరెడ్డి, శ్రీ వై. కామేశ్వరరావు (బాలల అకాడెమీ), శ్రీ పి. భద్రవ్రత (టి. వి. డైరెక్టరు) గార్లని చిత్రంలో చూడవచ్చు.

గావచ్చునంటారు... అందుకని...'' నసిగింది తులసీదేవి.

భార్య ఆంతర్యం బోధపడింది రంగనాథంగార్కి.

''తులసీ !!...'' బాధగా అన్నారాయన.

''నీ ఉద్దేశం నా కర్థం అయింది. ఆ పెళ్ళేదో జేసేస్తే జబ్బు నయంగావచ్చునని నీ ఆశ. కాదన్ను. కాని ... ఎట్సించి ఏమైనా అనక వాడిని కట్టుకున్న స్త్రీ జీవితం ఎడారి పాలుగావలసిందేగదా ?! ... సాటి స్త్రీ జీవితం గురించి ఆలోచించలేని నీ బుద్ధిమాంద్యానికి విచారిస్తున్నాను ... ''

చిన్న కోపంతో అన్నారాయన.

తులసీదేవి కనుకొలకుల నిండుగా కన్నీళ్ళు. ఆమె అంతరంగంలో అగ్నిపర్వతాలు పగుల్తున్నాయి. మంచు సుడిగుండాలు సుళ్ళు తిరుగుతున్నాయి. బేలగా భర్త ముఖంలోకి చూసింది.

డా. రంగనాథం ఎటో చూస్తున్నారు.

కాస్సేపు ఊరుకున్నాక అన్నారు. ''తులసీ!! నీ ఇష్టం వచ్చినట్లే పోనీ చేసుకో అందామన్నా అలా అనలేని అశక్తుణ్ణి. వాడికిప్పుడు పెళ్ళిచేసి మరో స్త్రీ గొంతుకు ఉరిత్రాడు బిగించలేను. సారీ ! తులసీ ! సారీ !!'' తులసీదేవి ఆగలేదింక.

''అదికాదండీ !! పెళ్ళిచేస్తే కొన్ని తగ్గుతాయని మీకు తెలుసుగదా !! ఏమో ఆ భగవంతుడు కనికరిస్తే అలానే జరగొచ్చును. నాకా మాత్రం నమ్మకం ఉంది.''

మళ్ళీ అందామె. భార్యవంక చూసి నిట్టూర్చారాయన ''సరే ! తులసీ !! నీ మాటనే తీసుకుంటాను. అలాగే చెయ్యి. నీకు నచ్చిన సంబంధం సెటిల్ చెయ్యి మన వేణుకు. ఆ తరువాత వాళ్ళ అదృష్టం !! ... ''

## న్యాయం అందరికీ ఒక్కటే

అంటూ చరచరా బయటకు వచ్చి కారు తీసేరాయన ఆఫీసుకు వెళ్ళిపోదామన్న ఉద్దేశ్యంతో ...

* * *

''డాడీ !!...''

బెడ్‌మీద నుంచి లేచి తండ్రిని పిలిచేడు డా. వేణుగోపాల్ ! రంగనాథం వచ్చేరు వేణుగోపాల్ బెడ్ దగ్గరికి.

అదో ప్రత్యేకమైన గది. నిజానికి ఎమర్జన్సీ గది ! ... వేణుగోపాల్ నీరసపడి పోవడంతో ముందుగా అవీ, ఇవీ టెస్ట్‌లు జరిపించి, ఆ గదిలో బెడ్ ఎలాట్‌చేసి రోజూ ప్రత్యేకంగా చూడ్డం సాగించారాయన.

''మమ్మీకి యింకా అలా నిజం చెప్పకుండా దాచడం బాగులేదేమోనండీ !! నా కెందుకో మనిద్దరం కలిసి మమ్మీని ఆటపట్టిస్తున్నామేమో ననిపిస్తోంది. ఈ రోజు ఎలాగైనా మమ్మీని చూచి నిజం చెప్పెయ్యాలనివుంది నాకు ... ''

గాద్గదికంగా అన్నాడు డాక్టర్ వేణుగోపాల్.

రంగనాథం చిర్నవ్వు నవ్వేరు.

''డోంట్‌వర్రీ వేణూ !! మమ్మీకి చెప్పవలసినరోజు నిజంగా వచ్చేస్తోంది. అప్పుడు తప్పక చెబుదాం ! నాకు మాత్రం సరదాగా ఉందనుకున్నావా ?! నువ్వేం ఆ విషయమై ఆలోచించకు. అంతా నాకు వదిలేయ్ !!'' రంగనాథం బరోశా ఇచ్చేడు వేణుకు.

వేణుగోపాల్ మరేమీ మాట్లాడలేదు కాస్సేపు. క్షణం ఆగి మళ్ళీ అన్నాడు.

''పోనీ, నన్ను చెప్పెయ్యనంటారా ? ఆ సంధ్యను తప్ప వేరే ఎవర్నీ వివాహం చేసుకోనే

...మమ్మీ నా మాట ఒప్పుకోవచ్చు...'' ఎక్కడో ఏదో ఆశ తళుక్కుమనగా అన్నాడతను.

''వేణూ !! ప్లీజ్ వెయిట్ ఫర్ సమ్ టైమ్ !! నువ్వే చెబుదువుగాని. మమ్మీని ఎదురుపెట్టి నిన్నే అడుగుతాను ... సంధ్యను చేసుకుంటానని చెప్పేద్దువుగాని. ఆ తరువాత మిగతా విషయాలు నాకు వదిలెయ్ !!''

వేణుగోపాల్ ఆ మాటలకు ఎంతో సంతోషపడ్డాడు. మరో పదినిముషాలు అక్కడే వుండి బయటకు వచ్చేసేడు రంగనాథం.

* * *

పోస్ట్‌మన్ అందించిన ఉత్తరం చదివి ఎగిరిగంతేసేడు వెంకట్రావుగారు. సంతోషంతో భార్య పార్వతమ్మను కేకవేసేడు.

ఏమయిందంటూ గబగబా బయటకు వచ్చిందావిడ !

''నేను చెప్పలేదూ ?!... మా రంగనాథం మనస్సెటువంటిదో !! ఇదిగో ఈ ఉత్తరం వ్రాసేడు ...''

''ఏమని వ్రాసేరో, ఏవిటుందో ఆ ఉత్తరంలో చెప్పకుండా మీలో మీరే అలా సంతోషపడిపోతుంటే నాకేం తెలుస్తుందీ ?! ... కాస్త చెప్పండి. మీ ఆనందంలో నేనూ భాగం పంచుకుంటాను మరి !!'' అందావిడ.

''ఏమని వ్రాస్తాడే...నేను చెప్పలేదూ ?... అదే వ్రాసేడు. అబ్బాయికీ, వాడితల్లికీ పిల్ల నచ్చిందీ, ఫలానా తారీఖున నిశ్చయ తాంబూలాలు పుచ్చుకుందుకు బయలుదేరివస్తున్నామూ'' అని వ్రాసేడు.

పార్వతమ్మగారు మనస్సంతా ఆనందం, సంతోషం నిండిపోయింది. తమ కన్నకూతురుకు పెద్దింటి సంబంధం నిశ్చయమైనందుకు. ఆ కన్న మనసుకు అంతకంటే ఆనందం మరేముంటుంది ? ! ...

''నిజంగా వాళ్ళు మనమ్మాయిని తమ కోడలుగా చేసుకుందుకు ఒప్పుకున్నారంటావా?!'' ఇంకా ఎక్కడో రగుల్తోన్న సందేహం ఆమెనా ప్రశ్న వేయించింది.

''నీ సందేహం బాగానేవుందోయ్ !! ఎదురుగా వాళ్ళ ఉత్తరం వుంచుకుని ప్రశ్నలు వేస్తుంటే నాకు నవ్వొస్తుంది నిన్ను చూసి.

ఆ రంగనాథం మామూలు మనిషిలా, గంటకో మాట మార్చేసే వాడనుకున్నావా ? మాటన్నాడంటే అది జరిగి తీరవలసిందే...''

స్నేహితుడిపైన తనకుగల నమ్మకాన్నంతా భార్యముందు ఏకరువు పెట్టేడు వెంకట్రావు మాష్టారు. పార్వతమ్మగారు శ్రద్ధగా విన సాగిందవన్నీ...

* * *

ఆ రోజు వేణుగోపాల్‌ను ఇంటికి తీసుకొచ్చేసేరు రంగనాథంగారు. ఇన్నాళ్ళోజులూ కొడుకును సరిగా చూచుకోపోవడంతో ముఖం వాచినట్లుగా తనివితీరా చూసుకుంది తులసీదేవి


"నాకు అత్యంత ప్రియమైన
వాటిలో 'అంజలి' చీరలు ఒకటి!
చూడముచ్చటైన డిజైన్లు నాణ్యమైన
అల్లికలు మరియు మిరిమిట్లు గొలిపే
రంగుల్లో లభిస్తున్న 'అంజలి' చీరలు
నా అందాన్ని ఇనుమడింప చేస్తున్నాయి!"
—మాధవి
Anjali
విభాత్నమైన ప్రింట్లతో
100%
పాలియెస్టర్

ధర్మపథం:

బులుసు వేంకట రమణయ్య



# జూదంలో న్యాయం

వేట, జూదం – ఈ రెండూ సప్త వ్యసనాలలో చేరినవే. అయినా, అవి క్షత్రియులకు తప్పనిసరి అయినవి. పూర్వ కాలంలో రాజులు వేటకు వెళ్లేవారు. జూదం ఆడేవారు. వేటలో అడవిలోని క్రూరమృగాలను సంహరించడంవల్ల పరిసర గ్రామాలలోని జనులకు వాటి ఉపద్రవం లేకుండా ఉండేది. వినోదార్థమై జూదం ఆడేవారు. ఆ జూదంలో మోసం జరిగేటప్పుడు మాత్రం చిక్కులు కలిగేవి. హరిశ్చంద్రుడూ, ధర్మరాజు రాజ్యాలు కోలుపోయి నానా కష్టాలు పడడానికి కపట ద్యూతమే కారణం. జూదం న్యాయంగా జరిగినప్పుడే, అది వినోదాన్ని కలిగిస్తుంది. గెలుపోటములు పేరుకు మాత్రమే ఉంటాయి. ఎవ్వరికీ హానీ కలగదు. న్యాయమైన అక్ష క్రీడను గురించి ఒకగాథ నిరంకుశోపాఖ్యానంలో ఉన్నది.

నిరంకుశుడు పేరు పడిన విద్వత్కుటుంబంలో జన్మించి గొప్ప విద్వాంసుడయినా, విధివశం వల్ల వేశ్యాలోలుడై వారికోసం విపరీతంగా ధనం వ్యయం చేసేవాడు. డబ్బులేకపోతే దొంగిలించి, జూదమాడి ధనం సంపాదించి వేశ్యల కిచ్చేవాడు. వేశ్యాగృహంలోనే ఉండిపోయేవాడు; అతని సర్వస్వాన్నీ దోచుకొన్న పిదప ఒక వేశ్యమాత అతణ్ణి తరిమి వెయ్యగా విచారంతో ఊరు విడిచి పోయి పోయి, ఒక అడవిని ప్రవేశించాడు. అక్కడ అతనికి ఒక శివలింగం కానవచ్చింది. పరిస్థితులు ఇలా మారినా, వాని బుద్ధి మారలేదు. జూదమాడాలని బుద్ధి పుట్టింది. అక్కడ మరెవ్వరూ లేనందున, ఆ శివలింగంతోనే జూదమాడ నిశ్చయించి కొంగున కట్టిన పాచికలను విప్పి ఆ శివుని ముందు పడవేసి, తనతో జూదమాడవలెనని ఆ దేవుని కోరాడు.

"నువ్వు పలకకపోయినా సరే! నేను జూదమాడి తీరుతాను. నన్ను జయించడం ఎవ్వరికీ సాధ్యం కాదు. మొదట నా ఆట ఆడి, ఆ తర్వాత నీ ఆట కూడా నేనే ఆడుతాను. న్యాయంగానే ఆడుతాను. నీవు ఓడిపోయి నట్లయితే, ఇంద్రునితో చెప్పి రంభను నా వద్దకు పంపేటట్లు చెయ్యాలి. నాకు మరేమీ అక్కరలేదు" అని ఆ లింగం ఎదుటనే అక్ష క్రీడను ప్రారంభించాడు. మొదట తన పందెం ఆడి తర్వాత శివుని ఆట న్యాయంగానే ఆడేవాడు. తుదకు ఆటలో తానే గెలిచాడు. "రంభను అప్పగించు" అంటూ తన అంగ వస్త్రాన్ని శివలింగానికి చుట్టి లాగసాగాడు.

నిరంకుశుడు మౌర్ఖ్యంగా ప్రవర్తించినా, అతని ధైర్యసాహసాలను, ఆటలోని నేర్పును మెచ్చుకొని శివుడు ప్రత్యక్షమైనాడు. దీనికి ఆశ్చర్యపడుతూ, ఇంద్రాదులు కూడా అక్కడికి వచ్చారు. ఇది చూచి నిరంకుశుడు దిగ్భ్రాంతి పడి, శివుని కాళ్లపైపడి, తన అపరాధాన్ని క్షమించాలని వేడుకొన్నాడు. ఆ దేవుడు వరం కోరమనగా, "నాకు నీ సాన్నిధ్యం తప్ప మరేమీ అక్కర్లే"దన్నాడు. "పందెం ప్రకారం రంభను నీ వద్దకు పంపుతాను"అని నిరంకుశుని వద్దకు రంభను పంపాలని ఇంద్రునికి ఆదేశమిచ్చాడు. నిరంకుశుడు వద్దన్నా శివుడు "నీకు ఋణపడి ఉండలేను" అంటూ చివరకు సమ్మతింపజేశాడు. నిరంకుశుడు కొద్దిరోజులపాటు రంభతో సుఖంగా కాలంగడిపి, పిదప శంకరుని సాన్నిధ్యం చేరుకున్నాడు. నిరంకుశుడు జూదమాడినా, అందులో న్యాయం తప్పనందున మహేశ్వరుని అనుగ్రహానికి పాత్రుడైనాడు. ★

# న్యాయం అందరికీ ఒక్కటే

అయినా ఆమె హృదయంలో ఎక్కడో తీరని అశాంతి. మనస్సు అరలలో కొడుకు బ్రతుకు మీద సడలిపోతున్న ఆశ. నిరాస గుప్పిట్లో గింజుకులాడుతున్న మనస్సును కాస్సేపు అదిమింది.

"తులసీ!!..."

తలెత్తి భర్త వంక చూసింది తులసీదేవి.

"ఏదో సంబంధం చూస్తానన్నావుగా!! ఏవయ్యింది నీ అన్వేషణ ?"

తులసీదేవి అయోమయంగా భర్తవేపు చూసింది.

భార్యవేపే రెప్పవాల్చకుండా చూడసాగేరు రంగనాథం. ఆ తరువాత కొడుకు వేణుగోపాల్ వంక సాభిప్రాయంగా చూసేరు. ఆ చూపును అర్థం చేసుకున్నాడు వేణుగోపాల్.

"స ం బ ం ధ ం ఏవిటి నాన్నగారు ?" ప్రశ్నించాడు.

"ఏంలేదు వేణూ! మీ అమ్మ నీకు అర్జంట్‌గా పెళ్లిసంబంధం చూస్తానంది. నీకు పెళ్లి చేయాల్సిన బాధ్యత మాకుందిగా!!..." అన్నారాయన.

వేణుగోపాల్ తల్లివంక చూసేడు.

"నాకు వేరే సంబంధాలేవీ చూడకండి డాడీ !!... ఆ మధ్య చూసేంగదా !! ఆ టీచరు ...ఆ అమ్మాయిని మాట్లాడేసెయ్యండి. నాకూ ఇష్టమైందా అమ్మాయి..." నేలచూపులు చూస్తూ అన్నాడు వేణుగోపాల్.

"అదిగాదు వేణూ!!... మంచి సంబంధం, సొసైటీలో నీ పరువూ, హోదా నిలబడే లక్షల సంబంధం చూస్తానంది మీ అమ్మ !! అందుకే ఆ టీచర్‌గారి అమ్మాయి విషయం డ్రాప్ చేసేసేం..."

వేణుగోపాల్ ఏదో అ న బో యా డు. తులసీదేవి అడ్డుపడింది "ఏమీ డ్రాప్ చెయ్యలేదు వేణూ !!...ఆ సంబంధం నాకూ ఇష్టమైంది. నీ ఇష్టమే నా ఇష్టం కూడా !! వచ్చేనెలలోనే ముహూర్తం పెట్టించి ఆ అమ్మాయితోనే నీ పెళ్లి జరిపిస్తాం!! నువ్వేం దిగులు పెట్టుకోవద్దు."

రంగనాథం ఏదోఅనబోయాడు. ఆపిందామె.

"మీరు ఊరుకోండి ... ఇలారండి!!" బయటకు లాక్కొచ్చింది భర్తను.

"అదికాదు తులసీ!! ఆ సంబంధం వద్దని అనుకున్నాంగా ! మళ్ళీ యిదేవిటి?" రంగనాథం ఏదో సందేహంతో అన్నారు భార్యనే చూస్తూ.

"ఇప్పుడేం అనకండి !! వాడు ఇష్టపడితే అదే చాల్ను. పైగా మన వేణు విషయం తెలిస్తే అసలీ జన్మకే వాడి పెళ్ళిగాదు. ఏమో ఆ పిల్ల అదృష్టం బాగుంటే వేణు ఈ భయంకర వ్యాధి నుంచి విముక్తుడుగావచ్చుగా !! ..."

"ఇదేం న్యాయం తులసీ!! న్యాయం అందరికీ ఒక్కటే !! చూస్తూ చూస్తూ, నా ప్రాణ స్నేహితుడి ఒక్కగానొక్క బిడ్డ గొంతు కోయలేను."

బాధ మిళితమైన స్వరంతో పలికేడు రంగనాథం. తులసీదేవి ఊర్కోలేదు.

"మీరు ఊరుకోండి !! నా కొడుకు సుఖ సంతోషాలు నాకు గావలసింది. ఏం జరిగినా, ఎలా జరిగినా అదంతా అదృష్టంమీద ఆధారపడి వుంది. మీరు కాదనకండి. రేపే పురోహితుణ్ణి కలిసి ముహూర్తం పెట్టించండి. ఆ పిల్ల తండ్రికి వ్రాయండి ..." అంటూ చరచరా వేణుగోపాల్ వున్న గదిలోకి వచ్చిందామె.

రంగనాథం ఒక్కసారిగా సంతోషంతో నిట్టూర్చాడు.


"థాంక్స్ డాడీ !! చాల శ్రమ తీసుకున్నారు ..." అంటూ తండ్రి చెవిలో చెప్పివెళ్ళిపోయిన వే ణు గో పా ల్ మాటల్ని హడావుడిలో తులసీదేవి గమనించనేలేదు. ★

# య్యేటంతటి ఉన్నత స్థితికి వచ్చారు



లన

ఇప్పుడో ! అతని నైపుణ్యాత,
మరియు పనియందే అంకితం
చేసుకొనుట వలన, సూపర్‌వైజర్‌గా
ప్రమోట్ గావించబడ్డాడు.



అశోక్ తన జీవితంలో ఎంతో కష్టపడి పైకి వచ్చాడు. అతను ఒక
ప్రత్యేకమైనది పొందటానికి తగినవాడు...బిఎస్ఎ. డీలక్స్.
ఇండియా దేశంలోని రోడ్ల స్థితి, దృఢత్వమునసరించి
తయారుచేయబడిన అత్యుత్తమమైన బైసికల్.
అంతేకాదు, మరికొన్ని విశేష లక్షణాలు :– ● బ్రూక్స్ సేడిల్ మరియు
రెడిన్ క్రోమియమ్ ప్లేటింగ్ చేయబడిన స్పోక్స్. ● తినివేయని పెయింట్.
మెరిసే ఆకుపచ్చరంగు లేక అద్దపు నునుపుగల నలుపు రంగులో లభ్యం.
● టిఐ హాల్‌మార్క్ యొక్క నాణ్యతపై గ్యారంటీ.
● ఒక సంవత్సరం గ్యారంటి సరిక్రొత్త బిఎస్ఎ డీలక్స్. ఇండియాలో ఉత్తమమైన బైసికల్.
ఇండియాలో ప్రఖ్యాతిగన్న బైసికల్ తయారుచేయువారగు టిఐ వారిచే తయారు.

# క్రొత్త బిఎస్ఎ డీలక్స్

Rediffusion/TI/1402TL

# సినిమా విశేషాలు

-జి. వి. జి.



'అపరాధి'లో సుహాసిని

## "అపరాధి"లో అద్దమైన చాకిరీ

పాత దినపత్రిక పట్టుకుని భద్రయ్య (సుత్తి వీరభద్రరావు) ఆదరాబాదరాగా రమేష్ (సుమన్) ఇంట్లోకి జొరబడ్డాడు "రమేషూ! నువ్వు పొద్దుట పేపర్ చదవగానే నా మొహాన పడేయకపోతే ఎంత లాసో చూడు సాయంత్రం దాకా వార్తలు తెలీవు నాకు బొత్తిగా సెకండ్ హాండ్ బతుకైపోయిందయ్యా!" అంటూ ఏడ్పు ముఖం పెట్టాడు.

రమేష్ విసుగ్గా చూశాడు "ఏమిటండీ మీ లాసు ?"

"పోలీసులకేదో ఆచూకీ కావాలట నేను పొద్దున్నే పేపరుచూస్తే, ఈ పాటికి వాళ్ళిచ్చే పదో ఎరకో నా చేతికందేదికదా ? ఇప్పుడు ఇంకెవడో తన్నుకుపోయే ఉంటాడు," అంటూ భద్రయ్య టెలిఫోన్ రిసీవర్ అందుకుని, డయల్ చేసి, "హలో, హలో ! పోలీస్టేషనా ? సార్, మీరు పేపర్లో వేశారే గిరిధర్ హత్యగూర్చి — ఆ నెంబరున్న కారు నేను చూశానండీ అయ్యా ? నా పేరు భద్రయ్యండీ వెధవలంతా బేవార్సు భద్రయ్య అంటారనుకోండి ఆకారాండీ? మా ఇంటి ఎదురింటి ఎదురుగా " అని వాగుతూండగా రమేష్ చివాలున ఫోన్ డిస్కనెక్ట్ చేసి, "ఏమిటండీ, ఏమిటీ గొడవ ? నన్నీ వెధవ సొదలో ఇరికించకండి వెళ్లండి పోలీసులు పరమ న్యూసెన్స్ చేస్తారు నాకున్న తలనొప్పులన్నీ చాలక మళ్ళీ ఇదొకటా ? మీరింక దయచేయండి," అన్నాడు

"అదీ ఒక రకంగా నిజమేలే ! ఆరా తీసే పోలీసులకీ, అనుమానించే పెళ్ళాలకీ దూరంగా ఉండడమే నయ్యం వస్తా!" అంటూ భద్రయ్య బయలుదేరాడు

"బ్రతుకు జీవుడా!" అనుకుంటూ సుమన్ బలంగా విశ్వాస వదిలాడు

పర్వతనేని సాంబశివరావు దర్శకత్వంలో ఎన్. గోపాల్‌రెడ్డి నిర్మించే భార్గవ్ ఆర్ట్ ప్రొడక్షన్స్ "అపరాధి" చిత్రం మూడొంతులకు పైగా పూర్తయింది సుహాసిని, జయమాలిని, గిరిబాబు, సత్యకళ, కె కె శర్మ, చిట్టిబాబు పాల్గొంటున్నారు. గణేశ్ పాత్రో, జె వి రాఘవులు, ప్రసాద్‌బాబు, కె సత్యం, దొర్స్వై, చంద్రమోహన్, పుల్లారావు తెరవెనుక కృషి చేస్తున్నారు


## రోజా మూవీస్ చిత్రంలో శోభన్, శ్రీదేవి

"రెండు చిత్రాలను ప్లాన్ చేశాం మొదట తెలుగు చిత్రాన్ని ప్రారంభిస్తాం ఆ తర్వాత హిందీ " అన్నారు నిర్మాత ఎం అర్జునరాజు శోభన్‌బాబు, శ్రీదేవి, సత్యనారాయణ, షావుకారు జానకి, నాగేష్, మమత పాల్గొనే చిత్రానికి విజయదశమినాడు తొలిగీతం ధ్వనిముద్రిత మైంది సత్యానంద్ సంభాషణలు, చక్రవర్తి సంగీతం, వెంకట్ ఛాయ, భాస్కరరాజు శిల్పం, కోటగిరి వెంకటేశ్వరరావు కూర్పుతో ఎ కోదండ రామిరెడ్డి దర్శకుడు "నవంబర్ 1నుంచి 10, డిసెంబర్ 1నుంచి 15 జనవరి 1నుంచి10 మూడు షెడ్యూల్స్‌లో షూటింగ్ పూర్తయిపోతుంది ఫిబ్రవరిలో విడుదల చేయాలనుకుంటున్నాం," అని నిర్మాత కె శివరామరాజు తెలిపారు. ఫిబ్రవరి నెలలో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంతో హిందీ చిత్రం సెట్స్‌కు వెళ్తుంది.

## కె. విశ్వనాథ్ దర్శకత్వంలో శ్రీ భ్రమరాంబికా ఫిలిమ్స్ చిత్రం

"నటీనటులలో పాతవారూ ఉంటారు కొత్తవారూ ఉంటారు నవంబర్ మూడవ వారంలో షూటింగ్ ప్రారంభిస్తాం, ఫిబ్రవరికి అయిపోతుంది. షూటింగ్ మొత్తం మన రాష్ట్రంలోనే జరుగుతుంది," అన్నారు ప్రముఖ సంకలనకర్త జి జి కృష్ణారావు. ఈయన నిర్మాణ సారథ్యంలో కె కేశవరావు నిర్మించే శ్రీ భ్రమరాంబికా ఫిలిమ్స్ వారి కొత్త చిత్రానికి అక్టోబర్ 17న పాటల రికార్డింగ్‌తో ప్రారంభోత్సవం జరిగింది డి వి నరసరాజు మాటలు, వేటూరి పాటలు, కె వి. మహదేవన్ సంగీతం, కస్తూరి ఛాయ, తోట తరణి శిల్పం, జి. జి కృష్ణారావు కూర్పు, నందూరి విజయ్ సహకార దర్శకత్వంతో కె విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు.

'తాండవ కృష్ణుడు'లో జయప్రద నాగేశ్వరరావు



## "గుడిగంటలు మ్రోగాయి"లో సైకిల్ బెల్ మ్రోగింది

తోట.. చంద్రి(అశ్వని) తండ్రి(వల్లం)కి, బైరిగాడికి (సత్యానంద్) అన్నం వడ్డిస్తూ, ఎవరి రాకకో నిరీక్షిస్తోంది బైరిగాడు గబగబా ఓ ముద్దకలిపి, చంద్రి నోటికి అందించబోయాడు చంద్రి అసహ్యించుకుంది అభిమానం దెబ్బతిన్న బైరిగాడి ముఖంలో రంగులు మారాయి అది గ్రహించిన చంద్రి తండ్రి నవ్వుతూ, "అల్లుడూ! సిన్నపిల్ల దాంతో సీక్రేటా? నవ్వుతిను," అన్నాడు.

ఇంతలో కాస్త దూరంనుంచి సైకిల్ బెల్ వినిపించింది చంద్రి ఆశగా తన ప్రియుడు రాంబాబు (సాయిచంద్)ని చూసింది ఆమె తండ్రికూడా చూశాడు కోపంతో "అల్లుడూ, ఆ యీడెవడో కాయలమీద కన్నేసినట్టున్నాడ్రా!" అన్నాడు

బైరిగాడు లేచాడు "మరి సూత్తావేటి మాఁవా? తోటకి నువ్వు కౌలుదారువేగాని, సొంతదారువికాదుకదా? నడు. ఆడియవ్వారం తేల్చేద్దాం," అన్నాడు

వెంటనే ఇద్దరూ పరుగు తీశారు చంద్రి భయంగా చూస్తూండి పోయింది.

తరుముకొస్తున్న వాళ్ళిద్దరికీ దొరక్కుండా చేలగట్లమీద సైకిల్‌లో వేగంగా వెళ్ళిపోతున్నాడు రాంబాబు చివరికి బైరిగాడు మాటేసి, సైకిల్‌ని ఆపుచేసాడు "ఆగు నాపేరు బైరిగాడు రెండు సార్లు రాజమండ్రి యెల్లాను తార్రోడుమీద తిరగాల్సిన సైకిలు చేలగట్లమీద తిరిగితే, కత మారిపోద్ది. కట్టాలొచ్చేత్తాయి యెల్లు!" అంటూ సైకిల్‌ని బలంగా తోశాడు

రాంబాబు స్పీడుగా వెళ్ళిపోయాడు

ధవళ సత్యం కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వంలో మాజేటి ప్రహ్లాదరావు సమర్పించే మనోరంజని క్రియేషన్స్ "గుడిగంటలు మ్రోగాయి" చిత్రానికి రవికుమార్, మోహన్ రావు నిర్మాతలు.

## "ఏజెంట్ నెంబర్-1"

"హాలీవుడ్ గూఢచారి ఫక్కీ చిత్రం అంజా ద్వీప్, రత్నదీపం, గోవా కోట, కాణ్వాల్ సముద్ర తీరంలో ఔట్‌డోర్ షూటింగ్‌లు జరిగాయి గోవా ఎయిర్‌స్ట్రిప్‌పై పతాక సన్నివేశాలు గగుర్పాటు కలిగించే విధంగా చిత్రీకరింపబడ్డాయి," అని తెలిపారు బిందు క్రియేషన్స్ పతాకంలో "ఏజెంట్ నెంబర్-1" చిత్రాన్ని నిర్మించిన జి. రాము, బి సత్యం అంబరీష్, జయమాల, సుభాషిణి, కన్నడ ప్రభాకర్ ప్రభృతులు నటించారు. రాజశ్రీ రచయిత సత్యం, రామకృష్ణంరాజు సంగీత దర్శకులు. పి ఎస్. ప్రకాష్ ఛాయాగ్రాహకుడు. డిసెంబర్ విడుదల.

## దాసరి రచన, దర్శకత్వంలో "రుద్రకాళి" షూటింగ్ పూర్తి

"నేటి నాగరిక సమాజంలో ఆడదానికి అడుగడుగునా జరుగుతున్న పాశవిక ప్రవృత్తికి అద్దం పట్టే చిత్రం" ఆఖరి షెడ్యూల్‌ను సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 7 వరకు బెంగుళూరులో పూర్తిచేశాం," అన్నారు దాసరి నారాయణరావు. ఈయన స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వంలో తారకప్రభు ఫిలిమ్స్ సమర్పించే తెలుగు చిత్ర వారి "రుద్రకాళి" చిత్రంలో జయమాల, చంద్రమోహన్, మురళీమోహన్, శరత్‌బాబు, గుమ్మడి, అల్లు రామలింగయ్య, ప్రభాకరరెడ్డి, గిరిబాబు, రావి కొండలరావు, చలపతిరావు, రమాప్రభ నటించారు సోము కథకుడు. సత్యం సంగీతం, కె. ఎస్. మణి ఛాయ, శ్రీనివాసరాజు శిల్పం, కృష్ణ కూర్పుతో రామినేని సాంబశివరావు నిర్మాత


## అమితాబ్, కమల్, శ్రీదేవి జయప్రదలతో లక్ష్మీ ప్రొడక్షన్స్ హిందీ చిత్రం

"జనవరిలో మూడు పాటల చిత్రీకరణతో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు తాతినేని రామారావు. ఈయన దర్శకత్వంలో అట్లూరి పూర్ణచంద్రరావు నిర్మించే 4వ హిందీ చిత్రం విజయదశమినాడు సెట్‌కు వెళ్ళింది. అమితాబ్ బచ్చన్, కమలహాసన్, శ్రీదేవి జయప్రద, అస్రానీ, శక్తికపూర్, కృష్ణధవన్ ప్రభృత తారాగణం లక్ష్మీకాంత్ ప్యారేలాల్ సంగీత దర్శకులు ఎస్ గోపాల్‌రెడ్డి ఛాయాగ్రాహకుడు. అదేరోజు సాయంత్రం 27 కేంద్రాలలో వంద రోజులు, 24 కేంద్రాలలో రజతోత్సవం పూర్తి చేసుకున్న ఈ సంస్థ మూడవ చిత్రం "అంధాకానూన్" విజయోత్సవాలు మద్రాసు యూనివర్సిటీ హాలులో భారీ ఎత్తున జరిగాయి



'పులి దెబ్బ'లో స్వప్నప్రియ

'సంఘర్షణ'లో రావుగోపాలరావు, చిరంజీవి, నళిని



## శ్రీ లలితా మూవీస్ కొత్త చిత్రం

‘‘విజయదశమినాడు షూటింగ్ ప్రారంభించాం,’’ అన్నారు పై సంస్థ అధినేత జీ. జగదీశ్‌చంద్రప్రసాద్. నరేష్, ప్రభాకరరెడ్డి, సత్యనారాయణ, రాజా, రాంజీ, రాళ్ళపల్లి, శశికళ నటిస్తున్నారు కాశీవిశ్వనాథ్ సంభాషణలు, సత్యం సంగీతం కె ఎస్ మణి ఛాయ, సారధి సహకార దర్శకత్వం, విజయకుమార్ శిల్పం, బాలు కూర్పుతో ఈ చిత్రానికి దర్శకత్వం వహించే బి భాస్కరరావు ‘‘జనవరికి షూటింగ్ పూర్తవుతుంది ఫిబ్రవరిలో విడుదలకు రెడీ అవుతుంది’’ అన్నారు.

### ‘‘చక్రవ్యూహం’’

‘‘నీతిమార్గం తప్పని ఓ పోలీస్ ఆఫీసర్ కథ కన్నడంలో హిట్ అయిన ‘చక్రవ్యూహ’ దీనికి బేస్’’ అన్నారు విజయనిర్మల ఈమె స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో కె సి ఎన్ చంద్రశేఖర్ సమర్పించే వినయ్ మూవీస్ వారి పై చిత్రంలో కృష్ణ, అంబిక, సత్యనారాయణ, రావుగోపాలరావు, గిరిబాబు, అల్లు రామలింగయ్య, వేలు, వీరభద్రరావు, నిర్మల వగైరా నటవర్గం అప్పలాచార్య మాటలు, చక్రవర్తి సంగీతం, పుష్పాల గోపీకృష్ణ ఛాయ, తోట తరణి శిల్పం, ఆదుర్తి హరనాథ్ కూర్పు, ఓ ఎస్ ఆర్ ఆంజనేయులు–శేషు సహకార దర్శకత్వం, కె బి ప్రసాదరెడ్డి నిర్వహణతో శాఖమూరి సాంబశివరావు సహనిర్మాత ఈ చిత్రానికి విజయదశమినాడు తొలి గీతం ధ్వనిముద్రితమైంది డిసెంబర్, జనవరి, ఫిబ్రవరిలో ప్రతినెలా 21వ తేదీ నుంచి నెలాఖరు వరకు జరిగే మూడు షెడ్యూల్స్‌లో షూటింగ్ పూర్తవుతుందని నిర్మాత టి శ్రీనివాసరెడ్డి తెలిపారు

‘‘అంకెబిందెలు’’ లో కృష్ణ, జయసుధ






‘‘నాకు నాటకానుభవం బొత్తిగా లేదండి అయినా మా బాస్ నేనొట్టి నాటకాల రాముడ్నని అందర్తో చెప్తూవుంటారు’’

## నవ తారాగణంతో ‘‘భాగీరధి’’

‘‘ఒక నర్తకి జీవితగాధ. ఆర్టిస్టులంతా కొత్తవాళ్ళే,’’ అన్నారు ఇంద్రకంటి. ఈయన మాటలు, స్క్రీన్‌ప్లే, పాటలు, దర్శకత్వంలో ఎం టి రఘురాం నిర్మించే అంబికా ఆర్ట్ క్రియేషన్స్‌వారి పై చిత్రం ద్వారా శివకుమార్, శ్రీచరణ్, రఘురాం, కాళ్ళకూరి, శ్రీకృష్ణ, వడయార్, కప్పలరాజు, సాయిమాధవి, దేవి పరిచయం గావింపబడతారు ఐ రత్నకుమార్ కథ, జి కె వెంకటేశ్ సంగీతం, ఆర్ నాగేశ్వరరావు ఛాయ, పండిత హేమాద్రి చిదంబర దీక్షితులు నృత్య దర్శకత్వం, అంకిరెడ్డి కూర్పు, శ్రీచరణ్ సహకార దర్శకత్వంతో కాళ్ళకూరి సమర్పిస్తారీ చిత్రాన్ని

## కౌసల్య పిక్చర్స్ చిత్రం

‘‘ఒక సర్పం, శునకం కూడా పాల్గొంటున్నాయి,’’ అన్నారు కె ఎస్ రెడ్డి. ఈయన దర్శకత్వంలో శ్రీమతి కౌసల్య నిర్మించే చిత్రం షూటింగ్ అక్టోబర్ 23న మొదలైంది శివకృష్ణ, నరసింహరాజు, కవిత, విజయలలిత, కాంతారావు, జీవా, వంకాయల, సాక్షి రంగారావు రాజ్‌వర్మ, ఝాన్సి, శ్రీలక్ష్మి, పండరీబాయి నటిస్తున్నారు పేరాల కథ, మాటలు రాశారు చక్రవర్తి సంగీతం, భాస్కరరాజు శిల్పం నాయని మహేశ్వరరావు కూర్పు, కృష్ణమోహన్ సహకార దర్శకత్వం, బి అంజిరెడ్డి నిర్వహణతో భీమవరపు బుచ్చిరెడ్డి సమర్పిస్తారీ చిత్రాన్ని



'రుద్రకాళి'లో జయమాల, చంద్రమోహన్

# సినిమా

## "సువర్ణ సుందరి"

"14 పాటలు, 12 నృత్యాలు గల సంగీత నృత్య ప్రధాన చిత్రం. అందం, ఆకర్షణ, నాట్యాగ్రతలుగల కొత్త నటి కుమారి జయశ్రీని చంద్రమోహన్ పక్కన నాయికగా పరిచయం చేస్తున్నాం," అన్నారు పి. భరద్వాజ. ఈయన సారథ్యంలో బీరం నవీనలక్ష్మి సమర్పించే కె. పి. ఆర్. పిక్చర్స్ "సువర్ణసుందరి" చిత్రం అక్టోబరు 20న సెట్స్‌కు వెళ్లింది. జగ్గయ్య, గొల్లపూడి మారుతీరావు, సరళ, అన్నపూర్ణ తక్కిన ముఖ్య భూమికలు పోషిస్తున్నారు. నిర్విరామంగా డిసెంబరు 31కి షూటింగ్‌ను ముగించాలని నిర్మాత అట్లు బ్రహ్మారెడ్డి ఆకాంక్ష. సత్యమూర్తి సంభాషణలు, వేటూరి గీతాలు, రమేష్‌నాయుడు సంగీతం, భాస్కరరావు ఛాయ, భాస్కరరాజు శిల్పం, నరసింహారావు కూర్పు, శేషు నృత్యాలు, రాజేంద్ర సింధే, సుధాకరరెడ్డి సహకార దర్శకత్వం నిర్వహిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించే బీరం మస్తాన్‌రావు "కళలు ఈశ్వర పాద జనితాలు... ప్రతి కళా సృష్టి వెనుక ఏదో ఒక ప్రేరణ ఉంటుంది. అదే అందరినీ నడిపిస్తూంటుంది... ఒక పదం కదలి నాట్యమైనా, ఒక కలం కదలి కావ్యమైనా, ఒక కుంచె కదలి కళాఖండమైనా, ఒక గళం రగిలి రాగమైనా — వీటన్నిటి వెనుకా ఓ అద్భుతమైన శక్తి ఉంటుంది. ఆ శక్తి నవ్వే కావచ్చు. పువ్వే కావచ్చు. మమత కావచ్చు. మనిషీ కావచ్చు... ఆ కళాదృష్టికి ప్రేరణ తనే అని ఆరాధించబడే వ్యక్తికి తెలియకపోతే, జరిగే ఫలితం ఏమిటి — అనే సున్నితమైన ఇతివృత్తం ఆధారంగా రూపొందుతూన్న చిత్రం," అని వివరించారు.

## "కొంటె కోడళ్ళు"లో వడ్డీల వరాలమ్మ

మండపేటలో వడ్డీల వరాలమ్మ (సూర్యకాంతం) పేరు తెలియనివారుండరు. వడ్డీ పేరుతో ఆస్తుల్ని స్వాహా చేయడమే ఆమె చేసే పుణ్యకార్యం. వరాలమ్మ కుచ్ఛితమైన బుద్ధికి తాళం వేసే వ్యక్తి శంకరయ్య (సుత్తి వీరభద్రరావు).

ఓ రోజు వరాలమ్మ ఇంట్లో కూర్చొనుండగా శంకరయ్య వచ్చాడు.

"శంకరయ్యా... అబ్బాయి వస్తున్నాడు. చదువు పూర్తయింది," అంది వరాలమ్మ.

"చదవడం పూర్తయింది గాని, చదువు పూర్తి కాదు కదమ్మా ?" అన్నాడు శంకరయ్య.

"అంటే ?"

'రాసిన పరీక్షల్లో పాస్ కావాలికదా అని."

"ఏమిటీ ! నా బిడ్డ ప్యాసుకాడంటావా?" అంటూ వరాలమ్మ చెయ్యి ఎత్తింది.

"అమ్మో... అవుతాడు. పాసవుతాడు. పొరబాటయిందమ్మా. ఫస్ట్‌క్లాస్‌లో పాసవుతాడు. నెంబర్ వన్..."

"ఆఁ... నెంబర్‌వన్. చూడూ. వాడికో మంచి సంబంధం చూడాలి... చూడూ— మా


అబ్బాయికి కాబోయే భార్య అయిదు లక్షల రూపాయల డబ్బు, రెండు లక్షల రూపాయల విలువైన బంగారం, వంద ఎకరాల మగాణి భూమి కట్నంగా తీసుకుని ఇక్కడికి రావాలి. తెలిసిందా ? ఇదిగో... ఆ పిల్లకు తోబుట్టువులు తల్లిదండ్రులు ఎవ్వరూ ఉండకూడదు.''

''చిత్తం. దిక్కుమాలినదాన్ని వెతికి పట్టుకొస్తాను.''

''ఆఁ!... నువ్వలా చేశావంటే, నీకు రెండు గ్రాముల బంగారం రెండువందల రూపాయల నగదు బహుమానంగా ఇస్తాను.''

''ఆహా ! ఆహా ! ధర్మదాతలు... ధర్మదాతలు!'' అంటూ శంకరయ్య నిలుచున్నపళంగా బయలుదేరాడు.

కొమ్మినేని స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఎస్. వి. ఎస్. ఫిలిమ్స్ ''కొంటె కోడళ్ళు'' చిత్రానికి ఎం. చంద్రకుమార్ నిర్మాత. నవంబర్ విడుదల.



'ఊహా సుందరి'లో నళిని, నరేష్

## "ఊహా సుందరి"లో ఊహ నిజమైతే ?

చల్లగాలి వీస్తోంది. వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. ప్రేయసీ ప్రియుల తొలి సమాగమం. ఎవరికి ఏం చెప్పాలో తోచడంలేదు. అయినా, ఎంతసేపు మౌనం ? చివరికి రేఖ (నళిని) మెల్లగా పెదవి విప్పింది : ''అయితే, ఇంతకాలం ఒకరికొకరు కనిపిస్తూనే కలలు కన్నామన్నమాట ?''

బాబు (నరేష్) ఒళ్ళు పులకరించింది. ''అవును కలలు కంటూనే ఒకరుకొకరు కనిపిస్తున్నామన్నమాట !''

''కనిపించే నేను కలలో ఉన్నట్టున్నానా— లేదా ?''

''కలలో కనిపించినదానికంటే నిజంగా మరీ బాగున్నావు.''

''నిజంగానా ? మరి... కల నిజమైనందుకు నాకు కానుకేమిస్తావ్ ?'' రేఖ క్రీగంట చూసింది.

బాబు తన చేతిలోని అరవిచ్చిన పువ్వువంక .



'రక్త సంబంధం'లో కృష్ణ, రాధ

## సినిమా

చూశాడు ''నీ నవ్వంత ముద్దొచ్చే ఈ పువ్వు''

''ఆ రోజు ముచ్చటపడి జడలో పెడితే వద్దన్నాను ఈ రోజు నువ్వు జడలో పెడితే ముచ్చటపడతాను,'' అంటూ రేఖ వయ్యారంగా తిరిగి

జడలో పువ్వు మెరిసింది బాబు మురిసి పోయాడు

ఎస్ పి వెంకన్నబాబు నిర్మించిన మహేశ్వరి ఆర్ట్సు మూవీస్ ''ఊహా సుందరి'' చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అనిల్ కుమార్

## విజయబాపినీడు దర్శకత్వంలో అల్లు అరవింద్ చిత్రం

''అక్టోబర్‌లో రెండు షెడ్యూల్సు, నవంబరులో చివరి షెడ్యూల్ ప్లాన్ చేశాం జనవరి రిలీజ్,'' అన్నారు అల్లు అరవింద్. ఈయన విజయబాపినీడు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంతో నిర్మించే గీతా ఆర్ట్స్ తాజా చిత్రంలో చిరంజీవి, రాధిక, నూతన్‌ప్రసాద్, గిరిబాబు, ఉదయకుమార్, గోకిన రామారావు, గీత, నిర్మల, కృష్ణవేణి, పుష్పలత, జయమాలిని, జ్యోతిలక్ష్మి, స్మిత పాత్రధారులు కాశీ విశ్వనాథ్ సంభాషణలు, లోక్‌సింగ్ ఛాయ, సూరపనేని కళాధర్ శిల్పం, గౌతంరాజు కూర్పుతో బాబూరావు నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు

## "చండీరాణి"లో పప్పారాయుడు

ఎస్ ఐ పప్పారాయుడి (గొల్లపూడి)ఇల్లు ఆయన లుంగీ కట్టుకుని భుజంమీద తువ్వాలు వేసుకొని కూనిరాగంతీస్తూ పెరట్లోకి వచ్చాడు అక్కడ నులకమంచం అడ్డంపెట్టి — నీళ్ళ బక్కెట్టు, పసుపుముద్ద, చెంబు, పీట ఏర్పాటు చేయబడి ఉండడంచూసి, ''చిట్టితల్లి, సింగార చిట్టితల్లీ!'' అని భార్యను ముద్దుగా పిలిచాడు గుండ్రాయికి కాళ్ళొచ్చినట్టు ఆయన భార్య (కల్పనారాయ్) గునగునావచ్చింది. ''బయట నీళ్ళెట్టావ్ మంచం అడ్డెట్టావ్ పొద్దుట్నుంచీ స్నానం చేయలేదేటే మున్సిపలిటీ డమ్మీలాగ?'' అన్నాడు పప్పారాయుడు.

''నాక్కాదు నీ మొహానికే!'' అంది చిట్టితల్లి

''యేటే దిష్టితీసిన ఉప్పులాగ చిటపట లాడిపోతున్నావ్? మరి నాకయితే వాసన వచ్చేది?''

''నబ్బా? పసుపుముద్దరుద్దుకో బంది పోట్లు ఊరుమీదపడి రెండు బతుకులు ఉసురు తీసి, సంతులమ్మను ఎత్తుకెళ్లిపోతే — యేటీ సెయ్యలేని మగోడివి నీ కంటే ఆడదేనయం''

''నోర్మూయ్! డిపార్టుమెంటల్ యవ్వారాలు ఆడవాళ్లతో — బాత్‌రూముల్లో, వంటగదుల్లో చర్చించడానికి రూళ్లొప్పుకోవు. అలనాడు ఖడ్గ తిక్కన పెళ్ళాం ఇలాగే పసుపు చూపించి, అవమానించింది ఇవాళ ఈ పసుపుముద్దమీద, నీ మీద ప్రమాణంచేసి చెప్తున్నాను నేనెళ్లే సరికి ఆ నా కొడుకులు గుర్రాలమీదున్నారు అళ్లెళ్లిపోయారు తప్పనిసరిగా నేను యెనక్కొచ్చేశాను ఈసారి నేను గుర్రంమీదుంటాను ఆ నా కొడుకుల్ని అరెస్టుచేసి కొట్లో పారేస్తాను. లేకపోతే నేను తాండ్ర పాపారాయుడి వారసుడు— పప్పారాయుడ్ని కాదు,'' అంటూండగా హెడ్ కానిస్టేబుల్ (కె. కె. శర్మ) తుమ్ముతూ వచ్చాడు పప్పారాయుడు తుళ్ళిపడి, ''ఎందుకురా వచ్చావ్?'' అన్నాడు

''సానా అర్జెంటు పని పడిపోనాదండి,'' అన్నాడు హెడ్

''పసుపుముద్ద చూశావా?'' గొణిగాడు పప్పారాయుడు.

''ఇంత ముద్ద చూశానండి''

''మర్చిపో నువ్వెళ్లిపో!''

సెల్యూట్‌చేసి వెళ్లిపోయాడు హెడ్

పి. చంద్రశేఖరరెడ్డి స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఎన్ వి సుబ్బరాజు కథ సమకూర్చి, సమర్పించే శ్రీ వాణీ ఆర్ట్సు ''చండీరాణి'' చిత్రానికి వి. శ్రీరంగనాథవర్మ నిర్మాత ★

# మీ చిగుళ్లను దృఢంగా వుంచుకోండి
# మీ పళ్లకు దీర్ఘ ఆయుస్సునివ్వండి





## కేవలం ఫోర్‌హెన్స్‌లో మాత్రమే చిగుళ్లను దృఢపర్చగల ఒక ప్రత్యేకమైన అస్ట్రింజంట్ కలదు

ఝల్లుమనిపించే అనుభూతి ఇది పనిచేస్తున్నట్టుగా తెలుపుతుంది.


ఆరోగ్యవంతమైన పళ్లకు కూడా గట్టి చిగుళ్ల ఆధారం అవసరం. చిగుళ్లు బలహీనమై మెత్తబడి పోయాయంటే మీ పళ్లకున్న గట్టి ఆధారం సడలిపోతుంది. అందుకే, చిగుళ్ల జీవధాతువును సంకోచపరిచి, బిగుతు చేయడానికి సహాయపడే ఒక ప్రత్యేకమైన అస్ట్రింజంట్‌తోటి సూత్రీకరించబడింది, ఫోర్ హెన్స్. ఫోర్ హెన్స్‌తో

మీ పళ్లను బ్రష్ చేసుకుంటున్నప్పుడు మీకు కలిగే ఆ ఝల్లుమనిపించే అనుభూతి ఆ అస్ట్రింజంట్ చర్య వల్ల కలిగిందే. అదే, మీ చిగుళ్లను గట్టిగా, బిగుతుగా చేస్తున్న చర్య. దీనితో మీ పళ్లు ఆరోగ్యంగా మరింత కాలం నిలుస్తాయి.


కనుక మీ పళ్లకొక గట్టి ఆధారం కల్పించండి—ప్రత్యేకమైన అస్ట్రింజంట్ గల ఫోర్ హెన్స్ టూత్‌పేస్ట్‌ను వాడండి.



మీ చిగుళ్లు బలహీనమైపోతే ఆరోగ్యవంతమైన పళ్లు కూడా వదులై పోతాయి.



ఫోర్ హెన్స్‌లోని ప్రత్యేకమైన అస్ట్రింజంట్ చిగుళ్ల జీవధాతువును బిగుతు చేస్తుంది.



దీనితో మీ చిగుళ్లకు మరింత బలం, మీ పళ్లకు మరింత ఆయుష్షు.




## ఫోర్‌హెన్స్‌ను విశ్వసించండి ఇది పళ్ల డాక్టరు సృష్టించిన టూత్‌పేస్టు

306F-224-TEL



శ్రీమతి జి. భవానీకృష్ణమూర్తి

సీరియల్

# అనురాగ తరంగాలు

అలవాటు ప్రకారంగా ఆస్పత్రి మూసేశాక గోదారి ఒడ్డుకి బయలుదేరాడు రఘు. రేణుక సమక్షంలో వాలిపోవాలని తెగ ఆరాటపడి పోతోంది అతని మనసు. నిన్నమొన్నటిదాకా ఎటువంటి ఆరాటమూ లేని తన మనసుకీనాడు ఇంత ఇది ఎందుకో చిత్రంగా నవ్వుకున్నాడు. తీరా అక్కడికెళ్ళాక రేణుకతోపాటు లీలని కూడా చూసి గతుక్కుమన్నాడు. అయినా బయట పడకుండా ఏమీ ఎరుగని వాడిలా "సాయం కన్యను కించపరచడానికన్నట్లు ఈ ఆరుబయట విహారాలేమిటి అప్సరసలూ" దగ్గరకొస్తూ అన్నాడు వేళాకోళంగా.

"వంకాయ కబుర్లు చెప్పకోయ్, చెల్లెల్లాంటి దానివి అంటూనే పాచికంపు కొట్టే దాకా నువ్వు విషయాన్ని దాచిపెట్టావుగానీ, రేణు నా కంతా చెప్పిందిలే" అంది లీల.

ఉలిక్కిపడబోయి సర్దుకుని "ఏమిటో అంత కంపుకొడుతున్న విషయం" అన్నాడు.

"నంగనాచి తుంగబుర్ర! చూడవే" అంటూ మోచేత్తో రేణుని పొడిచింది లీల.

మెడలో ఉన్న చైనుని మునిపంట కొరుకుతూ కొద్దిగా తలపైకి ఓరగా అతనివైపు చూసింది ముసిముసిగా నవ్వుతూన్న రేణుక.

"సారీ లీలా! ఎప్పటికప్పుడు చెబ్దామను కుంటూండగానే రోజులు గడిచిపోయాయి. అది కాక మా ఫ్రెండుకి అన్యాయం చెయ్యలేను అంటూ ఆవిడగారు ఒకటే గొణుగుతోంది రోజూను. ముందే అందరికీ టాంటాం చేసేస్తే తీరా ఈవిడగారు 'నో' అందంటే నా ప్రిస్టేజ్ అంతా, అదిగో! ఆ గోదార్లో కలుస్తుంది. భగ్నప్రేమికుల లిస్టులో నా పేరు కూడా జత అవుతుంది."

## (గత సంచిక తరువాయి)

"అదేం మాట రఘూ! అది 'నో' అంటే మాత్రం నేను అననిస్తానా? రేణుకి నేనంటే పిచ్చిప్రేమ, అభిమానం. మీ పెళ్ళివల్ల నాకేదో అన్యాయం జరుగుతుందనుకుంటోంది తప్ప నువ్వంటే ఇష్టం లేకకాదు. మీ ఇద్దరూ ... నాకు ఎంతో ఆత్మీయులైన మీరిద్దరూ సుఖంగా, సంతోషంగా ఉండడం కంటే నాకు కావలసిం దేమిటి?"

"మేమిద్దరం సుఖంగా సంతోషంగా ఉంటాం. నువ్వేమో ఎంతసేపు కథలు, నవలలు రాస్తూ ఆ కాగితాలతో కలాలతో కాపురం చెయ్యి" కోపంగా అంది రేణుక.

రేణుక గడ్డం పట్టి ఊపుతూ "నేను అలా అని శపథం చెయ్యలేదుకదే. మీ ఇద్దరూ ఒకరి నొకరు కావాలనుకున్నట్లే నాకు నచ్చిన వాడు, నన్ను మెచ్చేవాడు నాకు తటస్థపడిన్పుడు తలదించేస్తాను. తాళికట్టించేసుకుంటాను. నా కోసం మనసులు కలిసిన మీరిద్దరూ విడిపోతే నాకెంత బాధగా ఉంటుందో ఆలోచించవే" అంది.

"నువ్వు కావాలనుకున్నది రఘు ..."

"ష్, రేణూ! అతని మనసు తెలియక ఏవేవో ఊహించుకున్నాను. ఆ విషయం మరచిపో. నువ్వు అతన్ని కావాలనుకుంటున్నావు. అతనూ నిన్ను కోరుకుంటున్నాడు. ఇద్దరూ ఒకటై సుఖంగా ఉండండి. మీ ఇద్దరికీ స్నేహితురాలిగా నేను కోరుకునేది అదే! ఆప్యాయంగా రేణు చెయ్యి నొక్కింది.

రేణు కళ్ళల్లోని తడి చూసి "కీప్ క్వయిట్ మై ఫ్రెండ్ ఇప్పుడేమైందని? ఊ!" చెంపలు నిమిరింది.

రఘు ముఖంలో తారట్లాడుతున్న బాధా వీచికల్ని చూసి పక్కకి తిరిగి అతని భుజమ్మీద చెయ్యేసి, "మీరిద్దరూ ఎందుకిలా వర్రీ అవుతున్నారో నాకు అర్థం కావడంలేదు. ఇది మీరిద్దరూ ఎంతో సంతోషంగా ఉండాల్సిన టైము తెల్సా. ఇటువంటి సన్నివేశంలో నా నవలలోని హీరో, హీరోయిన్లు సంతోష తరంగాల్లో తేలిపోతూంటారు తెల్సా." అంది, వారి దృష్టిని మళ్ళించాలని. ఆమెకు తెలుసు నిజంగా వారిద్దరూ తన గురించి చాలా బాధ పడుతున్నారని.

"ఇది నవల కాదు, జీవితం."

"స్టుపిడ్! నవలలు, సినిమాలు అన్నీ మానవ జీవితాల్లోనుంచి పుట్టినవే. నన్ను కదిలించిన ఎన్నో సంఘటనల్ని, నిత్యజీవితంలో చూసేవాటిని ఎన్నిటినో కథలుగా చిత్రించాను. వాస్తవానికి దగ్గరగా ఉన్నాయని ప్రశంసిస్తూ ఎంతమందో లెటర్సు రాశారు."

"సరేగానీ, నీ నవల సీరియల్‌గా ఏ మంత్లీలో వస్తుందో రాయమని రాసింది నేను మరచేపోయాను" చాలాసేపటి తర్వాత గొంతు విప్పాడు రఘు.

"నీకు ఆస్పత్రి పేషెంట్లు తప్ప ఇటు వంటి విషయాలు గుర్తుండవని నాకు తెలుసుగా. నేను రాశానులే" అంది నవ్వుతూ లీల.

"నిజమే. నాకు ఆ కథలు, నవలలు అంటే పెద్దగా ఇంట్రెస్టు లేదు." ఒప్పుకున్నాడు రఘు.

"మెడికల్ జర్నల్స్ అయితే ఫారిన్ నుంచి కూడా తెప్పించుకుంటావు." మూతి ముడిచి నవ్వింది లీల.

"అవును, అవంటే ఇంట్రెస్టు కనుక. సరేగానీ, ఎల్లుండి ఆదివారంనాడు మనందరం మన మామిడితోటలోకి పిక్‌నిక్‌కి వెడదామా లీలా?"

"అందరం ఎందుకు? మీరిద్దరూ వెళ్ళి సరదాగా తిరిగిరండి" ఉత్సాహం చూపలేదు లీల.

"నువ్వు రాకపోతే నేనూ వెళ్ళను" ఎర్రజెండా చూపింది రేణు.

**జరిగిన కథ — 3:** వీరరాఘవులు, విశ్వనాథం ఇద్దరూ బాల్యస్నేహితులు. వీరరాఘవులు వ్యాపార నిమిత్తం విజయవాడలో స్థిరపడతాడు. విశ్వనాథం వూర్లోనే వ్యవసాయం చేసుకొంటుం టాడు. పెద్ద కామందు. వీరరాఘవులు పెద్దకొడుకు రఘు అమెరికా వెళ్ళి సర్జరీలో అనుభవాన్ని సంపాయించుకొని తిరిగివస్తాడు. విశ్వనాథం ఏకైక కుమార్తె లీలని అతనికిచ్చి చేయాలని ఇరువురూ నిర్ణయించుకొంటారు. లీల కూడా అతన్నే ప్రేమిస్తుంది. కానీ ఎవరూ ఊహించని విధంగా రఘు లీలని చెల్లెలిగా భావిస్తున్నానని చెప్తాడు. తన కిప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదని మంచి సంబంధం చూస్తానన్న రఘుతో చెప్తుంది లీల. రఘుకి తన చిన్ననాటి స్నేహితురాలు రేణుక తారసపడుతుంది. రఘు తన చాకచక్యంతో వెంకటేశాన్ని మంచి మనిషిగా తీర్చిదిద్దుతాడు. రఘు, రేణుక తన చిన్ననాటి తలపులు నెమరువేసుకొంటాడు.

''బాగుందే. రేప్పొద్దున్న హనీమూన్‌కి కూడా నేనొస్తేగాని వెళ్ళననేటట్లున్నావు. రఘు నన్ను తిట్టుకుంటాడు, నీ ఇష్టం.'' పెదవి విరిచి భుజాలెగరేసింది.

''అప్పటి సంగతి ఆలోచిద్దాము కానీ, ఎల్లుండి మాత్రం అందరం వెళ్ళాల్సిందే.'' తప్పదన్నట్లు అన్నాడు రఘు.

''ప్లీజ్ రఘూ, నన్నొదిలేయ్. పోటీకి పంపాల్సిన నవల అవలేదింకా. లాస్టుడేటు దగ్గర పడింది కూడాను.'' ఎలాగో అలాగ తప్పించుకోవాలని లీల ఉద్దేశ్యం.

''నథింగ్ డూయింగ్ నువ్వు రాకపోతే నేనూ వెళ్ళను'' మొండిగా అంది రేణు.

''అసలు ప్రోగ్రామే కాన్సిల్'' అన్నాడు రఘు.

''ఖర్మ. ఎంత చెప్పినా వినరు కదా! నాకోసం మీరు మానుకోవడం ఎందుకు? పదండి. పేపర్లు తెచ్చుకుని అక్కడే కూర్చుని రాసుకుంటాను.''

''ఏడ్చినట్లుంది. స్వర్గాని కెళ్ళినా సవతి పోరు తప్పదన్నట్లు ఎక్కడికెళ్ళినా రాత మాననంటావు'' విసుక్కుంది రేణుక.

''ఓకె! ఓకె! నిల్చున్నదాన్ని నిల్చున్నట్టు వచ్చేస్తా సరేనా.''

''గుడ్! ఇక పదండి''వెనుతిరిగాడు రఘు.

ఇద్దరూ చెరోవైపు నడుస్తూంటే గట్టు దిగివచ్చి స్కూటరు నడిపిస్తూ కబుర్లుచెప్తూ తోటతోపు దాటారు.

రేణుక తన ఇంటి దారికి మళ్ళగానే ''లీలా! స్కూటర్ ఎక్కు ఇంటికి పోదాం'' అన్నాడు స్టార్టుచేస్తూ.

ఎక్కి కూర్చుంది లీల.

ఇల్లుచేరుకుని ఇద్దరూ లోపలికి వెళ్లబోతూ లోపలి వాతావరణం గంభీరంగా ఉండడం గమనించి ఇద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు.

ప్రభావతమ్మ, విశ్వనాధంగారు ఆయన పక్క జయరాం. అంతవరకూ వారి మధ్య ఏదో సీరియస్‌గా చర్చ జరిగిందనడానికి గుర్తుగా ముగ్గురి ముఖాల్లోనూ అనీజినెస్ స్పష్టం అవుతోంది.

తమ్ముడి దగ్గరకు వెళ్లి ''జయా! ఎంతసేపు అయిందిరా వచ్చి?'' అన్నాడు పక్కనే కూర్చుని.

''ఏడున్నరకి వచ్చాను. ఇప్పుడు తొమ్మిది అయింది'' అన్నాడు వాచీ చూస్తూ.

తమ్ముడి మాటల్లోని గూడార్థం ఏమిటో బోధపడక తికమకపడ్డాడు రఘు.

''చిన్నప్పుడు ఆడిపాడిన ఊరునీ, నిన్ను చూద్దామని వచ్చానుగానీ, నీ లీలలు వినాల్సొస్తుందని కలలో కూడా అనుకోలేదు.''

''ఏమిట్రా ఆ డొంక తిరుగుడు. చెప్ప



దల్చుకున్నదేదో సూటిగా చెప్పు'' కోపంతో ఎఱ్ఱబడింది రఘు ముఖం.

లీలకూడా చిత్తరువులా నిలబడిపోయింది, అసలు విషయం ఏమిటో అర్థంకాక.

ప్రభావతమ్మ, విశ్వనాధంగార్లు నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుని ఉన్నారు.

''అన్నయ్యా! నీ కంటే చిన్నవాడిని, నీ ముందు నిలబడి ఇలా మాట్లాడవలసి వస్తుందని అనుకోలేదు. లీలని పెళ్ళిచేసుకోడానికి ఇష్టపడని వాడివి ఈ తిరుగుళ్ళకి అర్థం ఏమిటి ?'' మెల్లిగా అయినా స్పష్టంగా అడిగేసాడు జయరాం.

''తమ్ముడూ !''

''జయా !''

లీల, రఘులు ఇద్దరూ ఒకసారే గట్టిగా అరిచారు.

చేతులు ముందుకి చాపి ఆగమన్నట్లు ఊపి ''గట్టిగా అరవద్దు, మెల్లగా మాట్లాడండి. ఆంటీ, అంకుల్ ఈ విషయంలో చాలా బాధ పడుతున్నారు. మీ సంజాయిషీ ఏమిటి ?'' అడిగాడు.

లీల ఒక్కడుగు ముందుకి వేసి ''ఒకరికి సంజాయిషీ ఇవ్వవలసినంత తప్పు మేమేమీ చెయ్య లేదు. గోదారి గట్టుమీద, ఇసుక తిప్పల్లోను తిరుగుతూ కబుర్లు చెప్పుకోవడం నిన్న మొన్నటి అలవాటు కాదు. చిన్నతనం నుంచీ ఉన్నదే. మాతో నువ్వూ ఉండేవాడివి మరచిపోయావా?'' తీక్షణంగా చూసింది లీల.

''నో, నో ! మరచిపోలేదు. పోలేను కూడా. బట్, అది చిన్నతనం. ఎలా తిరిగినా, ఎవరితో ఆడినా పట్టించుకోదు ఈ సమాజం. ఇప్పుడు మీరూ వయసులో ఉన్న యువతీ యువకులు.. కొన్ని కట్టుబాట్లు, హద్దులు ఉంటాయి. వాటిని అతిక్రమిస్తే పర్యవసానం ... ఇదిగో ... ఇలాగే ఉంటుంది. నలుగురూ నాలుగు రకాలుగా చెప్పు కుంటారు. కలంతో దేశాన్ని ఉద్ధరిస్తున్న రచయిత్రివి. నీకు నేను చెప్పాల్సిన పనిలేదనుకో. జస్ట్, జ్ఞాపకం చేస్తున్నానంతే'' ఆగాడు జయ.

''నాన్నగారూ ! ఏమిటేదంతా ? మీరు అడగలేక అతనిచేత అడిగిస్తున్నారా ?'' తండ్రి భుజాలమీద చేతులు వేసి సూటిగా అడిగింది లీల.

''అబ్బే, అదేం కాదమ్మా. ఊర్లో నలుగురూ నాలుగు రకాలుగా ... ''

''ఎవరిని ఎన్ని రకాలుగా అయినా అనుకో నివ్వండి నాన్నా. మీరు మమ్మల్ని ఇలా నిలదీసి అడుగుతున్నారంటే మీకు కూడా మామీద నమ్మకం లేదన్నమాట. మా మనస్సులో చెడు భావం లేనప్పుడు మేము మీకు సంజాయిషీ ఇవ్వవలసిన అవసరంలేదు. ఎవరు నమ్మినా. నమ్మకపోయినా అది నిజం. ఇంతవరకూ మీకు తెలియని మరోనిజం రఘు, రేణు పెళ్ళిచేసుకో బోతున్నారు. ఇంతవరకూ అదికూడా మాతోనే ఉందని మీకు తెలియని మరో విషయం. మా స్నేహంమీద సదభిప్రాయం లేకపోతే రేణు ఈ పెళ్ళికి ఒప్పుకుని ఉండేది కాదని కాస్త ఆలోచిస్తే మీకు అర్థవౌతుంది.''

''అమ్మా !''

''అవునమ్మా. లోకానికి నోరేగానీ కళ్ళు లేవు. వెయ్యి ... పదివేలు ... కోటిగొంతులతో తనకు తోచినది అరవడమే దాని నైజం. మీరు కూడా ఆ లోకులలో ఒకరు అనిపించుకుంటు న్నారన్నమాట.''

''శభాష్ ! ఏమిటో అనుకున్నానుగానీ, ఇప్పుడు నిజంగా రచయిత్రివి అనిపించుకున్నావు'' గట్టిగా చప్పట్లు కొట్టాడు జయరావ్. గంభీరత సడలి వాతావరణంలో ప్రశాంతత నెలకొంది.

*                    *                    *

ఆస్పత్రి రోజూ ఆరుగంటలకే మూసేస్తున్నా ఆరోజు అందర్నీ చూడడం అయ్యేసరికి ఏడున్నర అయింది. నర్సు అన్నీ సర్దేసి వెళ్ళిపోయాక రఘు వెళ్ళబోతూంటే ''సార్ ! గోదావరి ఒడ్డుకి వెడుతున్నారా ?'' అడిగాడు వెంకటేశం.

''లేదు. ఇంత చీకట్లో వెళ్ళేదేమిటి ? అయినా ఎందుకు ?'' కనుబొమలు ముడిచి అను మానంగా చూశాడు రఘు. అతని ముఖం ఆదోలా చిన్నబోయి ఉండడం గమనించి ''ఏమిట్రా ? ఒంట్లో బాగాలేదా ?'' దగ్గరకు వెళ్ళి చెయ్యి పట్టుకుని చూశాడు.

''ఆదేం లేదు సార్, మీతో కొద్దిగా మాట్లాడే పనుంది. అభ్యంతరం లేకపోతే ...'' ఆగి రఘు ముఖంలోకి చూశాడు.


''ఏమిట్రా ఆ నసుగుడు. నేను డాక్టర్ని, నువ్వు కాంపౌండరువి అన్న విషయం మరచిపోయి నీ స్నేహితుని ముందు నీ మనసు విప్పి మాట్లాడు.'' కుర్చీలో కూర్చుని ''కమాన్, కేరీ ఆన్ మై ఫ్రెండ్'' అన్నాడు.


వెంకటేశం ఏమీ మాట్లాడక పోవడం చూసి ''చెప్పరా. దేని గురించి నువ్వు చెప్ప బోయేది? నీకున్న ఇబ్బంది ఏమిటి?'' మృదువుగా అడిగాడు.

''రఘూ ! నేను చెప్పబోయేది పూర్తిగా విని, ఆపైన అభిప్రాయం చెప్పు. నేను చెప్పే

## చిన్నపిల్లలకు ఘనమైన మర్యాదలు !

లుఫ్తాన్సా విమానాల్లో ప్రయాణం చేసే చిన్న పిల్లలకు ఆ విమాన సంస్థ వి.ఐ.పి. మర్యాదలు సమకూరుస్తున్నది. చిన్న పిల్లలతో ప్రయాణం చేసేవారికి సీట్లను ప్రత్యేకంగా కేటాయించారు. ఆడుకోటానికి వారికి అనేకరకాల బొమ్మలు, బొమ్మల పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. వారి అవసరాలను గమనించ టానికి ఏర్‌హోస్టెస్‌లకు ప్రత్యేక శిక్షణ యిస్తున్నారు. అయిదు సంవత్సరాలు నిండిన బాలబాలికలు ఒంటరిగా ప్రయాణం చేయవచ్చు. ఎక్కేచోట, దిగవలసినచోట, ప్రయాణంలోనూ ఏర్‌హోస్టెస్‌లు వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఆరు సంవత్సరాలు నిండి, పదిహేను సంవత్సరాల లోపువారికి మరో సౌకర్యంకూడా ఉంది లుఫ్తాన్సా విమానాల్లో నాలుగుసార్లు ప్రయాణంచేస్తే, లుఫ్తాన్సా జూనియర్ క్లబ్బులో వారు సభ్యులవుతారు. వీరంద రికి ఈ సంస్థ ఉచిత కానుకలను,లుఫ్తాన్సా సంస్థ గురించి ప్రత్యేక సమాచారం అంద చేసే పుస్తకాలను పంపుతారు.





బూస్ట్ అతను రోజంతా చురుగ్గా ఉండేలా చూడటానికి ఎంత చక్కటి మార్గం.
మీ అబ్బాయి తాగే గ్లాసు పాలల్లో రుచికరమైన శక్తి నిచ్చే బూస్ట్ ఒక చెంచాడు తీసి కలపండి. ప్రతి ఉదయం.
అంతే, రోజంతా కూడా అతను హైస్పీడ్ రైలులా చురుగ్గా తిరుగుతాడు
రోజూ ఉదయం స్కూలులో చదువుకోడం, ఆడుతూ, పాడుతూ, ఫుట్‌బాల్ ఆడుకోడం, ఆ తరువాత శ్రద్ధగా గంట సేపు హోమ్‌వర్క్ చేసుకోడం ఇవన్నీ కూడా చకచకా చేసుకుపోతాడు.
బూస్ట్ యిచ్చే శక్తి అటువంటిది — మీ అబ్బాయి రోజంతా ఆటపాటలతో ఆనందముగా గడపడంలో తోడ్పడుతుంది ఉదయం నుంచి రాత్రి వరకు.
బూస్ట్‌ని వెన్నగల పాలు, బంగారు రంగు గోధుమ, మాల్టెడ్ బార్లీ, రుచికరమైన కోకోలతో తయారుచేశారు. అది మీ బిడ్డ అవసరాలకుగాను శక్తినిచ్చే హైడ్రేట్లను, శరీర నిర్మాణానికి తోడ్పడే ప్రొటీన్లను సమకూరుస్తుంది.
Boost
MALT CHOCOLATE MILK DRINK
చురుకైన జీవనానికి శక్తినిచ్చే ఇంధనం

మాటలు చేదుగా ఉన్నా నిజానిజాలు ఆలోచించు, అంతా విన్నాక.''

''అసలు విషయం చెప్పరా'' అసహనంగా అన్నాడు రఘు. అతను చెప్పబోయే సీరియస్ విషయం ఏమిటోనన్న ఆత్రంగా ఉంది.

''రఘూ! మావయ్య మాకు దూరపు బంధువు అంటే మా అమ్మకి వరసకి అన్నయ్య అవుతారు. మేము మొత్తం ఎనిమిదిమంది సంతానం. తిండికే గడవని పరిస్థితి మాది. చుట్టం చూపుగా మా యింటికి వచ్చిన మామయ్య మా పరిస్థితి చూసి జాలిపడి నన్ను తనతో పంపించమని అమ్మ నడిగారు. నాకు చదువు చెప్పించి రేణుని ఇచ్చి పెళ్ళి చెయ్యాలని ఉందని, తాను పెద్దగా కట్న కానుకలు ఇవ్వలేరు కనుక తన పిల్లల్లో ఒక పిల్లాడుగా భావించి చదువు చెప్పిస్తానని అమ్మతో చెప్పారు. మా పరిస్థితి అంతకంటే హీనంగా ఉంది కనుక అమ్మ సరే అంది'' అన్నాడు వెంకటేశం.

వెంకటేశం ఉద్దేశ్యం చూచాయగా అర్థమైంది రఘుకి. నోట మాట రాక శిలా ప్రతిమలా కూర్చున్నాడు.

''రఘూ! ఎవరు తిన్నా తినకపోయినా నాకు మాత్రం కడుపునిండా తిండి పెట్టేది అత్తయ్య. నేనేం చేసినా పల్లెత్తు మాట అనకుండా అగ్గగ్గలాడుతూ చూశారు మామయ్య, కాబోయే అల్లుడినన్న ఉద్దేశ్యంతో. తెలివితక్కువ తనంతో చదువుని నిర్లక్ష్యం చేశాను. జులాయిగా తిరిగాను, తాగాను. తందనా లాడాను. అంతమాత్రంచే నేను రేణుని పెళ్ళాడే అర్హతను కోల్పోయినట్లేనా? రఘూ! నీవల్ల నేనెంతో మేలు పొందాను. ఎన్నిజన్మ లెత్తినా తీర్చుకోలేని ఋణం అది. కానీ...కానీ,

# అనురాగ తరంగాలు

నాకు వాగ్దత్త అయిన రేణుని ఒకరికి అర్పించ లేనురా.''

తన గుండెను బలవంతంగా పెరికి బయటకుతీసి వికటంగా నవ్వుతున్నట్లు ఫీలయ్యాడు రఘు. ఆ గది అంతా గిర్రున తిరుగుతున్నట్లు, తనేదో లోయలో ఇరుక్కు పోతున్నట్లు, ఊపిరి ఆడక గిలగిల్లాడుతున్నట్లు అనిపించిందో క్షణం.

''అయితే ఇప్పుడేం చేయమంటావురా?'' ఎలాగో గొంతు పెగుల్చుకుని అన్నాడు.

''రేణు ఇప్పటికే నీ వ్యామోహంలో పడి పోయింది. ఆమెను పూర్తిగా లోబరుచుకుని నాకు అన్యాయం చెయ్యకురా.''

''ఆల్‌రైట్ వెంకట్! రేణు నీదే. ఆమె జోలికి నేనెప్పుడూ రాను. గో ఎహెడ్ మై ఫ్రెండ్'' పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు. చేతుల మీద తలాన్చుకుని టేబుల్ మీద పడుకున్నాడు. ఏదో తెలియని ఎవరితోచెప్పుకోలేని బాధ. అలా ఎంతసేపు పడుకున్నాడో అతనికే తెలియదు.

''రఘూ, ఏమిటి నాయనా ఇది?'' తట్టి లేపారు విశ్వనాథంగారు. మెల్లగా తల పైకెత్తి చూశాడు. ముఖం అంతా ఉబ్బి, ఎర్రబడిన కళ్ళు, చెదిరిన జుట్టు చూసి గాభరాపడ్డారాయన.

''ఒంట్లో బాగాలేదా రఘూ'' తల మీద చెయ్యేసి నిమురుతూ అడిగారాయన.

''ఒంట్లో బాగానేఉంది అంకుల్, మనస్సే బాగాలేదు.''

''ఏమైంది నాయనా?'' కంగారుగా అడిగారు.

ఒక్క నిముషం తత్తరపడి తాను చేసిన

## నక్షత్రాలు

తలెత్తి
ఆకాశంలోకి చూస్తే
అక్కడ
కనుపించేవి
తళుకుమనే
తారలు కాదు
భగ భగ మండే
ధరలు !!

—''సింహం''

తప్పు తెలుసుకుని ''అహ, ఏంలేదు అంకుల్. ఇంత దూరం మీరెందుకొచ్చారు? కాస్సేపాగి నేనే వచ్చేవాడినికదా?'' అన్నాడు.


''అర్ధరాత్రి పన్నెండయింది. ఇంకా వస్తావని చూస్తూ ఊరుకోలేక నేనే వచ్చాను. ఇంటి దగ్గర మీ ఆంటీ, లీల ఒకటే గాభరా పడుతున్నారు, నువ్వెందుకు రాలేదోనని. పద'' లేవదీసి ఆయనే తాళాలు వేశారు. స్కూటరు మీద మెల్లగా ఇంటికి వచ్చారు. అతన్ని చూడగానే జరగరానిదేదో జరిగిందని ఇట్టే గ్రహించింది లీల. తూలిపోతూంటే పట్టుకుని తీసికెళ్ళి మంచంమీద పడుకోబెట్టింది. ఒళ్ళు పెనంలా కాలిపోతోంది.

మెడలోని టై తీసేసి, కాలి బూట్లు ఊడదీసి, చొక్కా బటన్సు విప్పేసింది. తల్లిని వేడిపాలు తెమ్మని, తను అరుగుమీది గదిలోకి వెళ్ళి క్రోసిన్ మాత్ర ఒకటి తెచ్చింది. అతన్ని బలవంతంగా లేవదీసి టాబ్‌లెట్ నోట్లోవేసి పాలు తాగించింది. ప్రభావతమ్మ తడిబట్టతెచ్చి నుదుటిమీద వేసి ''ఎవరి పాపిష్టి కళ్ళు పడ్డాయో? బొంగరంలా తిరిగే పిల్లాడు క్షణంలో అడ్డం పడ్డాడు'' అంది.

''కంగారేం లేదమ్మా. నువ్వు, నాన్నగారు వెళ్ళి పడుకోండి. నేనిక్కడే కూర్చుని చూస్తూంటాను'' అని ఇద్దర్నీ పంపేసింది.

అతని మంచం దగ్గరగా కుర్చీ జరుపుకుని పత్రిక తిరగేస్తూ మధ్య మధ్య అతని వైపు చూస్తూ కూర్చుంది. పేజీలు తిప్పుతోందన్న మాటేగానీ, అతనిలోని ఆ మార్పుకి కారణం ఏమిటా అని తీవ్రంగా ఆలోచిస్తోంది. అతన్ని అంతగా కృంగదీసిన విషయం ఏమిటో ఎంత ఆలోచించినా బోధపడలేదామెకి.

''రేణూ! ప్లీజ్, నిన్ను వదలి బ్రతకలేను. వాడికి వాగ్దత్తమై పోయావని ముందే నాకెందుకు చెప్పలేదు. రేణూ! నిన్ను నమ్మి మనసిస్తే



నాకింత అన్యాయం చేస్తావా ?'' రఘు కలవరిం తల్ని వినగానే లీల కనుబొమలు ముడిపడ్డాయి.

''రేణు ఒకరికి వాగ్దత్త అయిపోయిందా ? ఎవరు ఆ ఒకరు ?'' ఎంత ఆలోచించినా అర్థం కాలేదు లీలకి.

టెంపరేచరు నోట్ చేస్తూ, నుదుటిమీద ఉన్న తడిబట్టను మారుస్తూ అలాగే కూర్చుంది తెల్లవారేదాకా.

''రఘూ ! నేను నిన్ను మనసారా ప్రేమించాను, నీ జీవిత భాగస్వామిని కావాలని కోరుకున్నాను. కానీ... నీ మనసులోని నా స్థానం చెల్లెలుగా నువ్వు రేణుని ప్రేమించావు. రేణు నిన్ను ప్రేమించింది. కానీ, ఆమె మరొకరికి వాగ్దత్త. అయినా అలా జరుగనివ్వను రఘూ. నేను కోరుకున్నది నాకు దక్కకపోయినా నువ్వు కోరుకున్న వ్యక్తి నీకు భార్య కావాలి. నేను జరిపిస్తాను.

నువ్వు కోరుకున్న వ్యక్తితో నువ్వు సుఖంగా సంతోషంగా ఉండాలి రఘూ'' ఆమె కళ్ళనుంచి రాలిన నీటిబిందువులు ఆతని ముఖంమీదపడ్డాయి. ఆ స్పర్శకి మెల్లగా కళ్ళు తెరిచాడు రఘు.

తలవైపు దిక్కున కూర్చుని తల, చెంపలు నిమురుతోంది లీల.

''లీలా !''

గబగబా కళ్ళు తుడిచేసుకుని ''ఎలా ఉంది ?'' అడిగింది.

''పిచ్చిపిల్లా ! ఏడుస్తున్నావా ? కాస్త తలనొప్పికి ఇంత కంగారెందుకమ్మా ?''

''భలేవాడివే. కాస్త తలనొప్పా ? రాత్రి నిన్ను చూస్తే నాకెంత భయం వేసిందో తెల్సా? ఉండు బ్రష్షు, పేస్టు తెస్తాను. మొహం కడుక్కుంటే వేడివేడిగా కాఫీ తాగచ్చు.'' బ్రష్ మీద పేస్టు వేసి తెచ్చింది.

''నీళ్ళు తీసుకురాకు, నేనే పెరట్లోకి వెడతాను. దుప్పటి తొలగించి లేచాడు. తూలి పడబోతూంటే చటుక్కున పట్టుకుంది.

లీల భుజమ్మీదచెయ్యేసి ఆసరాగా పట్టుకుని పెరట్లోకి వెళ్ళాడు. బాత్‌రూమ్ దగ్గరకు తీసికెళ్ళి అతన్ని లోపలకు పంపి తలుపు మూసి ఇవతల నిలబడింది. అతను బయటికి వచ్చాక చెయ్యందుకుని నూతి దగ్గరున్న బట్టలుతుక్కునే రాయిమీద కూర్చోబెట్టి కాగులోని వేణ్ణీళ్ళకి కొంచెం చన్నీళ్ళు కలిపి తీసుకొచ్చి ఇచ్చింది. లోపలికొచ్చాక ప్రభావతమ్మ అతని ఒళ్లు తడిమి కళ్లనీరు పెట్టుకుంటే ''ఏమిటాంటీ, ఈ పిచ్చి ? కాస్త తలనొప్పికే ఇంత ఖంగారా ?'' బలవంతంగా నవ్వాడు.

''ఫారిన్ కూడా వెళ్లొచ్చిన డాక్టరువి కనుక నీకు ఇది చిన్న విషయంలాగే కనిపిస్తుంది. గోదారి ఒడ్డుకి వెళ్లి, వెంకటేశం ఇంటికి, నువ్వు తరచుగా వెళ్లేచోట్లు అన్నింటికీ వెళ్లాను. నువ్వు ఆస్పత్రిలో ఒక్కడివే ఒళ్లు తెలియని

# ఇ'వేమన'పద్యాలు




స్థితిలో ఉంటావని నాకేం తెలుసు ?'' అన్నారు విద్వనాథంగారు.

''అయ్యయ్యో ! నా మూలంగా మీ అందరికీ శ్రమ ?'' బాధపడ్డాడు రఘు.

''శ్రమాలేదు, వంకాయా లేదుగానీ ఈరోజు ఆస్పత్రికి వెళ్లడానికి వీల్లేదు. హాయిగా రెస్టు తీసుకో. తెలిసిందా ?''

''ఆలా అంటే ఎలా లీలా, పాపం పేషెంట్లు...''

''గో టు హెల్ ! నీ ఆరోగ్యం పాడైతే నిన్ను చూసేదెవరు ? మాట్లాడకుండా నేను చెప్పినట్లువిని, ముసుగుదన్ని పడుకో, మిగిలిన విషయాలన్నీ నేను చూసుకుంటాను. ఓకె.'' అతన్ని మధ్యలోనే ఆపేసింది.

''అవును బాబూ.'' కూతురి మాటల్ని బలపరిచారు. ప్రభావతమ్మ, విశ్వనాథంగారు. తప్పదన్నట్లు వెళ్లి మంచం మీద పడుకున్నాడు రఘు.

(ఇంకా వుంది)

# పాలాక్షుని డైరీ

## 53 ఏళ్లకే మునిమనుమడు !


బల్గేరియాకు చెందిన ఏంజిలినాక్వాన్‌లోవా అనే 30 ఏళ్ళ ఆమె కూతురుకు కొడుకు పుట్టినందువల్లామె తన 30వ ఏట అమ్మమ్మయ్యిందట. ఆమె తండ్రి 53 ఏళ్ళ ఇల్లాస్టోయనోవ్ మునిమనవణ్ణి ఆ వయస్సులోనే ఎత్తుకుని ప్రపంచ రికార్డు స్థాపించాడట. అంతకు క్రితమొహాయన తన 57వ ఏట మునిమనుమణ్ణి ఎత్తుకుని ప్రపంచ రికార్డు స్థాపించాడట — వేరే పన్లేదా !

## చైనాలో మనిషికి 3 ఎలుకలు

చైనా దేశపు జనాభా వెయ్యి మిలియనులైతే ఆదేశంలోని లెక్కల ప్రకారం అక్కడ మూడువేల మిలియనుల ఎలుకలున్నాయట (మనిషికి). తలకు మూడు ఎలుకలుగా విజృంభించిన యీ జాతినెలా నాశనం చేయాలా అని ఆ ప్రభుత్వం తీవ్రంగా ఆలోచించి, పిల్లులను, గుడ్లగూబలను, విషంలేని పాములనూ ప్రతి యింటా పెంచాలని తీర్మానించారట.

## దేశంలో పదిశాతం చెవిటివారు !

భారతదేశంలోని జనాభాలో ఎంత లేదన్నా కనీసం పది శాతమైనా గ్రామవాసులు అంతో, ఇంతో చెవిటితనంతో బాధపడుతున్నారట. నగరవాసులు ఏడు శాతముంటారట. గ్రామాల్లోని చెవిటితనంలో స్త్రీ పురుష శాతం సమానంగానే వుంటుందని, నగరాలలో మాత్రం స్త్రీలకన్నా పురుషులలోనే ఎక్కువమంది చెవి వినిపించనివారున్నారనీ ఇండియన్ కౌన్సిలాఫ్ మెడికల్ రిసర్చివారన్నారట. అయ్యో, నేజెప్పేది వినిపిస్తోందా !




## అర్జంటుకి ఆరుగురి బలి !


సేలం జిల్లా ఆడయాం పట్టికి చెందిన లక్షాధికారి పళ్ళికూటత్తాన్ అనే ఆయన కొడుకు 22 ఏళ్ళ సుబ్రమణి వురేసుకు చచ్చిపోయాడట. ఈతనికి వివాహమై ఒక నెలే అయ్యిందట. కొడుకు ఆత్మహత్య విషయం పోలీసులకు చెప్తే వారు శవాన్ని వేయిముక్కలుగా పరీక్షార్థం కోసి పారేస్తారనీ, ఆనక కోర్టులూ, సాక్ష్యాలూ అని వేపించుకు తింటారనీ తలచి ఆయన తన బంధుమిత్రులతో కలసి శవదహనానికి ఏర్పాట్లు చేసి, శవాన్ని శ్మశానానికి తీసుకుపోయి, చితిమీదకిపెట్టి నిప్పంటించేశాడట. శవం అర్జంటుగా కాలిపోవాలని వో రెండు డబ్బాల పెట్రోలు తెచ్చి దానిమీద పోశారట. మంటమీద పడ్డ పెట్రోలు బుస్సున లేచి డబ్బా వరకూ వ్యాపించి ఆ పని చేస్తున్న ఆరుగుర్ని నిలువునా కాల్చి మసిచేసి చప్పున చల్లారిందట. మిగిలిన పళ్ళికూటత్తాన్‌ను పోలీసులు అరెస్టు చేశారట.

## ఎం.జి.ఆర్.కి డాక్టరేట్ !

తమిళనాడు ముఖ్యమంత్రి యం.జి.ఆర్.కు మద్రాసు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ పట్టం బహూకరించింది. ఈ విషయంలో ఆయన మాట్లాడుతూ ''నాకు ఈ బిరుదులూ, పట్టాలూ గిట్టవు. లండన్ విశ్వవిద్యాలయము, అమెరికాలోని విశ్వవిద్యాలయమూ కొన్నేళ్ళక్రితం నాకు డాక్టర్ పట్టం యిస్తామని ప్రకటించాయి. నేను 'వొద్దు వొద్ద'న్నాను. ఆనక చిదంబరంలోని అణ్ణామలై విశ్వవిద్యాలయంవారూ సరదా పడ్డారు. దానికి నేను వొప్పకోలేదు. ఇపుడు మద్రాసు విశ్వవిద్యాలయంవారు తమ కోరిక చెప్పినపుడు ముందు వద్దన్నాను. కానీ వారు ముఖ్యమంత్రిగా నేను తమిళనాడుకు చేసిన, చేస్తున్న సేవకు గౌరవంగా యివ్వదల్చుకున్నట్టు చెప్పారు. స్కూలు పిల్లల మధ్యాహ్న భోజన పథకానికి, ఇంటికొకరికి వుద్యోగ పథకానికి, గ్రామ గ్రామానికి నీటి సరఫరా పథకానికి, వగైరా పథకాలను పెట్టి దేశ పురోభివృద్ధికి నేను చేస్తున్న పనుల కొరకు నాకీ గౌరవం యిస్తామంటే కాదనలేపోయా'' నన్నారట !

## పార్కిన్‌సన్ ప్రేమాయణం !

ఇంగ్లండు దేశపు మంత్రులలో ఒకరైన మిస్టర్ పార్కిన్సన్ తన డిపార్టుమెంటులో పని చేస్తూ, తనకు సెక్రటరీగా వున్న 36 ఏళ్ల కె. ఎస్. సారా అనే అమ్మాయిని ప్రేమించి, రహస్య కామకలాపాలు పెట్టుకుని, ఆ విషయాలను గుట్టుగా వుంచారట. వున్నాళ్లుండి గుప్పున యీ గుట్టు బయటికి పొక్కాక అంతా చేరి యీయన రిజైన్ చేయాలని పట్టుబట్టారట. ప్రజా కోరికే కర్తవ్యమని, మార్గాంతరంలేక ఆ పార్కిన్సన్‌గారు తన పదవికి రాజీనామా యిచ్చేశారట. స్త్రీ గాలికి మన దేశ పురాణ పురుషుడు విశ్వామిత్రుడే తట్టుకోలేకపోయెను కదా !




## తనాకాకి జైలుశిక్ష !

జపాను ప్రధానిగా చేసిన కకుఎల్ తనకా తన పదవీకాలంలో చాలా విధవిధాలుగా లంచాలు పట్టారనీ, యీ లంచాల ద్వారా ఆయన సంపాదించిన ధనం ఇరవై లక్షల డాలర్లనీ న్యాయస్థానం నిర్ణయించి, ఆయనకు నాలుగేండ్లు కారాగారవాస శిక్ష, ఇరవై లక్షల డాలర్లు (అయిదు వందల మిలియనుల యన్స్) అపరాధమూ విధించారట. అమెరికాలోని వో సంస్థ లాక్‌హీడ్ కార్పొరేషనువారు తయారు చేసిన విమానాలు జపానుచేత కొనిపించి, తత్ఫలితంగా యీయన యీ మొత్తాన్ని పొందారట. ఈయనకు 65 ఏళ్ళట — అయితే ఏం... మూడు ఆశలకూ, మనిషి స్థితిగతులకూ ఏ సంబంధమూ లేదు. ★

# ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి!

డా॥ పోలుకాచి వెంకటేశ్వర్లు

"కార్మికుల సమైక్యత – వర్ధిల్లాలి."

"కర్షకుల న్యాయమైన కోర్కెలను తీర్చాలి."

"ప్రజాస్వామ్యం – పునరుద్ధరించాలి."

"ప్రతి పౌరుడికి పని చేసే హక్కు కల్పించాలి."

"ప్రతి పౌరుడికి పని చూపించే బాధ్యత – ప్రభుత్వం వహించాలి,"

"ప్రజాస్వామ్యం – పునరుద్ధరించాలి."

మంత్రిగారి కాంపౌండు గేటు బయట నుంచి వస్తున్న గావుకేకలు అవి. మాడ్రేపేగుల్లోంచి వెలువడిన పొగలు అవి. ఉద్రిక్తతతో రేగిన సెగలు అవి.

అన్నీ వినబడుతున్నా వినబడనట్లే మౌనంగా వున్నారు అమాత్యులవారు. అయినా అవటానికి బావమరిదే అయినా పర్సనల్ సెక్రటరీ హోదాలో పోలీసులకు ఫోను చేసాడు.

పోలీసులు హుటాహుటిన వచ్చేసారు. గాలిలో లాఠీలు ఝళిపించారు. దాన్ని ఆటకిందే జమకట్టారు – చదువు రాకపోయినా పొట్ట నింపుకోవాలనే ఆశతో అక్కడ మూగిన జనం.

ఇంతలో భాష్పవాయు గోళాలు ప్రయోగింపబడ్డాయి. ఆ వాసన లోపలిదాకా వెళ్లిందో ఏమో దాన్ని మరిపించటానికి ఫారిన్ టానిక్ బాటిల్ ఓపెన్ చేసారు. పి. యస్. సుతారంగా గ్లాసులోకి వొంపుతుంటే సోడా, ఐస్ కలిపి రెండు రౌండ్లు పూర్తిచేసేసరికి బైట గాలిలో రెండు రౌండ్లు తుపాకీ గుళ్ళు పేలిన శబ్దం వినిపించింది.

ఇప్పటికి స్థిమితపడినట్లున్నారు. ధైర్యం గూడు చేసుకున్నట్లయింది కాబోలు – బాధ్యత గుర్తు వచ్చినట్లు మంత్రిగారు పి. యస్. ని. అదో విధమైన తిట్లు తిడుతూ బయటకు వచ్చారు. వస్తూనే పోలీసులమీద విరుచుకు పడ్డారు. "ఏమిటీ అమానుషం? ఎందుకు జరిగింది బాష్పవాయువు ప్రయోగం? ఎవరి పర్మిషన్‌తో తుపాకీ తూటాలు వెలువడ్డాయి?"

"వాళ్ళు నా జనం– నా ప్రజలు– నన్ను గెలిపించిన మనుషులు– నాకోసం– నాతో వాళ్ళ



కష్టాలు చెప్పుకోవటానికి వస్తే యిలాగా మీరు ప్రవర్తించేది ? ఇలాగేనా అంటా ! ఇదేనా మీ క్రమశిక్షణ ?'' అంటూ రౌద్ర మూర్తిలా వూగిపోతున్న అమాత్యులవారిని చూచి తలలు వంచుకుని నిలబడ్డారు పోలీసు బలగం అంతా.

తీవిగా ప్రజలవైపుకు ఓ అడుగు ముందుకు వేసారు. రెండో అడుగు వేయబోయి ఆగి పోయారు— బహుశా వారిని లేదా వారికి అంత దూరంలోనే వుంచాలనే వుద్దేశ్యం అయి వుంటుంది మంత్రిగారిది.

''సోదరులారా— నా ప్రజలారా— జరిగిన అన్యాయానికి చింతిస్తున్నాను. మీ కష్టాలు వినేందుకు నేనెప్పుడూ సిద్ధమే. అయితే ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సంప్రదింపుల ద్వారా పరిష్కారం ఆలోచించాలి. అంతేగాని యిలా మూకుమ్మడిగా దాడిచేస్తే యిలాంటి విషమ పరిస్థితులే ఎదురౌతాయి. అందుకని మీలో ఒకరో, యిద్దరో యిక్కడగాని లేదా లోపలకు వచ్చిగాని మాట్లాడవచ్చు. సమస్యలు అర్థం చేసుకుందాం. పరిష్కారం ఆలోచిద్దాం...''

''జిందాబాద్—మంత్రిగారికి—జిందాబాద్—జిందాబాద్''

''పొగడ్తలు వద్దు— ఆవేశంలో— మీ సమస్యలు...'' అంటుండగానే వారిలోనుంచి ఓ యువకుడు ముందుకు వచ్చి ''అయ్యా—సమస్యలు పాతవే— మీకూ తెలిసినవే— పట్టా చేత పుచ్చుకున్నా పొట్ట నింపుకోలేక పోతున్నాం. కొన్ని ఏళ్ళ క్రితం ఎంప్లాయిమెంటు ఎక్చేంజిలో పేరు నమోదు చేయించుకున్నా— పరపతి లేనివారి పేరు బయటకు రావటం లేదు — నిరుద్యోగం మహమ్మారిలా తయారయింది. తమరు ఎలక్షన్ల ముందు ఎన్నో వాగ్దానాలు చేసారు. నిరుద్యోగ భృతి కల్పిస్తామన్నారు. తర్వాత ఏకంగా ఉద్యోగాలే ఇస్తామని— వయస్సు మళ్ళుతున్నవారిని (మేధావులు — ఆరోగ్యవంతులు అయినాసరే) యిళ్లకు పంపారు. అయినా మాకంటూ యింతవరకు వొరిగిందేమీ లేదు. జరిగే మేలు కనబడటం లేదు — ఎంత కాలం యిలా మాడాలి — యింకెంత కాలం ఇలా అలమటించాలి. చన్నీళ్ళకు వేడినీళ్ళు తోడౌతాయని అన్నట్లు — మా నాయన జీతానికి నా ఆర్జన జతపర్చుకుందామనుకుంటే — అసలు నీరే లేకుండా పోయింది — మా నాయన రెటైర్ అవ్వాల్సిరావటం — నాకా ఉద్యోగం లేకపోవటం— యిలాగే ఎన్నో సంసారాలు ఎలా గడవాలి ? ఎంత కాలం గడపాలి ... ?''

చిరునగు మోముతో మంత్రివర్యులు అందుకున్నారు ''సోదరులందరికీ నా అభినందనలు. మీ కష్టాలు నా కష్టాలుగా భావించేవాళ్ళలో నేనొకడినని మీకు తెలుసు— అందుకే మీరు నా దగ్గరకు వచ్చారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు'' అంటూ చేతులు జోడించారు. ''ప్రభుత్వంలో వున్నంత మాత్రాన — ప్రజా ప్రతినిధులమైనంత మాత్రాన అన్నీ సాల్వ్ చెయ్యలేం. అందుకే కొంతవరకు యిటు ప్రజలు పూనుకోవాలి — అటు సెంట్రల్ అసిస్టెన్స్ వుండాలి — సమానత్వం — నవసమాజం కల్పించాలంటే — యిందుకు మీరు తోడ్పడాలి. అందరికీ ప్రభుత్వం ఉద్యోగాలు చూపించే స్థితిలోలేదు — యిందుకు ఆర్థిక స్తంభన అని సిగ్గుపడాలో—విద్యావేత్తలు పెరిగిపోతున్నారని గర్వపడాలో తోచని స్థితి. ఏమైనా యిది సాల్వ్ చేయాలంటే మీ కృషి అవసరమే ! ఎవరికివారు స్వయం ఉపాధికల్పనా పథకాలు ఎంపిక చేసుకోవాలి — అంతవరకు ఎందుకు నా ఫ్యామిలీనే తీసుకోండి—నా బావమరది పి.యస్. పోస్టు సంపాదించుకున్నాడు — నా రెండో కొడుకు ఫారంలో మేనేజర్‌గా ఉద్యోగం సంపాదించుకున్నాడు—నా ఒక్కగానొక్క కూతురు ఉమెన్స్ కాలేజీలో లెక్చరర్‌గా ఎపాయింటు అయింది— ఈ కోణంనుంచి ఆలోచిస్తే నా కుటుంబసభ్యులు వారివారి ప్రయత్నాలలో నిరుద్యోగ సమస్య పరిష్కరించుకున్నారు. ఇందులో నా ప్రమేయం గాని ప్రయత్నంగాని ఏమీ లేదని మనవి చేస్తున్నాను. అలాగే మీరు ఏదో ఓ పథకం లేదా ఉద్యోగం సంపాదించాలి. అంతేగాని అంతా ప్రభుత్వమే చెయ్యాలంటే యిది ఎలా సాధ్యం? ఎలా సాధ్యపడుతుందీ అని అడుగుతున్నాను. అయినా యింతమందికి వున్నపళంగా వుద్యోగాలు కావాలంటే సాధ్యపడేదేనా ? అని మనవి చేస్తున్నాను.''

ఇంతలో అక్కడకు హడావిడిగా వచ్చిన కొందరు వందిమాగధులు ''మంత్రిగారికి జై— ప్రజాబంధుగారు జిందాబాద్'' అనే వారి అరుపులు లాఠీ మోతలతో శృతిగలిపాయి.

క్షణంలో అంతా సద్దుమణిగింది.

ప్రశాంత పరిస్థితి ఏర్పడింది.

శాంతంగా ''ప్రశాంతి'' నిలయంలోనికి నడిచారు మంత్రిగారు.

అయితే లాఠీల తాకిడికి చెల్లాచెదరైన జన సమూహం ఎక్కడికి చేరినట్లు ?

యిళ్లకే చేరారో ?


పోలీసు స్టేషన్‌కి వెళ్ళారో ?

హాస్పిటల్‌కే తరలింపబడ్డారో !

అది అప్రస్తుతం— అనవసరం

కావలసిందల్లా

ప్రజాస్వామ్యం ? వర్ధిల్లాలి ! ★



సీరియల్

# జీవన మురళి

## కొండముది శ్రీరామచంద్రమూర్తి



(గత సంచిక తరువాయి)

పత్రికా విలేఖరి 'జీవన్‌గా' జీవన అతి స్వల్ప కాలంలోనే జంట నగరాలలో అమితమైన ప్రాచుర్యం సంపాదించుకుంది. ఎవరికీ తను కనిపించకుండా దూరంగా వుంటూ, అందరినీ తను గమనిస్తూ, సభల్లో, సమావేశాల్లో, గెట్ టు గెదర్స్ దగ్గర, ప్రారంభోత్సవాల సమీపంలో తప్పక వుంటూ ఎంచదగిన వార్తల్ని సేకరిస్తూ విన్నవాటిని సమీక్షించుకుని క్రోడీకరించుకుంటూ, నమ్మదగిన వాటిని మాత్రమే సంపాదకునికి అందజేస్తూ, "సురాజ్యం" పత్రికకు జీవనాడిగా మారిపోయి, సంక్షేమ రాజ్యమని గొప్పలు చెప్పుకుంటున్న దేశంలో సంక్షోభ స్థితులు నెలకొని వున్నవన్న వాదాన్ని బలపరుస్తూ సంచరింప సాగింది.

విలియమ్స్, కాలు కదిపితే చాలు, అతని వెనుక నీడగా ఆమె కదిలేది. అతను ఏ వ్యక్తిని కలుసుకొన్నదీ వ్రాసి, ఏం మాట్లాడుకొని వుంటారో వూహించి వ్రాసేది. అనేక సందర్భాల్లో ఆ ఊహ నిజమయ్యేది. విలియమ్స్ పంపున నంబియార్ చేత, అత్యవసర సరుకుల్ని తక్కువకు అమ్మించే నాటకంలో -- సరిగ్గా విలియమ్స్ మనుష్యులు వచ్చి నంబియార్‌ను హడలగొట్టే ప్రహసనం ఆడే సమయంలో — ఛేంబర్స్ తాలూకు చిన్నా పెద్దా పెద్దల్ని అనేకమందిని అక్కడ చేర్చింది. వాళ్లందరూ ఆ రౌడీలకు అడ్డుగా నిలబడ్డారు. "ఈ సరుకుల్ని బ్లాక్‌మార్కెట్‌లో వుంచమని మేం చెప్పం. అట్లా చేయడం నేరమని మాకు తెలుసు. అయితే ఇప్పుడు మీరు అర్థాంతరంగా వచ్చి, ఈ సరుకుల్ని వెలికితీసి వాటిని మార్కెట్టు ధరల కన్నా తక్కువకు అమ్మించడంలో అర్థం ఏమిటని మాత్రమే అడుగుతున్నాం. ఇంత సరుకును, వర్తకుడు కొలుగోలు చేసిన దానికన్నా తక్కువకు అమ్మమని అడగడం ఏం సమంజసమని డిమాండు చేస్తున్నాం!" అంటూ కేకలు వేశారు.

"నంబియార్‌ను సరుకును స్టాకు చేసినందుకు అరెస్టు చేయండి. అమ్మడం మాత్రం మార్కెట్టు ధరలకే అమ్మించండి!"

మార్కెట్టు ధరలకే సరుకు దొరికితే అదెవరికి కావాలి? పైగా జంట నగరాల్లో సరుకులు దొరక్కపోవడం అనే సమస్య ఎప్పుడూ లేదు. తక్కువ ధరలకు దొరికితే మరికొంచెం ఎక్కువ కొనుక్కుందామని వచ్చిన మధ్యతరగతి వర్గంవారు, బడుగువర్గాల వారు మార్కెట్టులో దొరికేవాటిని ఇప్పుడే, ముందుగానే ఎందుకు డబ్బు పెట్టుబడి పెట్టడం అనుకుని, ఎగబడి కొనుక్కోవడం మానేసి, పెదవి విరిచి వెళ్ళిపోయారు.

నంబియార్ అరెస్టయ్యాడు. సరుకు విడుదల కాలేదు.

జాగీర్దార్ ఇంటిదగ్గర పగలూ రాత్రీ కాపు వేసింది. జాగీర్దార్, గజానన్ జాగీర్దార్ ఎవరో ఏమిటో కనుక్కోడం ఆమెకు పెద్ద కష్టం కాలేదు. టెలిఫోను డైరెక్టరీలో వెతికి ఆ పేరు గల వాళ్ళ అడ్రసులన్నీ సేకరించింది. వాళ్ళ ఇళ్ళ దగ్గరకు వెళ్ళి ఆ మనుష్యుల చహరాలను పరిశీలించింది. తనకు కావలసిన మనిషిని అతి సునాయాసంగా ఆనవాలు పట్టేసింది. అతని ఇంటి ముందే కాపలాకాసింది. తక్కుతూ తారుతూ విలియమ్స్ తాలూకు మనిషి రాగానే, జీవన సేవాదళం వలంటీర్లను అతనిమీదికి ఉసిగొలిపింది. వాళ్ళు వేటకుక్కల్లా విలియమ్స్ మనిషిమీద పడ్డారు. అతనొక్కడు. వలంటీర్లు నలుగురు. వాళ్ళు గొడవలోకి దిగుతూవుండగానే, జీవన పబ్లిక్ టెలిఫోను బూత్‌నుండి పోలీసులకు ఫోను చేసింది. దూరంగా పోలీసుల జీపు, వాళ్ళ విజిల్స్ కనబడగానే, వినబడగానే, విలియమ్స్ తాలూకు మనిషి పారిపోయాడు — టిక్కెట్లున్న సంచీని పోతూపోతూ అక్కడే ఆ కంగారులో పారేసుకున్నాడు. పోలీసులకు ఆ డూప్లికేట్ లాటరీ టిక్కెట్లను జీవన అందజేస్తూ అన్నది.

"ఈ టిక్కెట్లను ముద్రించినవాడు విలియమ్స్. కొనదల్చినవాడు గజానన జాగీర్దార్! దమ్ములుంటే వాళ్ళిద్దర్నీ అరెస్టు చేయండి."

"మీరెవరు?"

"సురాజ్యం" ప్రత్యేక విలేఖరి జీవన్‌ను! వివరాలు కావాలంటే మా ఎడిటరుగారు 'శాఖా' గార్ని కలుసుకోండి!"

వాళ్ళు విలియమ్స్‌నూ అరెస్టు చెయ్యలేదు. జాగీర్దారునూ అరెస్టు చెయ్యలేదు. శాఖాగారిని కలుసుకొన్నప్పుడు మాత్రం "ఆ పారిపోయిన వాడు దొరికితే, వాడిద్వారా సమాచారం రాబట్టి సత్వర చర్య తీసుకుంటాం!" అన్నారు.

పారిపోయినవాడు దొరకలేదు. వాళ్ళు సత్వరచర్యనూ తీసుకోలేదు. విషయాలన్నీ పూస గుచ్చినట్టు 'సురాజ్యం' పత్రికలో మాత్రం పతాక శీర్షికల్లో ప్రకటింపబడుతూనే వున్నాయి. పత్రిక చదివినకొద్దీ విలియమ్స్‌కు మతిపోతు

**జరిగిన కథ — 17:** ఉద్యోగం కోసం భార్యతో పట్నం వెళుతుంటాడు మురళీకృష్ణ. మధ్యలో మంచినీళ్ల కోసం దిగిన మురళీకృష్ణను వదిలేసి జీవనను తీసుకుపోతుంది గూడ్సుబండి. మురళీకృష్ణ వస్తున్న బస్సులో జరిగిన గొడవలో అతనికి బలమైన దెబ్బ తగుల్తుంది. అతన్ని రాధ హైద్రాబాద్‌లో తనింటికి తీసుకెళ్తుంది. హైద్రాబాద్‌లో దిగిన జీవన కొజ్జాల వలలో పడి చివరికి విలియమ్స్ అనే ఒక పెద్ద ముఠానాయకుడి చేతుల్లో చిక్కుకొంటుంది. తెలివిగా అతని నుండి తప్పించుకొని సురాజ్యం పత్రికాసంపాదకుడు 'శాఖా' ఆశ్రయం చేరుకొంటుంది జీవన. జీవన కోసం రైల్వే స్టేషన్‌లో గాలించిన మురళికి నిరాశే ఎదురౌతుంది. జీవన సురాజ్యం పత్రికకు ప్రత్యేక ప్రతినిధిగా వుంటూ విలియమ్స్ వివరాలను తెలుసుకొని ఎప్పటికప్పుడు తెలియజేయటానికి నిశ్చయించుకుంటుంది. మురళి రాధతో కలిసి పబ్లిక్ పెర్‌ఫార్మెన్స్ ఇవ్వటానికి ప్రయత్నాలు చేస్తుంటాడు.

న్నది. యం. యల్. ఏ. స్వతంత్రరావూ, ఆయన మనుష్యులూ హోమ్ మినిష్టరుకు వ్యతిరేకంగా సి. ఎమ్. దగ్గరకు డెప్యుటేషను వెళ్లనున్నారన్న రేపటి వార్తను ఇవ్వాళే వేయడంతో, హోమ్ మినిష్టరు ఆ విషయమై జాగ్రత్త పడ్డాడు. ఐ. జీ. పేరుకూడా ఆ వార్తలో రావడంతో, చిన్న దాసునూ, పెద్దదాసునూ ఆయన విడుదల చేయడం మానుకున్నాడు. జడ్జీగారు బెయిల్ ఇవ్వడం నిరాకరించారు. విలియమ్స్ కుడిచెయ్యి, ఎడంచెయ్యి కటకటాల వెనుకే వుండవలసివచ్చింది.

జీసస్ ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్ ట్రేడ్ లింక్స్ తమ లైసెన్సుల్ని ఎవరికి తిరిగిఅమ్మేశారో, ప్రభుత్వాన్ని ఎట్లా బోల్తా కొట్టించారో జీవన వెల్లడిచేసింది. ది క్రిష్టియన్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ విదేశాలనుండి ఎంతెంత పెద్ద మొత్తాల్ని విరాళాలుగా సేకరిస్తున్నదీ, బీద క్రైస్తవులకు గృహనిర్మాణం చేయకుండా ఆ నిధుల్ని విలియమ్స్ తన స్వంత ఆస్తుల విస్తరణకు ఎట్లా వినియోగించుకున్నదీ వివరాలందించింది. ది అన్నదాతా గ్రూప్ ఆఫ్ హోటల్స్‌లో తినే పదార్థాల నాణ్యం ఎంత తక్కువో, రేట్లు ఎంత ఎక్కువో సర్వేచేసి పత్రికలో వేసింది. ఇవన్నీ చూసేసరికి విలియమ్స్‌కు పట్టరాని కోపం వచ్చింది "ఎవడ్రా ఈ జీవన్ ?" అంటూ గర్జించాడు. "పిలవండి మన కిల్లింగ్ స్క్వాడ్‌ను !" అంటూ హుకుం జారీ చేశాడు. ఒకడు సైలెన్సరు అమర్చిన 303 గన్ పట్టుకుని వచ్చాడు. "షూట్ దట్ బాస్టర్డ్ !" అన్నాడు. వాడిమీద వో నోట్లకట్ట విసిరేశాడు.

కానీ జీవన అంత తొందరగా ఆ కిల్లర్‌కు దొరకలేదు. దొరికి వాడు షూట్ చేస్తే, అది గుండెలో దూసుకుపోవాల్సింది, బుజంలోగుండా ఆ బుల్లెట్ దూసుకుపోయింది. కిల్లర్ ప్రయత్నం వ్యర్థమైంది.

"సురాజ్యం" జీవన్ బొమ్మ వేసింది. షూటింగ్ ఇన్‌సిడెంట్‌ను వివరాలతో సహా ప్రకటించింది. రాజధానిలో సంచలనం ఎక్కువైంది.

"పత్రికారచయితపై హత్యాప్రయత్నం!" పత్రికా రచయితలూ, విలేఖరులూ, సంపాదకులూ జీవన్‌కు అండగా నిల్చారు. అనుమానితుల్ని అరెస్ట్ చేయాలని డిమాండ్‌చేయడం మొదలుపెట్టారు. సంపాదకీయాలు వ్రాశారు. సభలు జరిపి ప్రొటెస్టు తీర్మానాలు ఆమోదించారు.

"అమ్మా ! కొంతకాలం నువ్వు బయటకు రాకు తల్లీ ! వేడి అందుకుంది గదా?" అన్నాడు 'శాఖా.'

"బాబాయిగారూ ! నేను చేస్తున్నది ధర్మ యుద్ధం. భగవంతుడు నాకు తోడుపడి తీరాలి. నా ద్వారా వాడికి చేతులకు సంకెళ్ళు పడి తీరాల్సిందే !" అన్నది జీవన ఉత్తేజంగా.

ఒక్క దుష్టుడు చచ్చి, ఆ చావుకు నేను కారణమైతే అంతకన్నా నా జన్మకు ఇంకేం కావాలంటారు ?"

"ఇంకొకటుందమ్మా — నీ భర్తను కలుసుకోడం !"

"విలియమ్స్ అరెస్టయిన మరుక్షణం నేను మా అత్తగారింటికి వెళ్ళిపోతాను. ఆయన అక్కడికి రాకపోడు. నా ధైర్యం చూసి నన్ను మెచ్చకపోడు !"

భిన్నమేమీ కాదు. పత్రిక చిక్కిపోసాగింది. పని వాళ్ళకు జీతాలకు ఇబ్బంది ఏర్పడింది.

"బాబుగారూ ! ఆ రోజే తీసుకోమని చెప్పాను ఆ పదివేల రూపాయల్ని ! 'వద్దమ్మా— నీపేర్న వేసుకో' అన్నారు. తీసుకోండి, నిర్మొహమాటంగా తీసుకోండి. తీసుకుని వాడుకోండి!"

దాంతో పత్రిక మళ్ళీ బలం పుంజుకుంది. విలియమ్స్‌కు దడ పట్టుకుంది. ప్రభుత్వంలో అవినీతిపరులకు తలనొప్పి ఎక్కువైంది.

"బాబాయ్‌గారూ ! చూశారా ఈ ఆహ్వాన



జీవన్‌మీద తమ ప్రతాపం చూపలేక, విలియమ్స్ ప్రభుత్వంలో కొందరిని మచ్చిక చేసుకుని, 'సురాజ్యం' పత్రికకు ప్రకటనలు రాకుండా చేశాడు.

"సురాజ్యం పడుకుంటే జీవన్‌లు ఏం చేస్తారు నన్ను ?" అంటూ విలియమ్స్ అధః కరించాడు. ప్రకటనలు తగ్గిపోతే పత్రిక బలం తగ్గుతుంది. ఈ దేశంలో అనేక పత్రికలు ప్రభుత్వ పోషణ మీదనే, ఆదరంమీదనే ఆధారపడి బ్రతుకుతున్నాయి. 'సురాజ్యం' కూడా అందుకు

పత్రాన్ని ! ఎవరో రాధాదేవిగారు నాట్య ప్రదర్శనం ఇస్తున్నారట. ఆ సభకు అధ్యక్షులు సీ. ఎమ్. గారట. ప్రారంభకులు విలియమ్స్ మహాశయులట !"

"నువ్వు వెళ్తున్నావా ?"

"వెళ్ళితీరాతాను. ఇటువంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్నాను !"

"ఓ. కే. బెస్ట్ ఆఫ్ లక్ !"

జీవన రవీంద్రభారతి చేరుకునేసరికే సభలో

## జీవన మురళి

నాట్య కార్యక్రమం ప్రారంభమైంది. తాను వెళ్ళి విలేఖరుల కోసం ప్రత్యేకించిన స్థలంలో కూచుంది.

"విలియమ్స్‌గారు అప్పుడే సభను ప్రారంభించి సన్మానం పూర్తిచేసేశారా ?" కొద్దిగా నిరుత్సాహ పడిపోయింది జీవన.

"లేదు. లేదు. సి. ఎమ్. గారు ఆలస్యంగా వస్తున్నానని కబురంపేరు. అంచేత ముందు నాట్యంలో కొన్ని అయిటమ్స్ అయిపోతయ్ కదా అని మొదలుపెట్టేశారు. ఇంటర్వెల్‌లో సభా, సన్మానమూనూ !" తోటి విలేఖరి చెప్పాడు. "ఏమిటి ఆ మహానుభావుడిమీద అంత శ్రద్ధ నీకు ?"

"పుణ్యపురుషుడు కదా ?"

ఆ మాట అని రంగస్థలంమీద ఎవరెవరా అని చూసింది జీవన. చూసి ఆనందంతో కేక వేయబోయింది. ఆమె కళ్ళు మెరిసిపోతున్నాయి. సంతోష విభ్రమంలో ఆమె వొళ్ళు వణికిపోతున్నది. ఆమె ఇహ అక్కడ కూర్చోలేకపోతున్నది.

రంగస్థలంమీద మురళీకృష్ణ ఫ్లూట్ వాయిస్తున్నాడు. బాసీబొట్లు వేసుకుని, ఎడమచేత మురళి పట్టుకుని, కుడిచేత స్వర రంధ్రాలను మూసీ తెరుస్తూ అద్భుత రాగ ప్రపంచ సృష్టి చేస్తున్నాడు. పక్కనే మృదంగం ఒకరు వాయిస్తున్నారు. నట్టువాంగం ఓ ఆడమనిషి చేస్తూ పాట పాడుతున్నది. రాధ 'భామాకలాపం' అభినయిస్తున్నది. సత్యభామ హొయల్నీ, లయల్నీ, సౌందర్యాన్నీ, వేదాంతాన్నీ, శృంగారాన్నీ, సర్వాన్నీ సర్వ ప్రేక్షక మనోభిరామంగా ప్రదర్శిస్తున్నది. ప్రేక్షకుల్లో ఇసుక వేస్తే రాలనంతటి వొత్తిడి. చీమ చిటుక్కుమన్నా విన్పించేటంత నిశ్శబ్దం. రవీంద్రభారతి రంగుల రంగస్థలంలో రాధ పైనా, మురళి తన్మయీభావంతో వాయించే మురళీకృష్ణ పైనా అందరి దృష్టి వుంది.

రాధ భామా కలాపం అయింతర్వాత, తరంగం ఎత్తుకుంది. ఆ తర్వాత దశావతారాలు ప్రదర్శించింది. మూడూ కీర్తి పతాకలే కూచిపూడికి. మూడూ నర్తకికి పరీక్షా సీమలే. రాధ మూడు అయిటమ్స్‌నూ తనకు మరెవ్వరూ సాటిలేరన్నంతటి ప్రతిభావంతంగా దృశ్యమానం చేసింది.

ఇంటర్వెల్ అన్నారు. వచ్చారొచ్చారన్నారు. తెర తీశారు. సీ.ఎమ్‌నూ, విలియమ్స్‌నూ రంగస్థలం మీదకు ఆహ్వానించారు. రాధ తన వాద్య బృంద సభ్యుల్ని పేరుపేరునా పరిచయం చేసింది. మురళీకృష్ణను మరీ ప్రత్యేకంగా పరిచయం చేసింది.

సీ.ఎమ్‌గారు క్లుప్తంగా ప్రసంగించి కూచున్నారు. ఆయన తన ప్రసంగంలో కూచిపూడిని మెచ్చుకుని, ఆ నాట్యానికి రాధవంటి వారు సజీవ కీర్తి స్వరూపాలని ప్రశంసించారు.

"ఇప్పుడు విలియమ్స్‌గారు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు !" అన్నారు నిర్వాహకుల తరఫున మురళీకృష్ణ. ఘొల్లుమని నవ్వారు ప్రేక్షకులు. "ప్రారంభం ఎప్పుడో అయిపోయింది మహానుభావా!" ఎవరో అరిచారు ప్రేక్షకుల మధ్యనుండి.

"నాకు తెలుసు. కానీ ఇది లాంఛనం మన దేశ సంప్రదాయం. ఒక ప్రముఖ వ్యక్తి చేతులపైగా ఏదన్నా పవిత్రకార్యం ప్రారంభింపబడితే అది మంచిదన్న నమ్మకం మనకందరికీ వుందిగదా ! విలియమ్స్‌గారు మహాదాత. ప్రలోభాలూ అంటని మహాపురుషుడు. ఎన్నో పరిశ్రమలు నిర్వహిస్తున్న మహా నిర్మాత.' కూర్చున్న చోటినుండి జీవన మహా ఉద్రేకంతో నిలబడింది.

"ఏమండీ !" పెద్దగా అరిచింది "ఎందుకండీ ఆ దుర్మార్గుణ్ణి గురించి, సంఘ విద్రోహిని గురించి, బ్లాక్ మార్కెటియర్‌ను గురించి, శీలరహితుణ్ణి గురించి అంత గొప్పగా పొగడుతారూ ?"

"ఎవరు వాళ్ళు ? 'సిట్ డౌన్... సిట్ డౌన్ !" వేదికమీదనుంచి హెచ్చరికలు. పోలీసుల హడావిడీ, ఎంక్వయిరీలు. సభకు సంబంధించిన నిర్వాహకుల తాలూకు వలంటీర్లు జీవనను రెక్క పట్టుకుని కూచోపెట్టబోయారు.

"నన్ను ముట్టుకోకండి !" జీవన ఆడపులిలా గర్జించింది. చేతిలోవున్న సంచితోసహా అడుగుకు ఒక వరుసగా దాటుకుంటూ, పోలీసులకూ, వలంటీర్లకూ అందకుండా వేదికమీదకు పరుగెత్తింది.

## పంచ భూతాలు

విశ్వ గురుత్వాకర్షణ –
మూలంగా – తిరిగే 'పృధ్వి',
నీరావిరై అలముకొన్న 'అంబరం',
ఉదజని, ఆమ్లజనిల సమ్మేళనం 'జలం',
ఆమ్లజని, నత్రజని వగైరాల మిళితం 'గాలి'
శక్తి నిత్యత్వాన్ని పాటించే 'తేజం'
కానే కావసలు 'పంచ భూతాలు' !
ఆఫీసుల్లో ఫైళ్లను –
కదలించడానికి కావలిసిన 'లంచం',
దేశమంతటా నాట్యం చేస్తున్న 'నిరుద్యోగం
అభివృద్ధికి ఆనకట్ట వేస్తున్న 'జనాభా',
దురాచారాల తల మానికం 'వరకట్నం',
వీటన్నింటిని అరికట్టడానికి –
ప్రయత్నం చేయనివ్వని 'మన స్వార్థం'
నిజానికి అసలైన పంచ భూతాలు !

– కొరిమిల్లి సూర్యశంకర్

జీవనను గుర్తుపట్టిన జనం జీవన్... జీవన్... జీవన్... అంటూ అరుస్తున్నారు.

ఉయ్ వాంట్ టు హియర్ జీవన్... లెట్ హిమ్ స్పీక్ ... అంటూ డిమాండు చేయడం మొదలు పెట్టారు.

జీవన సరాసరి సీ. ఎమ్. దగ్గరకు వెళ్లింది. నమస్కారం చేసింది. "ఈ తుచ్ఛుడుతో కలసి తమరు ఒకే వేదికమీద కూర్చోవడం బావుండ లేదు. వాణ్ణి ముందు కిందకు పంపేసెయ్యండి!" అన్నది.

"ఎవరు మీరు ?" సీ ఎమ్ కోపంగా అన్నారు. "కనీస మర్యాద కూడా లేకుండా మాట్లాడుతున్నారు ! మిమ్మల్ని నేను మాట్లాడ నివ్వను !"

"క్షమించాలి. నేను మాట్లాడితీరతాను!" జీవన మైకు దగ్గరకు వెళ్లింది.

మైకులో పెద్దగా మాట్లాడడం మొదలు పెట్టింది. "సోదరులారా ! సోదరీ మణులారా ! రెండు క్షణాలు దయచేసి నన్ను వినండి. నేను ఈ ప్రదర్శనం పాడుచేయటానికి రాలేదు !"

జీవన్ మాటలు, ఆమె రూపం, ఆ అవయవ కదలికలు మురళీకృష్ణకు తన భార్యను జ్ఞాపకం తెస్తున్నాయి. ఆ మాటలవైపు, ఆమె రూపం వేపు, ఆకర్షితుడై కొంచెం ముందుకు వచ్చాడు. జీవన ప్రసంగిస్తోంది.

"శ్రీమతి రాధాదేవి అద్భుతమైన నర్తకి. కొద్దిక్షణాల్లో మళ్లీ ఆమె తమ నృత్య ప్రదర్శనాన్ని కొనసాగిస్తారు. ఆమె పూర్ణకళాస్వరూపం. కళ దైవస్వరూపం. ఆ స్వరూప ఆవిష్కరణకు సైతాను లాంటి విలియమ్స్ రావడమే నాకు నచ్చనిది. అతణ్ణి అరెస్టు చెయ్యండి. అప్పుడీ రాజధానిలో ఎన్నో అరాజకాలు తగ్గుతాయి."

"ఎవడీ పిచ్చివాడు ?" విలియమ్స్ పరుషంగా అన్నాడు. "ఏవిటి సీ. యమ్స్‌గారూ మీరుండిగూడా వాణ్ణి అట్లా మాట్లాడనిస్తారు. మీరుండబట్టిగాని, లేకపోతే నా మనుషులు వాణ్ణి కీలుకీలూ విరిచేసేవారు !"

"విన్నారా?" జీవన మళ్లీ తన ప్రసంగం మొదలెట్టింది. "వాడికి నేను తెలుసు. వాడి మనుష్యులకు నేను బాగా తెలుసు !"

"తెలీదు. నువ్వెవరో నాకు తెలీనే తెలీదు!"

"తెలీదూ ?" జీవన ఒక్కసారిగా తన మీసాల్ని తీసివేసింది. "నేను జీవన్‌ని కాదు. జీవనను !"

"జీవనా !" మురళీకృష్ణ ఆనందంతో ముందుకు పరుగెత్తాడు. చుట్టుపక్కల ఎవరున్నారో మర్చిపోయాడు. అమాంతం జీవనను కౌగలించుకున్నాడు. అతని కళ్లనుండి ఆనందాశ్రువులు కారిపోతున్నాయి.

ప్రేక్షకులకు ఇదంతా చకచ్చకితమైన చలన చిత్రంగా వుంది. ఇంతవరకూ తాము ప్రముఖ పత్రికా విలేఖరిగా అనుకొంటున్న వ్యక్తి మగవాడు కాదు, ఆడపిల్ల ! ఆ అమ్మాయిని పల్లిగ్గా ఓ యువకుడు, అదీ ఎవరో కాదు, నాట్య ప్రదర్శనలో పాల్గొంటున్న ఓ ఫ్లూట్ వాయిద్యకారుడు, వచ్చి అందరి ఎదుటా కౌగలించుకుంటున్నాడు. ముద్దులతో ముంచెత్తుతున్నాడు. అందుకు ఆ అమ్మాయి, జీవన అభ్యంతరం చెప్పడంలేదు. అంతేకాదు, తను కూడా అతణ్ణి గాఢంగా కౌగలించుకుంటోంది.

జీవనను గుర్తుపట్టాడు విలియమ్స్. అతని మొహంలో రంగులు మారాయి. "ఇదంతా నాకు బావుండలేదు. నేను వెళ్ళిపోతున్నాను !" అంటూ లేచినిలబడ్డాడు "వీల్లేదు. నువ్వు పారిపోవడానికి వీల్లేదు." ఆమె అరిచింది. "సోదరులారా! అయ్యా సీ. ఎమ్. గారూ, ఇది వినండి. వీడు నామీద అఘాయిత్యానికివొడిగట్టాడు. ఇంతమంది ముందు నేను కంప్లయింట్ చేస్తున్నాను. ఈ దేశంలో ఆడదానికి ఇంకా మీరు గౌరవం ఇస్తూ వుంటే, మీ తల్లుల్ని, సోదరీమణుల్ని, మీరు అభిమానిస్తూ వుంటే, వాళ్ళను క్రూరంగా అవమానించే ఈ దుష్టుణ్ణి అరెస్టు చేయించండి !"

"నేనేం ఆఘాయిత్యం చెయ్యలేదు. ఐ యామ్ ఇన్నోసెంట్. షీ ఈజ్ మ్యాడ్. షీ ఈజ్ క్రేజీ !"

"నో. నాట్ ఎట్ ఆల్! వీటిని చూడండి!" ఆమె తన దగ్గరవున్న సంచీ తెరిచింది. అందులో తను బాత్‌రూంలో కట్టుకున్న టర్కీటవలుంది.

"దీన్ని చూడండి. ఈ టవలుమీద ఆయన పేరు కుట్టారు." ఆమె ఆ టవలును సీ.ఎమ్. గారి కిచ్చింది. ఆయన చూసి తల పంకించారు.

"ఈ చొక్కా చూడండి. ఇది ఆయనది కాదూ ? ఇక్కడ చూడండి, జేబుమీద ఆయన లేబిలు !" ఆ చొక్కాను గూడా ఆమె సీ.ఎమ్. చేతికిచ్చింది.

"ఇప్పుడు చెప్పండి నేను అబద్ధాలు చెబుతున్నానేమో !"


"లేదు. లేదు. లేదు !" ప్రేక్షకులు అరుస్తున్నారు. "అరెస్ట్ విలియమ్స్. అరెస్ట్ విలియమ్స్ !"

"బాత్‌రూములో విలియమ్స్ కళ్ళల్లో సబ్బు కొట్టాను. షాంపూ కొట్టాను. అక్కడి నుంచి టర్కీటవలు కట్టుకుని, అతగాడి చొక్కా తొడుక్కుని, కిటికీలోనుండి బయటికి దూకాను ప్రాణ రక్షణార్థం. అదృష్టవశాత్తూ కింద ఓ గడ్డిమేటు వుంది. దానిమీద పడ్డాను. అతగాడి మనుషులు వెంటబడ్డారు. దేవదూతలా 'సురాజ్యం' పత్రికా సంపాదకులు ఆ సమయంలో అక్కడికి వచ్చారు. నన్ను ఓ టాక్సీలో ఎక్కించుకుని ఆ మహానుభావుడు తన ఇంటికి తీసుకు వెళ్ళాడు. నా ప్రాణాలు, మానం కాపాడాడు. నన్ను రక్షించాడు. ఉద్యోగం ఇచ్చాడు. ఇప్పుడు చెప్పండి ఏం చేద్దాం విలియమ్స్‌లాంటి వాళ్లను? ఇయాగోలు, కీచకులు. ఇంకా చావలేదు. ఆడవాళ్ళ ప్రాణాలకు, మానానికి ఈ దేశంలో రక్షణ లేదు !

జనం ఆ మాటలతో ఉద్రేకం చెందారు. విలియమ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ముందుకు త్రోసుకు రాసాగారు.

జీవనలో ఇంకా ఆవేశం తగ్గలేదు. ఉచ్ఛస్వరంతో ఇంకా మాట్లాడుతూనే వుంది. "ఈయనెవరో తెలుసా ?" మురళీకృష్ణను చూపిస్తూ అన్నది.

"తెలీదు... తెలీదు...!"






## జీ వ న ము ర ళి

"నా భర్త ! కులాన్ని కాదనుకుని, నన్ను
ప్రేమించి, పెళ్ళి చేసుకున్నారు. కానీ కట్నం
లేకుండా నన్ను తన ఇంట్లోకి ఆహ్వానించి
మన్నించారు. కానీ విధి మా ఇద్దర్నీ
హైదరాబాదుకు వస్తుంటే దూరం చేసింది !"

గాలిలోనుండి ఓ బుల్లెట్ దూసుకు
వచ్చింది. "దూ... రం... చే... సిం... ది !"
అంటూ జీవన కిందపడిపోయింది. బాడీగార్డ్సు
సీ. ఎమ్. చుట్టూ నిల్చున్నారు.

"పట్టుకోండి. పట్టుకోండి !" జనంలో
కకావికలైన పాదరక్షలు, ఆర్తనాదాలు.పోలీసులు
పరుగెత్తుతున్నారు. వలంటీర్లు పరుగెత్తు
తున్నారు. జనం పరుగెత్తుతున్నారు.
ఉన్నట్టుండి లైట్లు పోయాయి. బాడీగార్డ్సు
టార్చిలైట్లు వేశారు.

లైట్లుపోయి వచ్చేటంతలోనే, విలియమ్సు
అక్కడ నుండి అంతర్థానమైనాడు. మళ్ళీ
లైట్లు వచ్చాయి, ఎట్లా పోయినయ్యో
అట్లాగే, తిరిగి !

"అరెస్ట్ విలియమ్స్ ఇమ్మీడియట్లీ
ఎక్కడ వున్నానరే !" సీ. ఎమ్. ఆర్డర్స్ జారీ
చేశారు. "యస్ సార్" ఇన్‌స్పెక్టర్ శాల్యూట్
కొట్టి వెళ్ళిపోయాడు. జీవన స్పృహతప్పుతోంది
ఆమె గొంతు నీరసించిపోయింది. ఆమె రెండు
చేతులూ ఎత్తి సీ. ఎమ్. కు నమస్కారం
చేసింది. "సీ. ఎమ్. గారూ ! థ్యాంక్స్ ! మెనీ
థ్యాంక్స్ !!"

"మా ఊళ్ళో ఇంకోడున్నాడు. ఆడవాళ్ళ
విషయంలో వాడూ, ఇంత క్రూరుడే
మమ్మల్ని ఎంతగా హింసించాడు వాడు !!"
ఆమె చెప్పలేక చెబుతోంది. "మా మామగార్ని
ఉద్యోగం ముండి డిస్మిస్ చేశాడు, మా మామ
గార్ని దొంగచాటుగా కొట్టి డబ్బు అపహ
రించాడు, నన్ను తనకి లొంగిపొమ్మని జులుం
చలాయించాడు. నామీద కోపంతో మా వార్ని
దెబ్బలు కొట్టాడు !"

"ఇంద్రసేన్ అండీ అతని పేరు
ఆనందపురం మాజీ జమీందారు !" మురళీ
కృష్ణ అన్నాడు. "అతనికి భయపడే, మా
వివాహానికి అతను చేసే అడ్డంకులు కారణంగానే
ఊరు వదిలిపెట్టి ఇక్కడకు బయలుదేరాం !"

"ఎంక్వయిరీ చేయిస్తాను !" సీ. ఎమ్.
హామీ ఇచ్చారు.

ఆ అమ్మాయిని తొందరగా హాస్పిటలుకు
తీసుకువెళ్ళండి! క్విక్" ఆయన వెళ్ళిపోయాడు
ప్రదర్శనం అర్థాంతరంగా ఆగిపోయింది.

"సారీ!" అన్నది విచారంగా జీవన—రాధతో

"సారీ ఎందుకు జీవనా ? కృష్ణ ప్రేమిం
చిన అమ్మాయి, పెళ్ళిచేసుకున్న అమ్మాయి
ఎంత అందమైందా, ఎంత ధైర్యమైందా అ

ఇంతకాలం అనుకుంటూ వచ్చాను. ఇప్పుడు చూశాను. కృష్ణ గుండెలో నీకు ఎంత ఉన్నతమైన స్థానం వుందో నాకు తెలుసు !''

రాధ తాతయ్య అప్పుడే అక్కడికి తిరిగి వచ్చాడు పీ. ఎమ్.ను పంపించేసి. ''నువ్వు నీ కృష్ణకోసంకూడా ఎట్లా తపిస్తున్నావో వూహించుకోగలం అమ్మా ! పద. పద. హాస్పిటలుకు పద. అంతా సుఖాంతమౌతుంది. ఏం భయంలేదు !''

మురళీకృష్ణ బుజాలమీద చేతులు వేసి, అతణ్ణి జీవన వెంటనే నడిపించాడు ఆయన. మేకప్‌తోనే వాళ్ళను అనుసరించింది రాధ.

ఆసుపత్రిలో జీవనకు ఆపరేషన్ చేయవలసి వచ్చింది.

ఆపరేషన్ అయింతర్వాత రక్తం ఎక్కించవలసివచ్చింది.

'నా రక్తం ఇస్తానంటే నా రక్తం'అంటూ అందరూ ముందుకువచ్చారు. ఆసుపత్రిలో జీవన గ్రూపు రక్తంలేదు.

డాక్టర్లు మురళీకృష్ణ రక్తం, పరీక్షించి పెదవి విరిచారు. 'శాఖ'ను చూసి పనికిరాదన్నారు. రాధ తాతయ్య వృద్ధుడు పొమ్మన్నారు.

రాధ ఒక్కత్తే మిగిలింది. ఆమె రక్తమే సరిపోయింది. ఆమే బ్రతికించింది. ఆమె మూలంగానే బ్రతికిన జీవన ఆపరేషన్ అయింతర్వాత కోలుకున్నతర్వాత, మొట్టమొదటగా రాధ ఇంటికే వెళ్ళింది.

''మీరు నాకు ఏమవుతారు ?– వదినగారా? సవతిగారా ?'' వెందు వడ్డించి హాస్యం చేసింది రాధ.

''రక్తం ఇచ్చి బ్రతికించినవారు అక్కగారవుతారు. అక్క వదినాకాదు, సవతీకాదు. అక్క అక్కే !'' జీవన అన్నది.

''కృష్ణా ! నిన్ను నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాడు. జీవనవంటి స్త్రీ నీ జీవితాన్ని నందనం చేస్తుంది. వెళ్ళు. ఆమెతో వెళ్ళు. ఇంటికి వెళ్ళి మీ నాన్ననూ, బామ్మనూ చూసి వాళ్ళనుకూడా తీసుకుని మళ్ళీ ఇక్కడికే వచ్చేయ్. ఆ పల్లెటూరుకాదు, మీ వంటివారికి తగినచోటు. ఈ పట్నానికి రండి !'' వాళ్ళకు కొత్తగుడ్డలు పెట్టి, అత్తవారింటికి పంపినట్టుగా పంపించింది. ఆ మాటలామె అంటున్నప్పుడు, ఆమె హృదయంలో వున్న మూగవేదనను ఆమె ఎట్లా నిగ్రహించుకుందో ఎవరికి తెలుసు ?

''మీరు తప్పకుండా రావాలి. ఎవరున్నారు మాకు ? యాక్సిడెంట్ మిమ్మల్ని మాకు సన్నిహితుల్ని చేసింది. ఈ సాన్నిహిత్యాన్ని పొడిగిస్తానని ప్రామిస్ చెయ్ కృష్ణా ! ''

మురళీకృష్ణ ఆ ముసలాయన చేతుల్లో తన చేతులుంచి 'అట్లాగే' అన్నాడు. వాళ్లిద్దరికీ స్టేషన్లో రాధ, రాధ తాతయ్య, 'శాఖ', సురాజ్యం పత్రికా సిబ్బందీ, నాట్య కళాకారులూ, హృదయపూర్వకంగా తాత్కాలికమైన వీడ్కోలు ఇచ్చారు. ''మీరు రావాలి, మళ్ళీ రావాలి !'' అందరూ ఆర్ద్రంగా అంటూ వెళ్లిపోతున్న రైలును చూస్తూ, వాళ్ళకు చేతులూపారు.

* * *

ఝుక్...ఝుక్...ఝుక్...ఝుక్...ఝుక్

అంత ఎత్తున వున్న నీలి ఆకాశం మీది నుండి, పల్లంలో వున్న అడవి మార్గం నుండి, కాల్వల మీది నుండి, పంట పొలాలను దాటుకుంటూ, పచ్చికబయళ్లను పలకరిస్తూ, పండ్ల చెట్లను కుశల ప్రశ్నలు వేస్తూ ప్యాసింజరు రైలుబండి ఆనందపురానికి వెళ్లే చిన్నస్టేషన్లో ఆ సాయంకాలంపూట ఆగింది.

మురళీకృష్ణ– జీవన సామాన్లు తీసుకుని దిగారు.

ప్లాట్‌ఫారం నిశ్శబ్దంగా వుంది. ఎ. యస్. యమ్. పచ్చజెండా పుచ్చుకుని అటూయిటూ వూపుతున్నాడు. వాళ్ళిద్దర్నీ చూసి, గుర్తింపుగా నవ్వి 'వస్తున్నా !'' అన్నాడు. పచ్చజెండాను చూసి, రైలుబండీ ముందుకడుగు వేసింది.

ఏ. యస్. యమ్. కుశల ప్రశ్నలు వేశాడు. ''ఆరోజున గూడ్సుబండిలో ప్రయాణం బాగా జరిగిందా ?''

''బాగా ఏమో కానీ, సంఘటనాత్మకంగా జరిగింది !'' అన్నాడు మురళీకృష్ణ.

''మేం విడిపొయ్యాం దారిలో. మళ్లీ కలుసుకున్నాం !'' అన్నది జీవన వివరిస్తూ.

''జీవితమే అంత కదా ? విడిపోవడం, కలవడం, మళ్లీ విడిపోవడం ... చావుపుట్టుకల పరమ రహస్యం ఇదే !'' అన్నాడాయన వేదాంత ధోరణిలో. ''పోనీలెండి కలుసుకున్నారు. అంతే చాలు. ఎక్కడికి ? ఆనందపురానికేనా ? అయితే తొందర తొందరగా వెళ్లండి. ఇంకా లాస్ట్ బస్సు వెళ్లలేదు !'' అన్నాడు ఆ అసిస్టెంటు స్టేషను మాష్టరు.

''ఇదో శుభ సూచన !'' అనుకున్నారు వారిద్దరూ !

# వంటలు

## పత్రి

కావలసిన వస్తువులు :— ఒక కప్పు శనగ పిండి, ఒక కప్పు — నీళ్ళు, ఒక కప్పు—పెరుగు, ఒక కప్పు — తురిమిన కొబ్బరికోరు, రెండు టీ స్పూన్‌లు—నువ్వులు, ఉప్పు, కారం తగినంత.

చేయువిధానము :— ముందు గిన్నెలో పిండి, పెరుగు, నీళ్ళు, ఉప్పు, కారం అంత వేసి కలుపుకోవాలి. కలిపిన పిండిని కుక్కర్లో పెట్టి స్టీమ్ చేయాలి. పైన కుక్కర్ వెయిట్ పెట్టకూడదు. ఇడ్లీ చేసినట్టు. స్టీమ్ అయిన పిండిని దింపి, ఒక పళ్ళెములో నూనెరాసి ఆ పిండి అంతా దానిపై సమంగా చేసుకోవాలి. తరువాత మూకుడు పొయ్యిమీద పెట్టి కొద్దిగా నూనె వేసి దాంట్లో కొద్దిగా ఆవాలు, నువ్వులువేసి చిటపట లాడినాక దాంట్లో కొబ్బరికోరు వేసి క్రిందికి దించుకోవాలి. ఇపుడు పళ్ళెములో సమంగా చేసుకున్న పిండిని కత్తితో పొడుగు, పొడుగ్గా కోసుకోవాలి. పొడుగ్గ కోసుకున్న దానిపై తాలింపు పెట్టిన కోరు వేసి కొద్దిగా చుట్టచుట్టాలి. ఇలాగే అన్ని చేయాలి. చల్లారిన తరువాత తింటే చాలా రుచిగా ఉంటుంది. చేయటంకూడా చాలా తేలిక.

— యం. యాస్మిన్.

## సజ్జ వడలు

కావలసిన వస్తువులు : సజ్జలు అరకిలో, ఉల్లిపాయలు 6, పచ్చిమిరపకాయలు— సుమారు 15, ఉప్పు తగినంత.

తయారుచేయు విధము : సజ్జలు రాళ్ళు లేకుండా శుభ్రంచేసి పిండి ఆడించవలెను. ఉల్లిపాయలను, మిరపకాయలను(పచ్చి), ఉప్పును కలిపి రోటిలో మెత్తగా దంచి ఆ పిండిలో కలిపి తగినన్ని నీళ్లుపోసి వడలు పిండి మాదిరిగా కలిపి ఉంచుకొనవలెను. బాణలిలో నూనెపోసి కాగిన తరువాత ఆ పిండిని అరిటి ఆకు మీద వత్తివేయవలెను. అవి దోరగా వేగిన తరువాత వేడి వేడిగా తింటే రుచిగా ఉండడమేగాక ఇది బలవర్ధకమైన ఆహారం గూడా.

— జి. అన్నపూర్ణాదేవి

## బంగాళదుంపల హల్వా

కావలసిన వస్తువులు : బంగాళాదుంపలు— 500 గ్రా., పంచదార — 250 గ్రా., నెయ్యి లేదా డాల్డా — 100 నుంచి 125 గ్రా., ఏలకుల పొడి — 4, కిస్మిస్‌లు — కొంచెం, జీడిపప్పు లేదా వేరుశెనగ పలుకులు.

తయారు చేయు విధం ; ముందుగా బంగాళా దుంపలను ఉడికించి తొక్కతీసి బాగా ముద్ద చేయవలెను. మూకుడు లేదా దళసరి స్టీలుగిన్నెలో జీడిపలుకులు లేదా వేరుశనగ పలుకులను దోరగా వేయించి పక్కన వుంచుకొనవలెను. [వేరుశెనగ పలుకులైనచో వాటి పొట్టు తీసుకొనవలెను] అదే మూకుడులో నెయ్యివేసి సన్నటి సెగమీద బంగాళాదుంపల ముద్దను అట్లకర్రతో కలుపుతూ దోరగా వేయించవలెను. ఆ తరువాత ఆ ముద్దలో పంచదార వేసి కలుపుతూవుండవలెను. ముద్ద బాగా దగ్గరపడిన తరువాత దించి అందులో ఏలకులపొడి, జీడిపప్పు, కిస్మిస్‌లు కలుపుకొనవలెను. వేడిమీద తింటే ఈ హల్వా చాలా రుచిగా వుంటుంది. రెండు రోజుల వరకు పాడవదు.

— గుమ్మా కమల ★

---



కొంతసేపటికి బస్సు వచ్చింది—నిక్కుతూ, నీలుగుతూ ! నానాబాధ పెట్టి వాళ్ళను ఆనంద పురం బస్సుస్టాండు చేర్చింది. బస్సు స్టాండులో పాటల మాలక్ష్మి పిచ్చిదానిలా పాటలు పాడు కుంటూ తిరుగుతోంది.

"మహాలక్ష్మి అట్లా వుంది ఏవిటే నాన్నా?" అని అడిగాడు మురళీకృష్ణ బాధగా, ఇంటికి రాగానే.

"తనను పెళ్ళి చేసుకుంటానని ఆశ పెట్టాట్ట ఇంద్రసేన్. అందుకే నీ పెళ్ళినాడు అట్లా చెప్పిందట ! పెళ్ళీ లేదు, పెటాకులు లేదూ, పో. పో. అన్నాట్ట ఆ తర్వాత. దాంతో పాపం మనసు చెడిపోయింది దానికి. దానికితోడు అప్పటికే మూడు నెలల గర్భం అట. చూసే వాళ్ళూ మాట్లాడేవాళ్ళూ లేక ఆ పిండం కడుపులోనే పోయిందట. అదో బాధ. ఏమయితే ఏం ? — దాని మనసు విరిగిపోయింది. పిచ్చి పట్టింది. ఇదిగో ఇట్లా వీధులంట తిరుగుతోంది !!" అన్నది వర్ధనమ్మ జాలిగా.

"ఆ ఇంద్రసేన్ ఏమయినాట్ట ? ఊళ్ళో వున్నాడా ?"

"అవునవును. అదీ తెలీదు కదూ నీకు ! వాడికి ఆశ చావక, పెద్ద మడి చేసి గంజాయి మొక్కలు వేశాట్ట ! పోలీసులకు అది తెలిసి అతగాడిమీద కేసు పెట్టారు. అవునుగానీ, వూరంతా ఆ గుబ్బుగా చెప్పుకుంటున్నారు. అతగాడిమీద వున్న కేసుల్ని విచారించమని హైదరాబాదు నుండి తంతి వచ్చిందటగా ?"

మురళీకృష్ణ తనలో తను నవ్వుతున్నాడు. భోజనం చేస్తూ తండ్రితోనూ, బామ్మతోనూ జరిగిందంతా చెప్పేసరికి వాళ్ళకు ఆ కథంతా నమ్మాలో అక్కర్లేదో తెలియలేదు. నమ్మకుండా ఎట్లా వుండడం ? జీవన తమకు అంత డబ్బు పంపించె ! మురళీకృష్ణ డ్రాఫ్టు పంపించె తనకు ఉద్యోగంలో చేరమని ఆర్డరు వచ్చె !

వర్ధనమ్మ బుగ్గలు నొక్కుకుంది ఆశ్చర్యంగా.

"బావుంది నాయనా ! మీరూ, మీ పనులూనూ ! ఎక్కడన్నా ఏదన్నా కానిపని జరిగితే ఎంత బాధపడిపోయేవాళ్ళము !!"

"మాకు మాట మాత్రం చెప్పలేదేంరా !" పరమేశ్వరం అడిగాడు.

"ఎందుకు నాన్నా! ఈ బాధలూ, కన్నీళ్ళూ, వేదనలూ, స్పర్ధలూ మీకెందుకు ? హాయిగా మీరు కృష్ణా రామా అంటూ కాలక్షేపం చేయక !"


ఆ రాత్రి పువ్వుల మంచంమీద, వెన్నెల మడుగులో భర్తను పెనవేసుకుంటూ జీవన అన్నది. "మీకోసం ఎంత వెతికానో తెలుసా ? నా జీవితానికి మీరేగా మురళి ?" మురళీకృష్ణ అన్నాడు. "నేను మాత్రం ? నా మురళికి నువ్వేగా జీవనానివి !!" ఇద్దరి మాటలూ ఒక్కటే అన్నట్టుగా ఇద్దరూ ఒక్కరయ్యారు.

[అయిపోయింది] ●

### అంకితం

అందరికీ సుగతిని చూపే జిల్లెళ్ళమూడి అమ్మకు...

— రచయిత




2-12-1983 శుక్రవారం మొదలు 8-12-1983 గురువారం వరకు

♈ **మేషం:** రచనా రంగంలో, పత్రికా ప్రకటనలో, కళా రంగంలో మీకు అవకాశాలు బాగా లభిస్తాయి. లాభ సాటి బేరాలలో తల దూర్చుతారు. అధికారుల మూలాన కావలసిన పనులు ఎగుడు దిగుడుగా సాగుతాయి. స్త్రీలకు: అన్ని విధాల మేలైన వారమే.

♉ **వృషభం:** ఉద్యోగంలో మీకు పెంపు చెప్పదగిన వారం. గనులందు పని చేసే కార్మిక వర్గానికి అనుకూల వారం. అవకాశ వాదుల వలలో చిక్క పోరాదని హెచ్చరిక. స్త్రీలకు: నూతన నోద్యోగ ప్రయత్నాలు ఫలవంతంకా గలవారం.

♊ **మిథునం:** వివాదాలు తల ఎత్తుతాయి. ఎంత జాగ్రత్తగా మెలగితే అంత మంచిది. వారాంతంలో ఏవో యిబ్బందులు తల యెత్తుతాయి. ఎంతో లాభం భూముల మూలాన ఆశించి, నిరాశ చెందుతారు. అనుకోని విధంగా భూమి చెడిపోయిందని వేదన పడుతారు. స్త్రీలకు: వాహనం సంపాదించుకొనుటయందు శ్రమ, కొందరకు అనారోగ్యత సూచించే వారం.

♋ **కర్కాటకం:** వ్యవహార రంగంలో మీదే పై చేయిగా ఉంటుంది. చేసిన ఉద్యోగ యత్నం సఫలమయ్యే వారం. అధికారులను సందర్శించే అవకాశం చాల మంది విషయంలో చెప్పదగిన అంశం. వ్యవహార రంగంలో మీ అభిమతం నెరవేరుటకాక ధనాదాయం కూడా సమకూడుతుంది. స్త్రీలకు: వృత్తిలో పెంపు చెప్పదగిన అంశం.

♌ **సింహం:** గ్రహించండి, అప్రయత్నంగా ధన లబ్ధి గలవారం. భూ సంబంధంగా యిబ్బంది ఏర్పడుతుంది. చాల కాలంగా దూరమైన మిత్రులు గాని, బంధువులు కాని యింటికి రా గల అవకాశమున్నది. అనవసరంగా మిత్రులలో భేదాభిప్రాయాలు రానున్నవి. గ్రహించాలి. స్త్రీలకు: నూతన వస్తు సేకరణకు, సభా కార్యక్రమంలో పాల్గొనుటకు అవకాశం గలవారం.

♍ **కన్య:** ఇనుము నల్లని వస్తు వ్యాపారమందు అనుభవం గలవారికి లాభించే వారం. కోరిన వస్తు సేకరణకు అవకాశం గల వారం. సంగీత జ్ఞానం గల వారికి, నటనా సామర్థ్యం గల వారికి సదవకాశాలు లభిస్తాయి. వృత్తిలో పెంపు కనిపించటం గమనిస్తారు. స్త్రీలకు: పదిమందిలో ప్రతిష్ఠకు శుభ కార్యాచరణకు అవకాశాలు సమకూడే వారంగా గ్రహించాలి.

♎ **తుల:** సుఖశాంతులకు లోపం లేదు. అయినా అధికార వర్గం వారికి ఏదో యిబ్బంది చెప్పనైన వారం. మిత్ర గోష్ఠికి, బంధు వర్గం రాకకు అనుకూల వారం. ప్రజా సేవకు అంకితమైన వారికి గౌరవాధిక్యత ఏర్పడుతుంది. స్త్రీలకు: సాహితీ రంగాన పరు ప్రతిష్ఠ లబ్బుతాయి.

♏ **వృశ్చికం:** ఆదాయంలో అభివృద్ధి కనిపిస్తుంది. అలవాటుగా చేసే పనులలో సుగుణం కనిపిస్తుంది. రాజకీయంగా మీకు సదవకాశాలు లభిస్తాయి గ్రహించి మెలగండి. 'జాయింటు' వ్యాపారం చేసే లాగైతే శ్రద్ధాసక్తులవసరం. స్త్రీలకు: ఉద్యోగ పెంపుకు చేసిన యత్నాలు ఫలవంతమవుతాయి.

♐ **ధనుస్సు:** ముఖ్య మిత్రులు యింటికి రానున్నారు. విద్యార్థనలో పై చదువునకు అవకాశాలు ఏర్పడుతాయి. శుభ కార్యాచరణమునకు అవకాశం గల వారం. వృత్తి వికాసం గమనిస్తారు. చాలమందికి ప్రయాణానుకూలత చెప్పదగిన ముఖ్యాంశం. స్త్రీలకు: మీతో అనవసరంగా వివాద పడే వారుంటారు. గమనించండి.

♑ **మకరం:** భూమి కొనుగోలు చేయ ప్రయత్నిస్తారు. కొందరకు మాత్రమే అనుకూలం. ప్రయాణానుకూలత కూడా కొందరకే చెప్పదగిన అంశం. దూర దేశాలకు ఆటల పోటీలకై కొందరు ప్రయాణించే అవకాశం కూడా ఉన్నది. ప్రజా రంగంలో చాల మందికి ప్రవేశం ఏర్పడుతుంది. స్త్రీలకు: ఉద్యోగంలో అనుకూలత ఏర్పడనున్నది.

♒ **కుంభం:** మీ ఆదాయంలో అభివృద్ధి వారాంతానికి సానుకూలం, మీ వృత్తిలో అనుకోకుండా సమకూడుతుంది. బిడ్డల కొరకు చేసిన ఉద్యోగ యత్నం అనుకూలమే. స్త్రీలకు: చేతికి అందదగిన ద్రవ్యం అందటం గమనిస్తారు.

♓ **మీనం:** మీతో వ్యాపార రీత్యా పోటీ పడే వారున్నారు, ఊరకే పొగడే వారూ ఉన్నారు, అలాంటి వారిని గమనించి మెలగండి. పోయిన వస్తువులగూర్చి ఊరక విచారించకండి. మతిమరపునకు కారకం గ్రహానుకూలత లేకయే. దాయాదుల మూలంగా వివాదాలకు గురికా గలరు, శాంతంగా నడచుకోవటం అవశ్యం. స్త్రీలకు: చాల కాలంగా రాని 'ఇంక్రిమెంటు' రాగలదను వార్త వింటారు. నిత్యకృత్యంలో యిబ్బందులు రావు.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి ★

# వ్యక్తిగతం



సర్ చంద్రశేఖర్ వెంకటరామన్ 1930లో నోబెల్ బహుమతి తెచ్చుకుంటే ఆయన సోదరుడి కుమారుడు ప్రొఫెసర్ సుబ్రహ్మణ్య చంద్రశేఖర్‌కి 1983లో నోబెల్ బహుమతి వచ్చింది. ప్రొ. చంద్రశేఖర్ 1936 లో అమెరికా సంయుక్త రాష్ట్రాలకి మారిపోయారు. అక్కడ చికాగో విశ్వవిద్యాలయంలో ఆయన ఖగోళ భౌతికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉంటున్నారు. ఆయన పరిశోధనలు అంతరిక్షంలోని ''నల్లటి శూన్యాల''కి సంబంధించినవి! ఈ భావాన్ని ప్రకటించినందుకే 1930 ప్రాంతంలో ఆయనని సర్ ఆర్థర్ ఎడ్డింగ్‌టన్ వేళాకోళం చేశారుట. ఎక్కడో ఆకాశంలో ఒక ఖగోళం సాంద్రత విపరీతంగా పెరిగిపోయి అది ఏ రకమయిన ప్రసారాన్నీ వదలకపోతే అది అంతరిక్షంలో ఒక నల్లటి ఖాళీ కిందనే లెక్క ...



ఆయన పేరు ఇంకా ఎవరికయినా (ఈ ప్రాంతంలో!) గుర్తు ఉందా? బాల్ థాక్రే ఒకనాటి శివసేన పులి (అది ఆయన చిహ్నం.) ఒక విధంగా ఈ పార్టీ (శివసేన) ద్రావిడ కళగాన్ని పోలినదే. బొంబాయిలో దక్షిణాది వారికి (కనీసం మలయాళం, అరవవారికి) చోటు లేదని ఈయన వాదం. క్రమంగా శివసేన కాంగ్రెసు (ఇందిరా) పార్టీకి అనుబంధపు సంస్థగా మారిపోయింది. శ్రీ థాక్రే ఇటీవలే శ్రీమతి గాంధి ఒక్కరే భారత దేశాన్ని రక్షించగిలరని ఒక ప్రకటనచేశారు. ఆమె అనంతరం ''ప్రళయమ్'' అని ఆయన అభిప్రాయం...

# మార్పు కావాలా?

## ముద్దంశెట్టి హనుమంతరావు

అరుణ చాలా అమాయకురాలు.

ఆమె అమాయకత్వానికి తగ్గట్టుగా మంచి మనస్సామెది. అందుకే, ఒకరి గురించి 'చెడు' అనుకోవడంగాని, ఒకరి వెనుక 'చెడు' చెప్పడం గాని, ఆమెకి అలవాటులేదు.

నిరంతరం సన్నని చిరునవ్వు చిందిస్తూ, యెదుటివారిని పలకరిస్తుంది. ఆమె చిరునవ్వు, ఆమె మనసుకి అద్దం పట్టినట్టుగా స్వచ్ఛంగా వుంటుంది.

అయితేనేం? ఆమె మంచితనం, అమాయకత్వం, మెట్టినింట్లో మెప్పును పొందలేక పోయాయి. అదే ఆమె అనుక్షణం మానసికంగా అనుభవిస్తోన్న ఆవేదన! అదే ఆమె బాధ!

*　　*　　*

అరుణ అత్తగారు కామాక్షమ్మ, ముందు గదిలో కూచుని, చాలా రోజుల తర్వాత కనిపించిన స్నేహితురాలు కామేశ్వరమ్మతో లోకాభిరామాయణం మాట్లాడుతోంది. ఇద్దరాడవాళ్ళు మాట్లాడ్డానికి కూచున్నారంటే, వాళ్ళకి పొద్దే తెలీదంటారు పెద్దలు. "అరుణా..." కేక వేసింది, కామాక్షమ్మ.

అరుణ మెరుపులా వచ్చింది.

"ఏవిటత్తమ్మగారూ?" సవినయంగా అడిగింది.

"మా యిద్దరికీ కాస్త కాఫీ పెట్టి యివ్వమ్మా..."

"అప్పుడే పెట్టేశాను అత్తమ్మగారూ..." చప్పున జవాబు చెప్పింది, అరుణ.

"అయ్యాక తీసుకురా..."

అరుణ, లోపలికి పోయింది. కామేశ్వరమ్మ యేదో అనబోతూ వుండటం విని, చప్పున లోపల గదిలోనే ఆగిపోయింది, అరుణ.

"మీ కోడలు చాలా చురుకైన అమ్మాయి లానే వుందే కామాక్షీ! నువ్వు చెప్పకుండానే కాఫీ పెట్టేసింది చూశావా?" అంటూ ఓ చిన్న కాంప్లిమెంటు విసిరింది, కామేశ్వరమ్మ.

కోడల్ని మెచ్చుకుంటే, అత్త ఆనందిస్తుందా యెక్కడయినా? అలా ఆనందించే వాళ్ళు, ఆనందంతో గర్వించేవాళ్ళు, యే కొద్ది మందో వుంటారు. ఆ కొద్దిమందిలో కామాక్షమ్మని మాత్రం చెప్పకోలేం.

"ఆఁ... యేం చురుకోలెద్దు! ఈ రోజు గామోసు, ఆ మొద్దుమొహానికి అపాటి యింగితం తెలిసింది? ఎప్పుడూ మంటి బుక్కడంలా కూచుంటే సరిపోతుంది..." అంది కామాక్షమ్మ, అసంతుష్టిగా.

సర్వసాధారణమైన అత్తలానే ప్రవర్తించింది, కామాక్షమ్మ. అయితే కామేశ్వరమ్మకి, ఆమె మాటలు అంతగా రుచించలేదు.

"నువ్వలా అనుకుంటున్నావుగాని కామాక్షీ, యిటువంటి పుత్తమురాలు కోడలుగా లభించడం, నిజంగా నీ అదృష్టమే అనుకో. నువ్వు దూరంగా ఆలోచించడంలేదు. ఈ రోజుల్లో కోడళ్ళు యెలా వుంటున్నారో చూస్తున్నాం కదూ?... పెళ్ళయిన కొద్దిరోజులకే వేరే కాపురాలు పెట్టించేస్తున్నారు..." అందామె.

కామాక్షమ్మ, బరువుగా ఓ నిట్టూర్పు విడిచింది.

"ఏం పుత్తమురాలో యేవిటోలే కామేశ్వరీ! ఇలా ముభావంగా, సోమరిలా వుంటే, మావాడికి అసలు నచ్చదు. పెళ్ళాం హుషారుగా, చలాకీగా వుండాలంటాడు."

"మంచిదానివేనే కామాక్షీ! నాగరికత వెర్రితలలు వేస్తూ, మనల్ని పెడత్రోవ పట్టిస్తోంది తప్పించి, సంసారపక్షంగా వుండటం, స్త్రీకి యెంతో శ్రేయస్కరం... ఆడదానికి అణకువ ఆభరణంలాంటి దంటారు..."

"అదంతా ఛాందసుల మనస్తత్వం..."

"అలా అనుకోవడమే పొరపాటు. ఆచారాల్ని మార్చేస్తున్నాంగాని, స్వతస్సిద్ధమైన మనోభావాల్ని మార్చగలమా చెప్పు? 'మార్చగలం' అని అనుకుంటే, అది వట్టి భ్రమ అంటాన్నేను" అంది కామేశ్వరమ్మ.

అంతవరకూ ఆ సంభాషణ విందీ, అరుణ. కాఫీ పొంగిపోతోన్న శబ్దం కావడంతో, చరచరా వంటగదికేసి వెళ్ళిపోయింది.

ఆ క్షణం నించీ, ఆమె మెదడులో యెన్నో ఆలోచనలు. ఏవో సంఘర్షణలు!!

కాఫీ తీసుకొచ్చి, అత్తమ్మకి ఆమె స్నేహితురాలికీ అందించింది, అరుణ.

"కాఫీ అద్భుతంగా వుందమ్మా అరుణా" అంది కామేశ్వరమ్మ.

ఆమె మెచ్చుకోలు, అంతగా నచ్చలేదు కామాక్షమ్మకి. తన సమక్షంలో తన కోడల్ని యెవరైనా పొగిడితే, సహించలేని వికృత మనస్తత్వం ఆమెది. ఇలాంటి ప్రత్యేకమైన అత్తలు కొందరుంటారు మరి.

"ఆఁ... యేదోలే...... ఇవ్వాళగామోసు కాఫీ, కాఫీలా వుంది. లేకుంటే, రోజూ పానకం తాగినట్టే వుంటుందనుకో!" మొహం ముడుచుకుంటూ చెప్పింది, కామాక్షమ్మ.

కామాక్షమ్మ మనస్తత్వాన్ని యిట్టే గ్రహించింది, కామేశ్వరమ్మ. అంచేత యేమీ అనకండా మౌనం దాల్చింది.

అరుణకి, వొళ్ళు మండిపోయింది. కోడలుగా ఆ ఇంట్లో అడుగు పెట్టింతర్వాత, ఆమెకి కోపం రావడం, యిదే మొదటిసారి. తనని అత్తమ్మ ఎందుకలా కించపరుస్తూ వుంటుందో ఒకపట్టాన అవగాహన కాలేదామెకి. అయినా, వస్తోన్న కోపాన్ని బలవంతంగా అపుకుని అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

*　　*　　*

ఆ రోజు నించీ అరుణలో అనుకోకుండా ఓ విధమైన మార్పు వచ్చింది. తన మంచితనానికీ, తనలో జీర్ణించుకున్న సహనానికీ తగిన విలువ లేనపుడు, వాటిని వదిలవర్చుకోవడం, అర్థరహిత మనుకుంది. ఈ లోకంలో మంచి వాళ్ళకి సముచిత స్థానం లేదని కొందరంటూ వుంటారు, అందుకేనేమో...అనుకుంది, అరుణ.

ఆ రోజు సాయంత్రం ముస్తాబై భర్త రాకకోసమే యెదురుతెన్నులు చూస్తున్నట్టుగా, రాజు ఇంటికొచ్చేసరికి, యెదురుగా వెళ్ళింది. భార్య అలా యెదురుగా రావడంలో కొత్తదనం అగుపించి, ఆశ్చర్యపోయేడు, రాజు.

"తొందరగా మొహం కడుక్కొని తయారవ్వండి... సినీమాకి వెళ్దాం..." అంది, అతణ్ణి అనుసరించి లోపలికివస్తూ, అరుణ.

రాజు, విస్తుపోయాడు. తమకి వివాహమై సంవత్సరం కావస్తోంది? అరుణ యెప్పుడూ అంత చొరవగా అడగలేదు. అయినా, యిదేమంత పెద్దకోరికకాదుగదా... అనుకుని "ఇప్పుడే వచ్చేస్తాను. ఈలోగా కాఫీ తీసుకురా..." అంటూ తన గదికేసి వెళ్ళిపోయాడు, రాజు.

అరుణ కాఫీ తెచ్చేసరికి, రాజు తయారై తలదువ్వుకుంటున్నాడు. భార్య తెచ్చిన కాఫీ అందుకుని 'సిప్' చేస్తూ —

"మా అమ్మతో చెప్పావా?" అన్నాడు.

"చెప్పడం అంత అవసరమంటారా?" సూటిగా ప్రశ్నించింది, అరుణ.

మరింత ఆశ్చర్యపోయాడు, రాజు. అరుణలో హఠాత్తుగ యింతటి పరిణామం రావడానికి హేతువేమిటో, అతనికి బోధపడలేదు.

"అవసరమనికాదు అరుణా! కానీ, అది కనీసపు మర్యాద. అయినా, నీలో హఠాత్తుగ యిటువంటి ఆలోచనలు రావడం, ఆశ్చర్యంగానే వుంది సుమా."

"ఆ ఆశ్చర్యం విషయం తర్వాత ఆలోచిద్దాం... పదండి... మీరెందుకు బాధపడ్డం... అత్తయ్యతో చెప్పి వచ్చేస్తాన్లెండి." అంటూ లోపలికి వెళ్ళింది, అరుణ.

కామమాక్షమ్మ, వంటగదిలో వుండప్పటికి. "అత్తమ్మగారూ, అలా సినిమాకి వెళ్ళివస్తాం నేనూ, మీ అబ్బాయీను..." అన్జెప్పేసి, ఆమె సమాధానమైనా వినకుండా వెనక్కి వచ్చేసింది.

కామాక్షమ్మ కళ్ళప్పగించి, అవాక్కయి అలా చూస్తూ వుండిపోయింది క్షణం. నిజానికి, తన కోడలు అరుణేనా యీమె?... అన్న సందేహంకూడా ఆమెకి కలిగిందంటే, ఆశ్చర్యంలేదు. వంటగదిలోంచి బైటికి వచ్చి చూసేసరికి, కొడుకూ, కోడలూ వీధిలోకి వెళ్తూండటం కన్పించింది. భారంగా నిట్టూర్పు విడిచింది. ఎంతో అమాయకురాలు, పక్కా పల్లెటూరి మేళం అనుకున్న అరుణ, ఒక్కసారి యిలా మారిందేవిటి? ఈ మార్పుకి, ఎవరైనా అదృశ్యవ్యక్తుల ప్రోద్బలం, ప్రోత్సాహం వున్నాయేమో ... వుంటే యెవరై వుంటారు? ... ఆమె వూహికి అందలేదు.

అరుణ, రాజు సినిమానించి తిరిగి వచ్చాక కలిసి భోజనం చేశారు. భోజనం చేస్తున్నంత సేపూ కిలకిలనవ్వుతూ, సినిమా కబుర్లే.

వాళ్ళిద్దరూ అలా వుండటం కామాక్షమ్మకి వొంటిమీద కారం పులుముకున్నట్టుగా వుంది. ఆమె కళ్లల్లో నిప్పులు పోసుకుంది ... మౌనంగా వుండబట్టలేకపోయింది.

"అరుణా! యేవిటా పకపకలు? తొందరగా లేవండి ..." అజమాయిషీ చెలాయించ ప్రయత్నించింది.

"అది మా స్వవిషయం లెండత్తమ్మగారూ! మీమానాన మీరు పడుకోండి" అంది అరుణ ధైర్యంగానే.

కామాక్షమ్మకి చెళ్ళున లెంపకాయకొట్టినట్టయ్యింది. ఆమె నోటికి తాళం పడింది. ఎందుకూ అంటే, కోడలు అలా యెదురు చెప్తుంటే, అక్కడే వున్న కొడుకు ప్రబుద్ధుడు యేమీ అనకపోవడమే!

కామాక్షమ్మ నిస్సహాయంగా వుద్రేకాన్ని అణచుకొని వెనక్కి తిరిగొచ్చి, తన మంచంమీద చేరబడింది. ఆ రాత్రంతా ఆమెకి కంటినిండా నిద్రలేదు.

* * *

మరుచటిరోజు రాజు ఆఫీసుకి వెళ్తుంటే—

"సాయంత్రం షాపింగుకి వెళ్దామండీ. కాస్త పెందరాళే రండి ..." అని చెప్పింది, అరుణ.

"అలాగే అరుణా!" అంటూ ముందుకి నడిచాడు, రాజా.

"వచ్చినప్పుడు మల్లెపూలు తీసుకురండేం!"

"అట్లాగే ..."

అరుణ మాటలు వింది, కామాక్షమ్మ. తన పెద్దరికం చేజారిపోతున్నట్లనిపించింది.

"సాయంత్రం నేనలా కామేశ్వరమ్మ గారింటికి పురాణం వినడానికి వెళ్లాలనుకుంటున్నాను అరుణా! నువ్వు షాపింగుకి వెళ్తే యెలా?" మరో ప్రయత్నం చేసింది తన ఆధిక్యత నిలబెట్టుకోవడం కోసం.

"అత్తమ్మగారూ! హాయిగా ఇంట్లో కూచుని రామాయణం చదువుకోండి.. అంత కంటె ముక్తిమార్గం యింకేముంటుంది గనుక" చిన్నగా నవ్వుతూ అంది, అరుణ.

కామాక్షమ్మ ఆశలు, మరోసారి గాల్లో కలిసి పోయాయి. మారేం మాట్లాడలేపోయింది. పరిస్థితి మరీ విషమించకూడదనుకుంది. అట్నుంచి నరుక్కురావాలనుకుంది.

సాయంత్రం కొడుకు రాంగానే, విషయం చెప్పింది. కొడుకు తనను వెనకేసుకొస్తాడనే నమ్మింది. కాని, అలా జరగలేదు.

"అరుణ చెప్పినట్టే చెయ్యకూడదమ్మా! ఏం పోయింది?" అన్నాడు, రాజా.

"అదికాదురా..." అని యింకేమో చెప్పబోయింది, కామాక్షమ్మ. రాజు అడ్డొచ్చాడు.

"అబ్బ... విసిగించకమ్మా మరి... ఈ వయస్సులో నీలాంటి వాళ్ళు హాయిగా 'రామా', 'కృష్ణ' అనుకుంటూ ఇంట్లో కూచోవడమే మంచిది కదా!"

కామాక్షమ్మ చేసిన యీ ప్రయత్నమూ వ్యర్థమయ్యింది. ఆమె మనస్సు బాగా గాయపడింది. పరిస్థితులు యింకా విషమించకముందే ఆత్మాభిమానం దెబ్బతినకముందే, తాను ఆ ఇంట్లోంచి బైటపడ్డం మంచిదేమోననిపించిందామెకి. కాని... యెక్కడికి పోతుంది?... తన కింక యెవరున్నారని? ఒకేఒక్క కొడుకు... మరోచోట తలదాచుకుందికెక్కడా 'నా' అనే వాళ్ళింకెవరూ లేరు... ఇంక తాను చెయ్యగలిగిందేముంది! ఏదైనా అనుభవించాల్సిందే... అనుకుంది.

* * *

నాలుగు రోజులు యిట్టే గడిచిపోయాయి. కామాక్షమ్మలో సహనం సన్నగిల్లిపోతోంది. ఆ తరుణంలో కామేశ్వరమ్మ వూడిపడింది.

"రండి పిన్నిగారూ!" ఆప్యాయంగా



## కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి

★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవదని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతవేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥

# మార్పు కావాలా ?

ఆహ్వానించింది, అరుణ. "కూర్చోండి... అత్తమ్మగార్ని పిలుస్తాను..." అంటూ లోపలికి వెళ్ళి అత్తమ్మగారికి చెప్పింది అరుణ.

కామాక్షమ్మ వెళ్ళేసరికి, కామేశ్వరమ్మ కూచునేవుంది. "ఏంచేస్తున్నావే కామాక్షీ!" ప్రశ్నించింది కామేశ్వరమ్మ.

"బియ్యం బాగుచేస్తున్నానే్లే..."

"నువ్వు చెయ్యడమెందుకూ ? పనిమనిషి యేమయ్యిందేంటి ?"

"వాళ్ళు సమంగా చెయ్యరట... అందుకే నన్ను పురమాయించింది మా కోడలు." భారంగా నిట్టూరుస్తూ అంది కామాక్షమ్మ.

"ఔనూ – మొన్న పురాణ కాలక్షేపానికి నువ్వు వస్తావని యెదురుచూశాను. రాలేదేం ?"

కామాక్షమ్మకి నిజం చెప్పడం యిష్టం లేకపోయినా, చెప్పక తప్పలేదు.

"ఆ రోజు మా అబ్బాయి, కోడలు షాపింగు కెళ్ళారే... అందుకే రాలేకపోయాను."

"మీ కోడలు ముభావంగా, మంటి బుక్కడంలా వుంటుందన్నావు ... ఇప్పుడు అంత హుషారుగా భర్తతో తిరుగుతోందా యేవిటి ?"

"ఇన్నాళ్ళూ అలానే వుండేది కామేశ్వరీ! హఠాత్తుగా యిప్పుడెలా మార్పు వచ్చిందోగాని, ఆవిడతో మాట్లాడలేకపోతున్నామనుకో! పెద్దదాన్నన్న గౌరవమైనా లేకండాపోతోంది. నామీదే అధికారం చెలాయిస్తోంది. ఏం చెయ్యను ? అది నా ఖర్మ..." అని అంటున్నంతలో అరుణ రెండు కప్పులతో కాఫీ తీసుకొచ్చింది. చెరో కప్పు అందించింది.

కోడల్ని చూడగానే, కామాక్షమ్మకి చెమట్లు పట్టాయి. తన మాటలు ఆమె విన్నదేమోనన్న భయం అది.

"అత్తమ్మగారూ... యేమంటున్నారు ?" మెల్లగా, సౌమ్యంగా ప్రశ్నించింది అరుణ.

కామాక్షమ్మ చేతిలోనున్న కాఫీ కప్పు ఒక్కసారి తొణికింది.

"అ...అబ్బే !... యేంలేదమ్మా... యేవీ లేదు..." అంది కంగారుగా.

ప్రేక్షకురాలిలా గమనిస్తోంది కామేశ్వరమ్మ.

"అబద్ధాలెందుకు చెబుతారు అత్తమ్మ గారూ? అంతా విన్నానే్నను. ఈ రోజే కాదు. కొద్ది రోజుల క్రితం కూడా కామేశ్వరమ్మ పిన్నిగారితో యేం చెప్పారో కూడా విన్నాను. నా మంచి తనాన్ని, నా సహనాన్ని, నా చేతగాని తనంగానూ, నన్నో మొద్దు మొహంగానూ పరిగణించారు మీరు. నేనెంతగా బాధపడ్డానో ఆ పరమాత్ముడికే తెలుసు. నాలో మార్పువస్తే, యెలాంటి అనుభూతిని పొందుతారో చవిచూపించాలని ఈ వారంరోజులూ యిలా ప్రవర్తించాను. అంతేగాని మిమ్మల్ని నొప్పించాలనికాదు ... మీమీద అధారిటీ చెలాయించాలనీ కాదు. ఇది నిజం ... మీ అబ్బాయిగారితో కూడా ఈ విషయాన్ని చెప్పాను" చిన్నగా నవ్వుతూ అంది, అరుణ.

కామాక్షమ్మ మొహం విప్పారింది. ఆమెలో యెక్కడలేని ఆనందం, వుత్సాహం ఉప్పొంగినయ్.

"అంతేనా అరుణా ! ఏమో, నువ్వు మారి పోయావనుకొని, నా మనసు పరిపరి విధాల ఆలోచించింది. ఒక్కక్షణంలో నా బ్రతుకుపట్ల నాకే అసహ్యం వేసింది కూడాను" అంటూ చెప్పుకుపోయింది కామాక్షమ్మ.

"అయితే, యిప్పుడు చెప్పండి అత్తమ్మ గారూ ! నాలో మార్పు కావాలంటారా ? నేనూ హుషారుగా తిరగాలంటారా ?" చిలిపిగా నవ్వుతూ అంది.

"వద్దమ్మా అరుణా, వద్దు ... నువ్వు మొదటి అరుణలానే వుండు. ఏదో నేను బ్రతికి వున్నన్నాళ్ళూ యిలా కాలం వెళ్ళబుచ్చనీ. అదే నాకు పదివేలు ... ఇంకెప్పుడూ నిన్ను కించపర్చే మాటలనని హామీ యిస్తున్నాను" అంది కామాక్షమ్మ యేకబిగిని.

కామేశ్వరమ్మ పకపకానవ్వింది. "కామాక్షీ! నేను మొదట్లోనే చెబితే విన్నావూ ? ఏవో అర్థంలేని మాటలని ఆమెని అనవసరంగా రెచ్చగొట్టావు. పుట్టింటి నుండి మెట్టినింటికి యెన్నో ఆశలో, యెన్నో కలలు కంటూ వస్తారు అరుణలాంటి అమ్మాయిలు. వాళ్ళని ఆప్యాయతతో, ఆదరణతో చూడ్డం మానేసి నీలాంటి కొందరు అత్తలు వాళ్ళ మనసుల్ని మార్చేసి, వారిలో జుగుప్స కలిగిస్తున్నారంటే, అతిశయోక్తి కాదేమో! వాళ్ళని తిప్పుకోవడంలోనే వుంది అత్తల ఔన్నత్యం! ఆడిపోసుకుంటే, యెప్పటికయినా అనర్థాలు తప్పవు" అంటూ అరుణకేసి తిరిగింది, కామేశ్వరమ్మ.

"మీ అత్తకి మంచి గుణపాఠం చెప్పావమ్మా! నిన్ను మారమని మరెప్పుడూ చెప్పదులే." నవ్వుకుంటూనే చెప్పింది.

అరుణకి నవ్వాగిందికాదు. బలవంతంగా ఆపుకుంది.

"వస్తానుండండి పిన్నిగారూ ! అవతల వంటగదిలో పనుంది." అంటూ అక్కణ్ణించి నిష్క్రమించింది.

"హమ్మయ్యా ! ఇప్పుడు నా కెంతో తృప్తిగా వుందే కామేశ్వరీ ! నిజానికి గాలివాన వెలిసినట్టయినాదనుకో ! " తృప్తిగా నిట్టూరుస్తూ అంది, కామాక్షమ్మ.

"కోడలిలో మార్పు రావాలని మొదట్లో కోరుకున్నావు... మరి, యిప్పుడేమంటావే ?" చిలిపిగా ప్రశ్న వేసింది, కామేశ్వరమ్మ.

"అబ్బే ! ఏ మార్పూవద్దు. చెప్పానుగా, తప్పు నాదేనని... మా కోడలికేం ?... మాంచి హుషారయిన అమ్మాయి. ఎంత మంచి మనసనీ ! వంటకూడా ప్రహ్మాండంగా చేస్తుందే..." ★

## కుందుర్తి ప్రథమ వర్ధంతి :

వచన కవితా పితామహుడు శ్రీ కుందుర్తి ఆంజనేయులు ప్రథమ వర్ధంతి అక్టోబర్ 25న శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో జరిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ చేకూరి రామారావు అధ్యక్షత వహించారు. నయాగరా కవిగా బయటికి వచ్చిన కుందుర్తి తెలంగాణా అనే కావ్యం రచియించిన తర్వాత వచనకవిగా నిలబడి, జీవిత మంతా వచన కవితకే ధారపోశాడు. ప్రజల పోరాటం చిత్రించాడు. ప్రలోభాలకు లోనుకాక నిజాయతీతా నిలవదొక్కుకుని, వచన కవితను ఉద్యమ స్థాయికి తెచ్చాడు. తెలుగు కవితా సంప్రదాయాలను విడనాడకుండా. అభ్యుదయ భావాలతో కవిత నడిపాడు. ఈ నేల ఎవరిది ? కొందరి దంటే ఒప్పుకోదు చరిత్ర అని తెగేసి చెప్పాడు— అన్నారు రామారావు; పిదప తీరా నేను కాస్త ఎగిరిపోయాక— అనే కుందుర్తి కవితా సంపుటిని రామారావు ఆవిష్కరించారు. ప్రముఖ పత్రికా రచయిత శ్రీ ఎ. బి. కె. ప్రసాద్ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తూ, ఏది కవిత అనే చర్చకు అవకాశ మిచ్చిన వారు నయాగరా కవులనీ, విదేశాలలో వచన కవిత కూడా ప్రజోద్యమంతా సంబంధం కలదేనని, ప్రజాసమస్యలే వచన కవితకు ప్రాణమని, నాయాగరా కవులు ప్రాచీన సంప్రదాయంతో కవిత చెప్పలేక కాదని, ప్రజల సమస్యలను పరిష్కరించదలచుకొన్నారు కనుకనే వచన కవితను చేపట్టారని, కుందుర్తి కళా కావ్యాలు వచనకవితలోచెప్పి, వాటికికూడ ఆద్యుడయాడని అన్నారు. డాక్టర్ శివారెడ్డి,నిఖిలేశ్వర్, ఎం. ఎల్. నరసింహారావు కుందుర్తి కవితపై ప్రసంగించారు. శ్రీ ఎన్. గోపాల చక్రవర్తి ఫ్రీవర్స్ ఫ్రంట్‌వారి అవార్డును డాక్టర్ ఎన్. గోపీకి అందజేశారు. ప్రారంభంలో శ్రీ కుందుర్తి వాణిని టేప్ రికార్డులో వినిపించారు. ప్రముఖ వచనకవి, చిత్రకారుడు శ్రీ శీలా వీర్రాజు ఫ్రీవర్స్ ఫ్రంట్ ఆశయాలు వివరించారు.

# హైదరాబాద్ నోట్‌బుక్

## సంస్కృత ప్రాకృతాల ఆదాన ప్రదానం :

అక్టోబర్ రెండవ వారంలో నాంపల్లిలో జరిగిన హిందీ సాహిత్య సభ సమ్మేళనంలో ఉస్మానియా విశ్వ విద్యాలయం సంస్కృతాచార్యులు డాక్టర్ ప్రమోద్ గణేశ్‌లాలే సంస్కృత ప్రాకృతాల ఆదాన ప్రదానాలు అనే విషయమై ప్రసంగించారు. ప్రాకృతం ఋగ్వేద కాలం నుంచి కూడ వ్యవహారంలో ఉంది. సంస్కృత ప్రాకృతాలు రెండూ సమానాంతరంగా అభివృద్ధి చెందాయి. లేకపోతే బుద్ధుడు అతి గహనమైన తత్త్వ విషయాలను ప్రాకృతంలో ఉపదేశించడం సాధ్యం కాదు. పిటకాలు, జైన సాహిత్యం ప్రాకృతంలో వెలువడిందంటే, ప్రాకృతానికి ప్రజాదరం స్పష్టం. ప్రాకృత సంస్కృతాలు రెండింటికీ రాజాశ్రయం లభించింది. ఆలంకారికులు ప్రాకృత స్థాయిని పైకి ఎత్తారు. తమ లక్షణ గ్రంథాలలో ఉదాహరణలను ప్రాకృతంనుంచి తీసుకున్నట్టు సంస్కృతంనుంచి తీసుకోలేదు. హేమచంద్రుడు తన కావ్యానుశాసనంలో ప్రాకృతం నుంచే ఉదాహరణలు ఎక్కువగా ఇచ్చాడు. ప్రాకృతానికి సంస్కృత వ్యాఖ్యలు, సంస్కృతానికి ప్రాకృత వ్యాఖ్యలూ చేశారు. సంస్కృత కవులు ముక్తకాలు ప్రాకృతంలో చెప్పారు. దీనినిబట్టి భాష ప్రధానం కాదు, అవసరం, అభిరుచి ప్రధానమని స్పష్టమవుతుంది. నేడు మనం కూడా భాషా విషయంలో పూర్వుల ఉదార దృష్టిని అలవరచుకోవాలి — అని డాక్టర్ లాలే ప్రసంగించారు.

## రోడ్ల మరమ్మత్తు :

నవంబరు 20వ తేదీ, నగరంలోని రోడ్లను మరమ్మత్తు చేయాలని పురపాలక సంస్థ నిర్వహణ మంత్రి శ్రీ రామకృష్ణుడు అధికారులకు చేసిన ఉత్తర్వు నగరవాసులకు నూతనోత్సాహం కలిగించడం లేదు. జంటనగరాలలో పెక్కు ప్రాంతాలలో కంకర కుప్పలు పోసి వుండడం సంవత్సరాల తరబడి కనిపిస్తున్నా, ఏ రోడ్డు మరమ్మతుకు నోచుకోలేదు. దీనికి పెద్ద ఉదాహరణ 86వ రూటు. ఇలా ఎన్నో రోడ్లు గోతులతో, గతుకులతో అనాదిగా వున్నాయి. వాటిని చూచినప్పుడల్లా మిత్రుడు జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి వ్యంగ్య రచన "ఏ రోడ్డు చరిత్ర చూచినా ఏమున్నది గర్వ కారణం" జ్ఞాపకం వస్తూంటుంది.

## పోస్టర్లపై మహిళల దాడి :

భారతీయ జనతాపార్టీ స్వచ్ఛంద సేవికలు అక్టోబర్ 21న 'మహిళల గౌరవ పునరుద్ధరణ' కార్యక్రమంలో భాగంగా అశ్లీలమైన పోస్టర్లకు తారు పూయడం, లేక చించివేయడం జరిపారు. అశ్లీలమైన ప్రకటనల పోస్టర్ల, కరపత్రాల పైన తీవ్రచర్యలను తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ అక్టోబర్ 22 న సచివాలయం ముందు ప్రదర్శనలు జరిపారు.

## ఉపశ్రుతి

ఏమిటి హడావుడిగా పరుగెత్తుతున్నారు?— అనడిగాను ఎక్కడికో కంగారుగా వెళ్లుతున్న ఒక మిత్రుణ్ని. ఏమీలేదు. మా అమ్మాయి ఆస్పత్రిలో వుంది. రెండు రోజులుగా ప్రసవించ లేదు— అన్నాడు ఆయన. ఎంత వెర్రివారండీ మీరు ! కోఠీ నుంచి సికిందరాబాదుకు వెళ్లే 86 రూటు బస్సులో తీసుకువెళ్లలేకపోయారా? సుఖ ప్రసవమౌతుంది— అని సలహా ఇచ్చారు మా సంభాషణ వింటున్న ఒక పెద్ద మనిషి.

— తిరుమల రామచంద్ర *

# అవీ ఇవీ అన్నీ

## "నెఫ్జా" నాటక కళాపరిషత్తు ఇరవైవ వార్షికోత్సవం

నెల్లూరు ఫిలిం జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యాన, 1984 ఫిబ్రవరి రెండవ వారంలో 'నెఫ్జా' నాటక కళాపరిషత్తు ఇరవైవ వార్షికోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంలో, నెల్లూరు టౌన్‌హాలులో భారీయెత్తున నాటక, నాటిక, ఏక, బహుపాత్రాభినయ పోటీలు అఖిల భారత స్థాయిలో జరుపబడుతాయి. ప్రవాసాంధ్రులు కూడా ఈ పోటీలలో పాల్గొనవచ్చును. సినిమా నిర్మాతల, దర్శకుల, నటీనటుల, యితర సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో పోటీలు నిర్వహించబడుతాయి. డిసెంబరు 7వ తేదీలోగా దరఖాస్తులు ఈ కింది చిరునామాకి చేరాలని కార్యదర్శి తెలియ చేస్తున్నారు.

వివరాలకు : కార్యదర్శి, "నెఫ్జా" నాటక కళాపరిషత్తు, నియర్ అనితాహాల్, నెల్లూరు – 3.

# తెలుగులిపి సంస్కరణసంఘం సూచించిన లిపిస్వరూపం

1958వ సం॥లో శ్రీ ఎస్.బి.పి. పట్టాభి రామారావు గారు రాష్ట్ర విద్యాశాఖామాత్యులుగా ఉన్న సమయంలో కీ.శే. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారి అధ్యక్షతన కీ.శే. శ్రీ కప్పగంతుల లక్ష్మణ శాస్త్రిగారు కార్యదర్శిగా, కీ.శే. శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు, విద్వాన్ శ్రీ కె. సుబ్బరామప్పగారు, డా॥ జి.వి. కృష్ణారావు గారు, శ్రీ పెద్దింటి రామా నాయుడు గారు, కీ.శే. శ్రీ పప్పూరు రామాచార్యులు గారు సభ్యులుగా లిపి సంస్కరణ సంఘం ఏర్పడింది. దీని ప్రధాన కార్యక్రమం యాంత్రిక సౌలభ్యానికి అనువుగా మన లిపిని మార్పు చేయడం. ఆ సంఘం తన నివేదికలో ఎక్కువ మార్పులు లేకుండా లిపి స్వరూపాన్ని సూచించింది. అందులో చేసిన ముఖ్యమైన మార్పులేమంటే అర్ధాక్షరా సంయుక్తాక్షరాలలో అర్ధాక్షరాలన్నీ ప్రక్కనడం చాలనటం; హల్లు స్వరూపాన్ని 'క్=క, గ్=గ, చ్=చ, ప్=ప, య్=య, మ్=మ' ఈ విధంగా అన్ని అక్షరాలకు నిర్దేశించటం; ఈ మార్చిన హల్లు స్వరూపాలకు "ా, ొ, ో"లు చేర్చి కా కా కో, గా గా గో, పా పా పో"లుగా వచ్చునట్లుగా చేయటం; ఇకార ఎకారాలతో కూడిన హల్లులు అంటే కి వి రి డి కె వె రె డె మొదలయినవి, ప్రక్కన "ʼ" గుర్తు ఇచ్చినట్టయితే వాటి దీర్ఘాలను తెలపటం "ఖ ఘ ఛ ఝ ఠ ఢ థ ధ ఫ భ"లు "క+ గ+ చ+ జ+ ట+ త+ ద+ ప+ బ+"లు చేస్తే చేయవచ్చు లేకపోతే అసలు అక్షరాలే ఉంచవచ్చునని సూచించటం; "ఆ ఈ ఊ స్వరూపాలు "అా ఇా ఉా లేక ఊ"లుగా ఉండాలనటం జరిగింది.

శ్రీ పి.వి. నరసింహారావుగారు రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో తెలుగు అకాడమీ ద్వారా ఒక సమావేశాన్ని జరిపించి 'లిపి సంస్కరణ సంఘం సిఫార్సులను అమలు జరపాలా' అన్న విషయంపై చర్చలు జరిపించి చివరకు వత్తులు ప్రక్కన ఉంచాలని తీర్మానించారు. అయినా ఆ తీర్మాన సూచనలు ప్రభుత్వ ఆధ్వర్యాన నడుస్తున్న టెక్స్ట్ బుక్ ప్రెస్ ఉద్యోగులు, గవర్నమెంట్ ప్రెస్ ఉద్యోగులు విభిన్నాభిప్రాయాలు ఉండటం వలన అమలు జరగలేదని చెప్పవచ్చు. అదీకాక ఫౌండ్రీ నడిపేవారు కూడా వత్తులు ప్రక్కన వస్తే స్థలం ఎక్కువ ఆక్రమిస్తుందనే అభిప్రాయం కలిగి ఉండటం ఒక కారణం. 1950 సం॥లో వెలువడిన స్వదేశీ టైప్ ఫౌండ్రీ కేటలాగ్‌లో ఇలా ఉంది: "....ఇటీవల తయారు చేయబడిన కొన్ని టైప్స్‌లో సంయుక్తాక్షరముల చేరిక ప్రక్కలందేర్పడిన కారణమున పంక్తులు యెక్కువగ పెరుగుటయు, దానకాగితము, పని, అధిక మగుటయు, గలదు. అందువలన ఈ బాడీలలో పాత పద్ధతి ననుసరించుటే ఉత్తమమును, లాభకరమును, అని గ్రహించుటచే అదే పంథాను త్రొక్కి యుంటిమి."

కాని వాస్తవంగా చూచినట్లయితే మానోలోనూ, లైనోలోనూ, ఆఖరికి ఫొటో సెట్టర్‌లోనూ కూడా వత్తులు ప్రక్కకు వస్తున్నాయి. మానోలో చేతి కంపోజింగ్‌లో కంటె 30 శాతం ఎక్కువ విషయం కంపోజ్ అవుతోంది. ఫోటో సెట్టర్‌లో 5 పాయింట్‌లో కూడా కంపోజ్ చేయవచ్చు. మన లిపిలో తరచుగా వచ్చే వత్తులు ప్రక్కన వచ్చేవే కాబట్టి అన్నీ ప్రక్కకు తెచ్చినట్లయితే తక్కువ పాయింట్‌లో కంపోజ్ చేసుకోవచ్చు.

లిపి సంస్కరణ సంఘ సిఫార్సుల ననుసరించి మన లిపి స్వరూపం ఎలా ఉంటుంటుందో తెలియజేసే ప్రయత్నం ప్రభుత్వంచే నడపబడే ప్రెస్ వారుగాని, ప్రైవేటు ఫౌండ్రీవారుగాని చేయకపోవుటచే కొంత విషయాన్ని ఆ లిపిలో కంపోజ్ చేసి ప్రచురిస్తున్నాము. దీనిపై పాఠకులు తమ అభిప్రాయాలని తెలియచేయ గోరుతున్నాము.

అగజానన పద్మార్కం గజానన మహర్నిశం
అనేకదంతం భక్తానాం ఏకదంత ముపాస్మహే
గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః
సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాల నందనః
పార్థో వత్సస్సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్
దేహీనిత్యమవధ్యోయం, దేహే సర్వస్య భారత
తస్మాత్సర్వాణి భూతాని, నత్వం శోచితుమర్హసి
వాఁడి మయూఖముల గలుగువాఁడు పరాంబుధిఁ గ్రుంకె ధేనువుల
నేఁడిట వచ్చెనేకతమ, విష్ణు మెయిన్ బవదగ్ని హోత్రముల
పోఁడిగ వేల్వఁగా బడియెఁ, బాంథ్యమబో యెఁగ ముండు నేనియున
రాఁడు వనంబులోనముగ రాక్షస పక్షిగ బాధనొందెనో
ఇండారుమీఁది కోపమున — మగువ బోరిరు దగ్గుళ్లె గదల
మండఁగ నెత్తురుల పెదర — మాంసము పిండిగ నెంప నగ్గులాం
డాండ ధరిత్రిపైఁ దొరంగ — నాల్గుడు మేనులు వ్రాల వానిలో
మండక పాణముల వెడలె — మబ్బువ గాంలఁగ దేవకామినుల.

సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణి
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా.
యథా దీపో నివాతస్థో, నేఙ్గతే సోపమా స్మృతా
యోగినో యత చిత్తస్య యుఞ్జతో యోగ మాత్మనః
గదఁ గాని యశ్వత్థామం
గదియుఁడు దండోలి కాదను — కైవడి మొలఁగుల
వదలించు దానిఁ గనికడు
బెదరి యతఁడు రథముడిగ్గి — పిఱిదికి జనియెన.

కుండము, కర్దుగుటువ,
చాయి, చాయ, చోటి,
జూషము, టాణా, డాకా, డోలము,
గ్రంథముద్రేర్యము, పాలము
బాగ్యము, మూరకుతవము,
ఉద్ఘాటన, ఉచ్చారణ, నిర్ఝరము,
గరిష్ఠ, స్నానము, బుద్ధి,
నిష్ఫలము, దుర్భరము

మద్దాలి రాఘవ రామచంద్ర రావు.

## ఉత్తరాలు

[6వ పేజీ తరువాయి]

### సరాగమాల

"ఆ రోజుల్లో రెండే రెండు కంపెనీలు గ్రామఫోన్ కంపెనీ, సరస్వతి స్టోర్సు; పేరు హెచ్. ఎం. వి. కొలంబియా రెండయినా నిజానికవి అవినాభావసంబంధం..." అని అన్నారు. ఆ రోజుల్లోనే మూడవ కంపెనీ "ట్విన్" వుండేది. ఆ కంపెనీ రికార్డు యిచ్చిన వారింతకు ముందు ఆకాశవాణి, భక్తిరంజని ప్రోగ్రామ్స్‌లో పాల్గొనేవారు ప్రస్తుతం విజయవాడలోనే వుంటున్నారు. వారినుండి వివరాలు పొందవచ్చునా!

చలమలశెట్టి పాండురంగారావు,
చిలకలపూడి.

★ జవాబు :

నేను 'సరాగమాల' వ్రాసేటప్పుడు 'ట్విన్' కూడా గ్రామఫోన్ కంపెనీలో ఒక భాగమే. ఈ లేబిల్‌పై కొత్త సినిమా పాటలు విడుదలయేవి కావు. బాగా అమ్ముడు పోయిన హెచ్. ఎం. వి. రికార్డుల పాటలనే (ప్రేమలేఖలు, సంతానం, దేవదాసు యిత్యాది) తిరిగి యీ లేబిలుపై వేసి చవక ధరకు అమ్మేవారు.

దక్షిణ దేశంలో 'ట్విన్' ముద్రపై ప్రైవేటు పాటలు కూడా ఆగి అప్పటికి చాలా కాలమైనది. మీరు చెప్పిన గాయక బృందాలు అంతకుముందు పాడి వుంటారు.

— వి. ఎ. కె. రంగారావు.

### పున్నామనరకం

ఇచ్ఛాపురపు రామచంద్రంగారి 'మళ్ళీ ఆడపిల్లే' కథలో శేషాద్రిగారి అభిప్రాయం "పుత్రులు తలిదండ్రులకే యీ రోజుల్లో భూమ్మీదే పున్నామనరకం సృష్టిస్తున్నారేమో" సుధాకరం మనసు మార్చుకోడం బాగుంది.

స్వరాజ్యలక్ష్మి, ఆనంద గజపతిరావు (తెట్టంగి)

### న్యూఢిల్లీ లేఖ

పత్రిక ఇంటికి రాగానే, "న్యూఢిల్లీ లేఖ" చదవనిదే తోయటంలేదు. అటువంటిది ఈమధ్య మీరు ప్రచురించలేదు. అసలు విషయం ఈ వారం తెలుసుకొని సమాధానపడ్డాము.

పెన్మెత్స సూరిబాబు,
సాగి నాగబాబు, రాజా,
హైదరాబాదు ★

*Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3 Editor: S. Radhakrishna.*

